thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 31 | కరీంనగర్ శుక్రవారం, 11 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝాంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.





## సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్యానెల్ లిస్ట్ రెడీ చేస్తున్న ప్రభుత్వం

## లిస్ట్‌లో రవిగుప్తా, సీవీ ఆనంద్, శివధర్‌రెడ్డి, మరో ఇద్దరు ఐపీఎస్‌లు!

### ఐదుగురి పేర్లు యూపీఎస్సీకి పంపేందుకు ఏర్పాట్లు

హైదరాబాద్ : రాష్ట్రంలో రెగ్యులర్ డీజీపీ నియామకం కోసం ప్యానెల్ లిస్ట్ సిద్ధం చేసే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్యానెల్ లిస్ట్‌ను రెడీ చేసి.. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)కు ప్రతిపాదనలు పంపనుంది. డీజీపీల నియామకంపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. దానిని అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన 8 రాష్ట్రాలపై కంటెంప్ట్ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పుడు డీజీపీ పదవికి ప్యానెల్ లిస్ట్?ను సిద్ధం చేస్తున్నది. కొత్త డీజీపీ నియామకం కోసం సీనియార్టీ ప్రకారం చూస్తే రవి గుప్తా, సీవీ ఆనంద్, బి. శివధర్ రెడ్డి, సౌమ్య మిశ్రా, శిఖా గోయల్ తో పాటు ప్రస్తుత యాక్టింగ్ డీజీపీ జితేందర్ కూడా పోటీలో ఉన్నారు. అయితే ఆయనకు ఇంకా 5 నెలల సర్వీస్ మాత్రమే ఉన్నది. సీనియార్టీ ప్రకారం చూస్తే రవి గుప్తా.. ప్రస్తుతం హోం స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్నారు. ఈయన 1990 బ్యాచ్?కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి. ఆయన 2023 డిసెంబర్ నుంచి 2024 జులై వరకు డీజీపీగా పనిచేశారు. ఇక ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న శివధర్ రెడ్డి 1994 బ్యాచ్ అధికారి. వచ్చే ఏడాది డిసెంబర్‌లో రిటైర్ కానున్నారు. దీంతో ఆయన పేరును కూడా ప్రభుత్వం ప్రతిపాదనల్లో చేర్చనుంది. సీవీ ఆనంద్ (1991 బ్యాచ్) హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ గా పనిచేస్తున్నారు. ఆయన కూడా 2027 డిసెంబర్ లో రిటైర్ కానున్నారు. ఈ ఇద్దరి పేర్లను కూడా ప్రభుత్వం ప్యానెల్ లిస్ట్‌లో చేర్చనున్నట్టు తెలుస్తున్నది. సౌమ్య మిశ్రా, శిఖా గోయల్‌తో పాటు ఏడీజీలు మహేశ్‌మురళీధర్ భగవత్, సజ్జనార్, స్టీఫెన్ రవీంద్ర కూడా ఉన్నారు. అయితే వీరి సర్వీసు ఎక్కువ కాలం ఉన్నది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం డీజీ కేడర్‌లోని సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపాలి. యూపీఎస్సీ ముగ్గురు అధికారుల ప్యానెల్‌ను సిఫారసు చేస్తుంది. వీరిలో ఒకరిని డీజీపీగా నియమించాలి. అర్హతల్లో 30 ఏండ్ల సర్వీసు, డీజీ లేదా ఏడీజీ ర్యాంక్, కనీసం 6 నెలల సర్వీసు మిగిలి ఉండడం, రెండేండ్ల పదవీకాలం ఉండాలి.

**డీజీపీల నియామకంపై సుప్రీం ఉత్తర్వులు :** డీజీపీల నియమాకం కంటెంప్ట్ కేసులో సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరిలో ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన బెంచ్ ఈ కేసును విచారించింది. ఈ ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు 8 రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, పంజాబ్ , బిహార్, ఒడిశా, కేరళ,ఉత్తరప్రదేశ్ , రాజస్థాన్ ఉన్నాయి. కోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. అలాగే, ఈ రాష్ట్రాలు తమ డీజీపీ నియామక ప్రక్రియలో 2006 తీర్పును ఎలా పాటించాయో వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణ మే 6 కు వాయిదా వేసింది. అలాగే, సుప్రీంకోర్టు ఈ విచారణలో భాగంగా "రాష్ట్రాలు తమ రాజకీయ అవసరాల కోసం డీజీపీ నియామకాలను వాడుకోవడం సరికాదు" అని కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రకాశ్ సింగ్ కేసులో ఇచ్చిన తీర్పు ప్రకారం.. డీజీపీల నియామకం పారదర్శకంగా, యూపీఎస్సీ సిఫారసు ఆధారంగా జరగాలని ఆదేశించింది.



## వారణాసిలో నేడు ప్రధాని మోడీ పర్యటన

ఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం వారణాసిలో పర్యటించ నున్నారు. దీనిలో భాగంగా రూ.3,884 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఉదయం 10 గంటలకు ఆయన వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని దాదాపు రెండున్నర గంటలు బస చేస్తారు.

ల్యాండ్ అయిన తర్వాత మోడీ నేరుగా మెహదీగంజ్‌కు వెళ్లి బహిరంగ సభకు వెళతారు. బిజెపి కాశీ జోన్ అధ్యక్షుడు దిలీప్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ ఈ వార్తను ధృవీకరించారు.

## భారాస తీరు.. దొంగే దొంగ అని అరిచినట్లుంది

హైదరాబాద్: నగరంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో భారాస నేతల తీరుపై భాజపా ఎంపీ రఘునందన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. "భారాస ప్రభుత్వంలో భూములను అడ్డగోలుగా అమ్మేశారు. ఇప్పుడు దొంగనే దొంగ అని అరిచినట్లు ఉంది. భారాస




పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడికి పోయారు? హెచ్‌సీయూ భూములపై ఎందుకు సమీక్ష చేయలేదు? ఆ భూములను రికార్డుల్లోకి ఎందుకు ఎక్కించలేదు? ఇప్పుడేమో భారాస నేతలు మొసలి కన్నీళు కార్చుతున్నారు. భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉంది. హెచ్‌సీయూ భూములను కాపాడాలని మేము కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిశాం. ఇంచు భూమి పోకుండా విద్యార్థుల తరఫున పోరాడతాం"అని రఘునందన్‌రావు అన్నారు.




## ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉంటుంది..

# నా బ్రాండ్ ఇదే..!

## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు!

రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా స్కూల్ ఈజ్ మై బ్రాండ్ అన్నారు. కొందరు తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. 2 రూపాయలకే కిలో బియ్యం దివంతగ మాజీ సీఎం ఎన్టీఆర్ బ్రాండ్ అయితే తన బ్రాండ్ యంగ్ ఇండియా స్కూల్ అన్నారు.

ఈ స్కూల్లలో చేరే వారందరికీ 100 శాతం ఉద్యోగాలు ఇస్తామన్నారు. పోలీసుల పిల్లల చదువుల కోసం తమ ప్రభుత్వం గొప్ప ఆలోచన చేసిందన్నారు. అలాగే తెలంగాణలోనూ త్వరలోనే నర్సరీ ప్లే స్కూల్ అమల్లోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు.

**కొందరే చరిత్రలో గుర్తుండిపోయారు..** ఈ మేరకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రతీ పోలీస్ సిబ్బందికి ఇది అత్యంత ముఖ్యమైనది చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలోనే పోలీస్ స్కూల్ అంశాన్ని పొందుపరిచామని గుర్తు చేశారు. ఆనాడు పండిట్ జవహర్ నెహ్రూ సారథ్యంలో దేశంలో యూనివర్సిటీల పునాదులు పడ్డాయి. నెహ్రూ దార్శనికతతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరింది. దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారు. కానీ అందులో కొద్ది మంది మాత్రమే చరిత్రలో గుర్తుండిపోయారు. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలు చరిత్రను మలుపు తిప్పాయి. ముఖ్యమంత్రుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని చెప్పుకుంటున్నారు. రూ.2 కిలో బియ్యంతో ఎన్టీఆర్ ప్రతీ పేదవాడి మనసులో స్థానం సంపాదించుకున్నారు. హైదరాబాద్ లో ఐటీని అభివృద్ధి చేసి చంద్రబాబు ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు. రైతు బాంధవుడిగా ప్రజలు వైఎస్ ను గుర్తుంచుకుంటారని అన్నారు. అలాగే ఇవాళ నా క్రియేట్ చేసిన నా బ్రాండ్ 'యంగ్ ఇండియా' మహాత్ముడి స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్ ను తెలంగాణలో క్రియేట్ చేసుకున్నాం. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది. అందుకే ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అనేది మా బ్రాండ్. నిరుద్యోగుల్లో సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నాం. ఆనంద్ మహేంద్రను యూనివర్సిటీకి చైర్ పర్సన్ గా నియమించుకున్నాం. ఇవాళ యూనివర్సిటీలో చేరిన ప్రతీ విద్యార్థికి ఉద్యోగ భద్రత ఉంది. దేశంలోనే ది బెస్ట్ యూనివర్సిటీగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీని ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు. ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుతోందన్నారు. ఒకటో తరగతి నుంచి ఉన్న ప్రభుత్వ స్కూల్స్ విధానంలో మార్పులు తీసుకొచ్చి, ప్రీ-స్కూల్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సైనిక్ స్కూల్ కు ధీటుగా పోలీస్ స్కూల్ ను తీర్చిదిద్దాలి. ఇందుకు కావాల్సిన నిధులు ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. పోలీస్ స్కూల్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత. సామాజిక బాధ్యతగా ప్రైవేటు కంపెనీలు పోలీస్ స్కూల్ కు ఆర్థిక సాయం అందించాలి. పోలీస్ స్కూల్ కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ క్రియేట్ చేసుకోవాలి. ఇందుకు అవసరమైన అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.

# మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో లేనట్లే?

హైదరాబాద్ : తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు బ్రేక్ పడింది. వాస్తవానికి సీఎం రేవంత్ రెడ్డి వరుసగా ఢిల్లీకి చక్కర్లు కొట్టిన నేపథ్యంలో ఈ ఉగాదికి మంత్రివర్గ విస్తరణ ఖాయమని అంతా అనుకున్నారు.

అయితే తాజాగా పరిణా మాలు చూస్తే మంత్రివర్గ విస్తరణ ఇప్పట్లో ఉండే అవకాశం లేనట్లు తెలుస్తోంది. ఇక మంత్రివర్గ విస్తరణకు ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఓ నేత కారణంగానే బ్రేక్ పడిందనే ప్రచారం జరుగుతోంది. ఆయన రాసిన లేఖతోనే కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం కానుందని సమాచారం. ఇటీవల ఎమ్మెల్సీ అభ్యర్థుల విషయంలో ఆ నేత చక్రం తిప్పడంతో మరికొన్నాళ్లు పాటు వేచి చూసే ధోరణి లో పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అడుగడుగునా సీఎంను ఉక్కిరి బిక్కిరి చేస్తూ ఆనేత ముందుకు సాగుతున్నారనే పార్టీ నేతల్లో ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా ఇదిగో పులి అంటే అదిగో మేక అన్నట్లు తయారైంది మంత్రివర్గ విస్తరణ అని పలువురు వాపోతున్నారు.






**సిద్దిపేట జిల్లా లచ్చపేట ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు.. ఇస్రో నిర్వహిస్తున్న 'యువికా - 2025' శిక్షణ కార్యక్రమానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తెలిపారు. తెలంగాణ నుంచి 12 మంది విద్యార్థులు ఎంపికకాగా.. తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. మే నెలలో ఇస్రో ఏడు పరిశోధన కేంద్రాల్లో అంతరిక్ష అనువర్తనాలపై నిర్వహిస్తున్న 15 రోజుల శిక్షణకు వీరు హాజరు కానున్నట్లు వెల్లడించారు. విద్యార్థి దశలోనే ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించి.. వారికి అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఇస్రో 'యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా-2025)' పేరుతో యువ శాస్త్రవేత్తల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.**




హైదరాబాద్, ఏప్రిల్ 20: తెలంగాణకు భూకంప హెచ్చరిక భయాందోళనకు గురిచేస్తోంది. రామగుండంలో భూకంపం వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూకంప తీవ్రత గట్టిగా ఉంటుందని చెబుతున్నారు. ఆ భూకంప తీవ్రత హైదరాబాద్, అలాగే అమరావతి వరకు కూడా ఉంటుందని అంటున్నారు. తెలంగాణకు భూకంపం వచ్చే అవకావం ఉందని ఎర్త్‌క్వేక్ రీసర్చ్ అండ్ అనాలసిస్ అనే సంస్థ స్పష్టం చేసింది. తమ పరిశోధనల ఆధారంగా తెలంగాణలో రామగుండం సమీపంలో భారీ భూకంపం సంభవించి అవకాశం ఉందని.. ఆ ప్రకంపనలు హైదరాబాద్, వరంగల్, అమరావతి వరకు చేరే అవకాశం ఉందని అందులో పేర్కొంది. అయితే ర్త్‌క్వేక్ రీసర్చ్ అండ్ అనాలసిస్ సంస్థ భూకంపం సూచనలను ఎవరూ కూడా ధృవీకరించని పరిస్థితి. ప్రభుత్వ వర్గాలు గానీ, శాస్త్రీయ సంస్థలు ఎవరూ ధృవీకరించడం లేదు. భూకంపాలను కచ్చితంగా ముందస్తుగా అంచనా వేయడం ప్రస్తుతం శాస్త్రీయంగా సాధ్యం కాదని, ఇలాంటి సూచనలు తరచుగా నిర్ధారణకు నోచుకోవని అధికారులు చెబుతున్న మాట. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పెసిఫిక్ జోన్ రెండు, మూడులో ఉన్నాయి.

ఇవి తక్కువ నుంచి మోస్తారు భూకంప ప్రమాదాన్ని మాత్రమే సూచిస్తాయి. గతంలో ఈ ప్రాంతంలో కొన్ని చిన్న చిన్న భూకంపాలు సంభవించాయి. అవి ఏమాత్రం నష్టం కలిగించలేదు.


## కంచ గచ్చిబౌలి భూములు హెచ్‌సీయూవే.. సీసీఎల్ఏకు 2012లోనే కలెక్టర్ లేఖ: హరీశ్‌రావు

హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీ హెచ్‌సీయూను సందర్శించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం కమిటీతో భేటీ అయింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో డాక్యుమెంట్లు, విజువల్స్‌తో కూడిన నివేదికను భారాస బృందం.. కమిటీకి అందించింది. అనంతరం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. "వాల్టా చట్టం ప్రకారం చెట్లు కొట్టాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అటవీశాఖ అనుమతి ఇచ్చాకే చెట్లను నరకాలి. ఒక్కో చెట్టుకు రూ.400 డిపాజిట్ చేశాకే కొట్టాల్సి ఉంటుంది. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఆందోళన చేసినా అటవీ శాఖ పట్టించుకోలేదు. అటవీ శాఖ స్పందించకపోవడంతోనే చెట్లు నరికేశారు, జంతువులు చనిపోయాయి. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలు, నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ.. వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. 2011లో కంచ గచ్చిబౌలి భూముల్లో జీహెచ్‌ఎంసీ లక్ష మొక్కలను నాటింది. ఆ భూముల్లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నాటిన మొక్కలు కూడా ఉన్నాయి. అరుదైన పక్షులు, జంతువులు, చెట్లు కంచ గచ్చిబౌలి



భూముల్లో ఉన్నాయి. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలా కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే వాటిని భక్షిస్తోంది. కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి గతేడాది నవంబర్ 22న రూ.10వేల కోట్లు రుణం తెచ్చారు. రుణం ఇప్పించిన మధ్యవర్తికి రూ.170 కోట్లు లంచం ఇచ్చారు. మధ్యవర్తికి ఇచ్చిన డబ్బు విషయాన్ని సాక్షాత్తూ అసెంబ్లీలోనే చెప్పారు. ఫార్మాసిటీ కోసం 14వేల ఎకరాలు సేకరించారు కదా.. దానిని అభివృద్ధి చేయండి. అక్కడ ఎలాంటి చెట్లు, వన్యప్రాణులు లేవు. కంచ గచ్చిబౌలి భూములు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందినవే. ఈ భూములు హెచ్‌సీయూకి చెందినవే అని సీసీఎల్ఏకు 2012లోనే అప్పటి కలెక్టర్ లేఖ రాశారు" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కంచ గచ్చిబౌలి భూములపై కేంద్ర కమిటీకి తెలంగాణ ప్రభుత్వం నివేదిక



హైదరాబాద్: నగరంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీతో తెలంగాణ ప్రభుత్వ అధికారుల భేటీ ముగిసింది. కంచ గచ్చిబౌలి భూములపై రాష్ట్ర ప్రభుత్వం కమిటీకి నివేదిక సమర్పించింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు కేంద్ర సాధికారిక కమిటీ హైదరాబాద్‌కు వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. టీజీఐఐసీ ఈ భూములను చదును చేపట్టిన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక అందజేయాలని కమిటీకి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే బుధవారం సెంట్రల్ ఎంపవర్ కమిటీ ఛైర్మన్ సిద్ధాంత దాస్, మరో ఇద్దరు సభ్యులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. వీరు కంచ గచ్చిబౌలి భూముల్లో పరిశీలన జరిపి.. వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయనున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ ఉన్నతాధికారులతో కమిటీ సమావేశమైంది. భేటీ అనంతరం ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి నివేదకను ప్రభుత్వ అధికారులు కమిటీకి అందించారు. మరోవైపు మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం సైతం గచ్చిబౌలి భూముల వ్యవహారంపై కమిటీకి నివేదిక ఇచ్చింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను కమిటీ.. సుప్రీంకోర్టుకు అందజేయనుంది.

## అలా చేయకపోయి ఉంటే.. ఇంత దూరం వచ్చేవాడిని కాదు: మంచు మనోజ్

హైదరాబాద్: తన కుటుంబంలో జరుగుతోన్న వరుస వివాదాలను ఉద్దేశించి తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌తో మాట్లాడారు నటుడు మనోజ్ . ఇది ఆస్తి తగాదా కాదని ఆయన అన్నారు. ఇల్లు, ఇతర ఆస్తులపై తనకు ఏమాత్రం ఇష్టం లేదని మరోసారి స్పష్టంచేశారు. వాళ్లు చేసిన కొన్ని పనుల వల్ల తన మనసు విరిగిపోయిందని చెప్పారు. "విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రశ్నించిన తరుణంలో ఈ గొడవలు మొదలయ్యాయి. సుమారు రెండేళ్ల నుంచి ఈ తగాదాలు జరుగుతున్నాయి. ప్రశ్నించాననే కారణంతో నా గౌరవానికి భంగం కలిగించేలా తప్పుడు కథనాలు వ్యాప్తి చేశారు. నాపై దాదాపు 30 తప్పుడు కేసులు పెట్టారు. కుటుంబం కోసం నేను ఎంతో చేశా. ఆస్తిలో ఒక్క రూపాయి కూడా కోరుకోలేదు. మా నాన్న సినిమాలన్నింటికీ మా అన్నకు సంబంధించిన సంస్థలే పని చేస్తాయి. 'సన్నాఫ్ ఇండియా'లోని ఒక పాట గ్రాఫిక్స్‌కు సుమారు రూ.కోటిన్నర ఖర్చు చేసినట్లు చెప్పారు. దానిని మనం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసేయొచ్చు.

ఈ గొడవల్లోకి నా భార్యను లాగారు. అలా చేయకపోయి ఉంటే నేను ఇంత దూరం వచ్చేవాడిని కాదు. తన వల్లే చెడిపోతున్నానంటూ స్టేట్‌మెంట్, ఎఫ్ఐఆర్‌లో నా భార్యాబిడ్డల పేర్లు పెట్టడంతో నా మనసు విరిగిపోయింది. నేను తప్పు చేయలేదు. ఆస్తి అడగలేదు. కాబట్టి దేనికీ భయపడను" అని మనోజ్ తెలిపారు. తనపై పగా ప్రతీకారాలు తీర్చుకోవడానికే ఈ దాడులకు పాల్పడుతున్నారని ఆయన వాపోయారు. తన కారు పోయిందని మంగళవారం మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాప పుట్టినరోజు వేడుకల కోసం తాను జయపుర వెళ్లడాన్ని అవకాశంగా తీసుకొని తన సోదరుడు విష్ణు ఇదంతా చేయిస్తున్నారని ఆరోపించారు.




హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, బోదన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్ అయ్యారు. శంషాబాద్ విమానాశ్రయంలో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. షకీల్‌పై గతంలో నమోదైన కేసుల్లో భాగంగా పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

గత కొన్ని రోజులుగా దుబాయ్‌లో ఉంటున్న షకీల్ గురువారం ( ఏప్రిల్ 10) తల్లి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు హైదరాబాద్ వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఎయిర్ పోర్టులో షకీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే.. తల్లి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు పోలీసులు షకీల్?కు అనుమతి ఇచ్చినట్లు సమాచారం. కాగా.. 2023, డిసెంబర్ 23న అర్ధరాత్రి మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ అతివేగంగా కారు నడుపుతూ బేగంపేటలోని ప్రజాభవన్ వద్ద ట్రాఫిక్ డివైడర్లను ఢీకొట్టిన విషయం తెలిసిందే. రాహిల్ తప్పతాగి ఈ యాక్సిడెంట్ చేసినట్లు గుర్తించిన పోలీసులు రాహిల్‌తో పాటు కారులో ఉన్న అతడి స్నేహితులపై కేసు నమోదు చేశారు. ఈ కేసు నుంచి కుమారుడు రాహిల్‌ను తప్పించేందుకు తప్పుడు సాక్ష్యాలు సమర్పించడంతో షకీల్‌ను కూడా పోలీసులు నిందితుడిగా చేర్చారు.

ఈ కేసు నమోదు కాగానే షకీల్, రాహిల్ దుబాయ్ పారిపోయారు. అప్పటి నుంచి దుబాయ్‌లోనే ఉంటుండగా.. బుధవారం షకీల్ తల్లి మృతి చెందారు. దీంతో తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు షకీల్ దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు రాగా పోలీసులు ఎయిర్ పోర్టులో మాజీ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు.




హైదరాబాద్, ఏప్రిల్ 10: హైదరాబాద్ నగర వాసులకు మరో కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. సిటీలో ఎక్కడా లేని విధంగా రెండు ఫ్లైఓవర్లపై నుంచి దీన్ని చేపట్టారు. గచ్చిబౌలి ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వరకు చేపడుతున్న ఫ్లైఓవర్ నిర్మాణం తుదిదశకు చేరుకుంది. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌కు చెక్ పెట్టేలా రూ.200 కోట్లతో నిర్మించిన ఈ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**శరవేగంగా పనులు..** ఐటీ కారిడార్‌లో వాహనదారులకు త్వరలో కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. ఎస్ఆర్డీపీ ప్రాజెక్ట్ ద్వారా శిల్పా లేఅవుట్ ఫేజ్ 2 పనులు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. గచ్చిబౌలి అవుటర్ రింగ్ రోడ్డును మొదలుకుని కొండాపూర్ వరకు దాదాపు 1.2 కిలోమీటర్ల మేర చేపట్టిన ఫ్లైఓర్ నిర్మాణ పనులు దాదాపుగా 90 శాతం పూర్తి అయ్యాయి. వచ్చేనెలలో ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించేందుకు ఇప్పటికే జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1.2 కిలోమీటర్ల మేర, 24 మీటర్ల వెడల్పుతో ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం జరుగుతోంది. రాత్రి, పగలు ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి. కొత్త ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టొచ్చని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు.

**ఫ్లైఓవర్ ప్రత్యేకత...** ఈ ఫ్లైఓవర్ మల్టీలెవల్ ఫ్లైఓవర్. కింద రెండు ఫ్లైఓవర్లు ఉండగా.. దాని పైనుంచి మూడో ఫ్లైఓవర్‌ను నిర్మించారు. గతంలో ఉన్న గచ్చిబౌలి జంక్షన్ ఫ్లైఓవర్ కింద ఉండగా.. దాని మీద శిల్పా లేఅవుట్ ఫేజ్ 1 ఫ్లైఓవర్ ఉంటుంది. దానిపై ఫేజ్ 2 ఫ్లైఓవర్‌ను కొత్తగా నిర్మించారు. ఈ ప్రాజెక్టును అత్యాధునికమైన టెక్నాలజీని ఉపయోగించి ఇంజనీరింగ్ నిపుణులు ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి వచ్చే వాహనాలు గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్‌లో గంటల తరబడి నిరీక్షించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి కొండాపూర్, హఫీజ్‌పేట్ మార్గాల్లో వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఈ కొత్త ఫ్లైఓవర్ అందుబాటులో వస్తే ఆ వాహనాలు అన్నీ ఈ ఫ్లైఓవర్ మీదుగా వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి దాదాపు మూడేళ్లు అవుతున్నప్పటికీ పనుల్లో పురోగతి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఫ్లైఓవర్ పనులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. గడిచిన ఏడాది వ్యవధిలోనే ఈ ఫ్లైఓవర్ పనులు శరవేగంగా ముందుకు సాగాయి.




హైదరాబాద్: నగరంలో పలు చోట్ల వర్షం కురుస్తోంది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. తాజాగా వర్షం మొదలైంది. మియాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. మేడ్చల్, గగిల్లాపూర్ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు పడుతున్నాయి. ఎస్ఆర్ నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి.

క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు పడుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో ఇవాళ తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. నగరంలో రానున్న 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని పేర్కొంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే సూచనలున్నాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీచేసినట్లు తెలిపింది. రేపు (ఏప్రిల్ 11న) కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## బీజేపీకి రేవంత్ సహకారం.. ఎంపీ అవరింద్ సంచలన కామెంట్స్..

హైదరాబాద్, ఏప్రిల్ 10: నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారం రావడం అనేది తమ పార్టీ నేతల చేతుల్లోనే ఉందన్న ఆయన.. దీనికి రేవంత్ రెడ్డి సహకారం కూడా ఉంటుందని వ్యాఖ్యానించారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడిన ఎంపీ అరవింద్.. తెలంగాణ రాజకీయాలను చూస్తే తన చిన్నప్పుడు స్కూల్‌లో చదువుకున్న పాఠం గుర్తుకు వస్తోందన్నారు. రేవంత్ రెడ్డి పద్ధతి, పనితీరు ఇన్‌స్టిట్యూషన్స్ ఆర్ నాట్ కర్షప్ట్ ఇండివిజువల్స్ కరప్ట్ అన్న విధంగా ఉ ఒదంటూ విమర్శలు గుప్పించారు. ఈ సూత్రం సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ బీజేపీకి సరిగ్గా వర్తిస్తుందన్నారు. తెలంగాణలో బీజేపీని అడ్డుకోవడం నీ వల్ల కాదు కదా.. నీ బాస్ రాహుల్ గాంధీ వల్ల కూడా కాదంటూ సీఎ రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో బీజేపీని అడుగు పెట్టనివ్వము అన్నంత ఈజీగా కాదన్నారు. తన రెండు అడుగులు చాలు.. తెలంగాణలో బీజేపీ ఉందని చెప్పడానికి అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాడమనే అంశం తమ పార్టీ నేతల చేతిలోనే ఉందన్న ఎంపీ.. ఇందుకు రేవంత్ రెడ్డి సహకారం కూడా ఉంటుందని వ్యాఖ్యానించారు. కేటీఆర్‌కు ఉన్న దమ్ము ధైర్యం నీకు లేదా అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఎంపీ ప్రశ్నించారు. నిన్ను జైల్లో వేసిన వారిని ఎందుకు జైలుకు పంపలేకపోతున్నావ్ అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు ముఖ్యమంత్రికి రోషం, పౌరుషం లేదంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పైనా ఎంపీ అరవింద్ విరుచుకుపడ్డారు. కేటీఆర్ ఓ బచ్చా అని.. అతను ఏం మాట్లాడుతాడో అతనికే తెలియదని వ్యాఖ్యానించారు. హెచ్‌సీయూ భూములన కబ్జా చేసిన బీజేపీ ఎంపీ ఎవరో దమ్ముంటే బయటపెట్టాలని కేటీఆర్‌కు ఎంపీ ధర్మపురి అరవింద్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి.. కేసీఆర్ కంటే అత్యంత ప్రమాదకారి అని.. హైదరాబాద్‌ను బేస్‌మెంట్‌త సహా కూల్చివేయడం ఖాయం అని వ్యాఖ్యానించారు.

# నవయుగ సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే

## నవయుగ వైతాళికుడు మహాత్మా జ్యోతిరావు పూలే

### ఏప్రిల్11వ తేదీ మహాత్మా జ్యోతిరావ్వు పూలే 198 వ జయంతి సందర్భంగా...

సామాజిక తత్వ వేత్త సామాజిక ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆధునిక భారతీయ బహుజన సంఘ సంస్కర్త . 'నవయుగ వైతాళికుడు. వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన "మాలి" కులంలో మహారాష్ట్ర లోని సతారా జిల్లాలో 1827 ఏప్రిల్ 11 వ తేదీన జన్మించాడు. పూలే చదువు పట్ల ఉన్న ఆసక్తినిగమనించిన ఒక ముస్లిం టీచర్ పూణే లో క్రైస్తవ స్కాటిష్ మిషన్ నడుపు తున్న పాఠశాలలో 1841 లో చేర్పించాడు.

**పూలే బహుముఖప్రజ్ఞా శాలి....** పూలేప్రజ్ఞ కలిగిన విద్యార్థిగా గుర్తింపు పొందాడు. శాస్త్రీయ దృక్పథం విమర్శనాత్మక విశ్లేషణ సామర్థ్యం కలిగిన ఉత్తమ విద్యార్థిగా అధ్యాపక వర్గం మన్ననలను పొందాడు.

**పూలే సామాజిక మార్గదర్శి...** భారత దేశానికి సామాజిక రంగం విధ్య రంగాల్లో మార్గదర్శనం చేసిన మహనీయులు . పూలే. బోధనల స్ఫూర్తితో ఎంతో మంది సంఘ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు.

**జ్యోతిరావు పూలే సమాజానికి వెలుగుదివ్వె...** సమాజంలో నిరక్షరాస్యత అంటరానితనం అస్పృశ్యత కులతత్వం కుటుంబ వ్యవస్థలో కొనసాగుతున్న వివక్షను పూలే ప్రశ్నించాడు. మూడవిశ్వాసాలు బ్రాహ్మణ ఆధిక్యత సామాజిక దురాచారాలు బాల్య వివాహాలు కొనసాగుతున్న కాలంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను వ్యతిరేకిస్తూ ప్రజల ఆర్థిక సామాజిక సమానత్వం కోసం వెనుకబడిన బహుజన ప్రజల హక్కుల రక్షణ సంస్కృతి సంరక్షణ కోసం ఉద్యమాలు నిర్వహించిన జ్యోతి రావు పూలే స్వయం కృషితో దేశానికి వెలుగు దివ్వె అయ్యారు.

**సామాజిక ఉద్యమకారుడు పూలే...** జ్యోతిరావు పూలే మరాఠీ' ఇంగ్లీష్ భాషలు చదువుకుని రెండు భాషల్లో అనేక రచనలు చేసి సమాజాన్ని ప్రభావితం చేసిన గొప్ప సామాజిక ఉద్యమకారుడు. సామాజిక వివక్షను ప్రశ్నించాడు.

**మానవుడే బిమాధవుడు పూలే...** మనుషులంతా సమానమేనని దేవుడు ఒక్కడే అని దేవుడు ముందు అందరూ సమానమేనని దేవుడిని కొలవడానికి మధ్యవర్తులుగా పూజారులు బ్రహ్మణులు అక్కర లేదని పూలే ప్రబోధించారు. మానవుడే మాధవుడని మానవీయతే ఆధ్యాత్మికత అని. మానవులు అందరు సమానమేనని. మానవ వాదాన్ని విశేష ప్రచారంలోకి తీసుకొచ్చాడు. మనిషి మనిషిని గౌరవించాలని ఆత్మ గౌరవంతో బతకాలని .

**కుల రహిత సమాజం పూలే...** కులాన్ని బట్టి కాకుండా గుణాన్ని బట్టి గౌరవించాలని. తన జీవితమంతా కుల రహిత సమాజం కొర కు పోరాటాలు చేశాడు . పాశ్చాత్య దేశాల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలను విలువలను సంస్కృతిని జీవన విధానాన్ని విశేషంగా అధ్యయనం చేశాడు. జ్యోతిరావు పూలే శివాజీ జీవిత చరిత్ర 1791లో థామస్ పేయిన్ రాసిన మానవ హక్కుల పుస్తకం అమెరికా అధ్యక్షులు జార్జ్ వాషింగ్టన్ జీవిత చరిత్ర ఫ్రెంచి విప్లవం చరిత్ర అమెరికా విప్లవ చరిత్ర చదివిన ప్రభావంతో ప్రేరేపితుడైన గొప్ప దేశభక్తి పరుడు పూలే . భారతదేశంలో కులాలు లేకుండాఅవిద్య(నిరక్షరాస్యత) నుండి బయటపడాలని అందుకొరకు ఆధునిక విద్య ఆయుధం వంటిది అని పూలే భావించాడు.

**సామాజిక సమత మూఢ విశ్వాసాల నిర్మూలన పూలే...** మూఢనమ్మకాలు తొలగించాలని ఏ కులం గొప్పది కాదు ఏ కులం చిన్నది కాదు అన్ని కులాలు సామానమే అని సామాజిక సమత తమ అభిమతం గా భావించిన పూలే బ్రాహ్మణులను కలుపుకొని అనేక సంఘసంస్కరణ చేపట్టాడు.

**మహిళా విధ్య మహిళా సాధికారత పూలే...** సమాజంలో సగ భాగం వున్న స్త్రీలు అభివృద్ధి చెందక పోతే సమాజ అభివృధి సాధ్యం కాదని భావించిన పూలే పూణే లో1848 ఆగస్టులో బాలికల కొరకు పాటశాల స్థాపించాడు పాఠశాలలో అన్ని కులాలకు ప్రవేశం కల్పించాడు.అంటరానివారికి( శూద్రులకు) బోధించడానికి ఎవరు ముందుకు రాలేదు జ్యోతిరావు పూలే సావిత్రీబాయి పూలే వారికి బోధించారు.1848లో పూణేలో మొట్టమొదటి దళిత పాటశాల స్థాపించాడు.1851 లోమరో 2 పాఠశాలలు 1855 లో రాత్రి బడి స్థాపించి కార్మికులకు విద్యను అందించాడు. విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త జ్యోతిరావు పూలే .

**వితంతువివాహాలను ప్రోత్సహించాడు పూలే...** మహిళావిద్యను ప్రోత్సహించారు. వితంతువుల కష్టాలను చూసి చలించి పోయాడు.విత%శీ%తు వివాహాలను బాల్య వివాహాలను ప్రోత్సహించారు. బాల్య వివాహాల వల్ల15బి20యేళ్ల లోపే వితంతువులై దుర్భర జీవితాలను గడుపుతున్న వితంతువులను మానవతా దృక్పథంతో చేరదీసి వారి పెళ్లిల్లు చేసి వారి పిల్లలను పోషించాలని వారికోసం స్కూల్లు హాస్టల్లు ప్రారంభించారు. 1873-75లో బ్రాహ్మణ పురోహితులు లేకుండా "జున్నార్" పరిసర ప్రాంతాల్లో సుమారు40 గ్రామాల్లో పెళ్ళిలు నిర్వహించి ప్రత్యామ్నాయ వివాహ వ్యవస్థను పూలే ప్రోత్సాహించాడు. వితంతు పునర్వివాహం గురించి ప్రజల్లో చైతన్యం తెచ్చాడు. స్వయంగా విత%శీ%తువులకు వివాహం జరిపించాడు. 1864 లో "బాల హత్య ప్రతిబంధక్ గృహ " స్థాపించి విత%శీ%తువులైన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడు.

**మొదటి సంస్కరణ ఉద్యమం పూలే :** 1873లో సత్య శోదక్ సమాజాన్ని నెలకొల్పి శూద్రులను బ్రాహ్మణుల చెర నుండి కాపాడటానికి ఈ సంస్థను స్థాపించి దేశములో మొట్టమొదటి సంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. విగ్రహారాధన ఖండించాడు. స్త్రీ పురుషుల మధ్య లింగ వివక్షతను పూలే నిరసించాడు . సమానత్వం' స్వేచ్ఛ ఐక్యమైత్యంతో కూడిన నవ సమాజాన్ని కాంక్షించాడు..నిమ్న వర్గాల బాల బాలికలకు విద్య అందిస్తే రాబోయే తరం సామాజికంగా ఎదుగుతుందని భావించాడు.

**విద్య ఆయుధం పూలే...** అట్టడుగు వర్గాల ప్రజల చైతన్యం కోసం విద్యే ఆయుధం అని ప్రబోధించిన నవ భారత నిర్మాత జ్యోతిరావు పూలే అని సామాజిక వేత్తలు పేర్కోవడం గమనార్హం. పూలే కృషిని చూసిన డాక్టర్ అంబేద్కర్ తండ్రి రాంజీ ఎంతగానో ప్రభావిత మయ్యాడు.తన పిల్లలను బాగా చదివించాలని భావించాడు. ఆనాటి సమాజంలో బాల్యవివాహాలు జరిగేవి.సావిత్రిబాయి పూలేతో జ్యోతిబాపూలే పెళ్లి జరిగినపుడు వారిద్దరూ మైనార్టీ తీరని వారే. సావిత్రిబాయినీ విధ్యా వంతురాలుని చేసి టీచర్ గ తీర్చిదిద్ది పాఠశాలలను నడిపించాడు. సావిత్రీబాయి స్త్రీ విద్యకు తొలి మహిళా టీచర్ గా చరిత్రలో నిలిచారు .సమాజ సేవా సంస్కారాన్ని అలవర్చుకొని సావిత్రిబాయి పూలే ప్లేగు వ్యాధి బాధితులకు సేవలు చేస్తూ సావిత్రీ బాయి పూలే 1897లోచనిపోయారు .మరణించే వరకు సేవలను కొనసాగించి ఆదర్శ ఇల్లాలుగా ఉపాధ్యా యులుగా ప్రసిద్ధి చెందారు .సంఘ సేవకురాలుగా దేశానికి తొలి మహిళా ఉపాధ్యా యురాలిగా ప్రసిద్ధి చెందారు. సమాజం కోసం సంఘ సంస్కరణల కోసం విశేష కృషి చేసిన జ్యోతిరావు పూలే దేశంలో అనేక మంది



నేదునూరి కనకయ్య
అద్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం
కరీంనగర్9440245771

సంఘ సంస్కర్తలను ఆకర్షించాడు. పూలే మహారాష్ట్ర 'గుజరాత్ 'బెంగాల్ 'పంజాబ్ 'ఉత్తర ప్రదేశ్ 'మధ్యప్రదేశ్ లో అనేక పాటశాలలు నెలకొల్పారు. నేడు మనం చూస్తున్న సమాన హక్కులతో కూడిన ఆదునిక విద్య ఆధునిక సైన్సు ' అభివృద్ధి చే%శీ%దడానికి పూలే చూపిన మార్గం గొప్పదని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పేర్కోవడం గమనార్హం.

**పూలే అజాత శత్రువు....** పూలే చేపట్టిన సామాజిక సంస్కరణ ఉద్యమము గిట్టని అగ్రవర్ణాల వారు హత్య చేయడానికి వస్తే వారిని తన సంస్కరణల ఉద్యమంలో భాగస్వాములను చేసి తమ అనుచరులుగా మార్చుకున్న గొప్ప మానవతావాది. అజాత శత్రువు పూలే బ్రహ్మనేతరులను టీచర్లుగా నియమించాలని హంటర్ కమిషన్ కుచేసిన విజ్ఞప్తిని నాటి బ్రిటిష్ పాలకులు అమలుచేశారు.

**సశత్యశోధక్ సమాజ్ కార్మిక సంక్షేమం పూలే...** జ్యోతిరావు పూలే 1873లో సత్యశోధక్ సమాజ్ ను స్థాపించి 'దేశభంధు' వార పత్రికలో రైతులు కార్మికుల హక్కులు సమస్యలు సంక్షేమం పట్ల పురోహితులు చేసే దోపిడీ మీద ప్రచారం చేశాడు .కార్మికుల పని గంటలు తగ్గించడం కోసం పోరాటాలు చేశాడు. 16 గంటల పనిగంటలకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. రోజుకు 12గంటల పని విధానాన్ని సాధించాడు. కార్మికుల హక్కుల భద్రత కొరకు పోరాటం చేశాడు.

**పెత్తందార్లు దోపిడీ వ్యతిరేకం పూలే....** గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయదారుల మీద వడ్డీ వ్యాపారుల పెత్తందార్ల దౌర్జన్యం అణిచివేతకు వ్యతిరేకంగా పూలే కృషి చేశాడు. శ్రమ దోపిడీని వ్యతిరేకించాడు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశాడు.

**స్త్రీ 'పురుష లింగ సమానత పూలే...** స్త్రీ 'పురుషులతో పాటు సమాన విధ్య వేతనాలు ఉపాధి అవకాశాలు పొందాలని స్త్రీ పురుష 'వివక్షతకు వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే పోరాడారు. కుటుంబ వ్యవస్థ రక్షణమీద సమాజ మనుగడ ఆధారపడి వుందని సంసార రథానికి స్త్రీ పురుషులు రథ చక్రాల వంటి వారని జ్యోతిరావు పూలే తన రచనలో తమ ఉపన్యాసాలలో ప్రముఖంగా ప్రస్తావించాడు.

మహిళా సాధికారత సాధనకు మహిళా విద్య మహిళాభివృదికి పూలే చేసిన కృషి ప్రశంసనీయం.

**కులనిర్మూలన బినవ సమాజం పూలే...** "గులాంగిరీ ""సేద్యంగాని ఛర్మ కోల" గ్రంధాలు రచించి దుర్మార్గమైన కుల వ్యవస్థ సమూలంగా నిర్మూలన కావాలని మనుషులు బ్రహ్మ ణులు చుట్టిన.దాస్యపు సంకెళ్ళ నుండి విముక్తి కావాలని జ్యోతిరావు పూలే పిలుపు నిచ్చాడు."దీన బందు" పత్రికలో దేశమనే దేహానికి శూద్రులు ప్రాణం రక్తనాళాల లాంటి.వారని జ్యోతి రావు పూలే అభిప్రాయ పడ్డాడు.

**ఆధునిక యుగ పురుషుడు పూలే...** నవ సమాజ పునర్నిర్మాణం కోసం మొట్ట మొదట దారులు వేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే ఆధునిక యుగ పురుషుడు గా చరిత్రలో నిలవడం గమనార్హం..

**విప్లవ కెరటం పూలే...** సాంఘిక దురాచారాల నిర్మూలనకు నడుం బిగించిన విప్లవ కెరటం జ్యోతిరావు పూలే సమాజానికి దిశా నిర్దేశం చేస్తూ జాతిని జాగృతి పరిచి తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల్లో.అగ్రగణ్యులు జ్యోతిరావు పూలే

**డాక్టర్ ఆంబెడ్కర్ పూలే..** సామాజిక ప్రజాస్వామ్య భారత దేశానికి సామాజిక.న్యాయ కల్పనకు మహత్తర సందేశం అందించిన మహాత్మా జ్యోతిరావు పూలే తమ గురువని భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రకటించడం గమనార్హం

**మహాత్మ బిరుదు పూలే...**దక్షిణాఫ్రికా జాతీయోద్యమ నాయకులు నెల్సన్ మండేలా భారత పర్యటనకు వచ్చిన సందర్భములో పూలే రచించిన గులాం గిరి గ్రంధాన్ని కానుకగా సమర్పించాలని నిర్ణయించడం సమాజములో వెనుకబడిన వర్గాల ప్రజల మహిళల అభ్యున్నతికి పూలే చేసిన కృషిని గుర్తించి జ్యోతిరావు పూలే కు " మహాత్మా" బిరుదు ఇచ్చారు. మహరాష్ట్ర లోని పూణే పట్టణములో గోవిందరావు చీమన్ బాయి పూలే దంపతులకు ,1827 ఏప్రిల్ 11 వ తేదీ జన్మించి వెనకబడిన వర్గాల విముక్తి కోసం శ్రమించి సమాజ సేవలో తరించిన పూలే దీర్ఘకాలిక జబ్బుతో1890 నవంబర్28న తేదీన మరణించిన మహనీయుడు సదా స్మరణీయుడు.. జ్యోతిరావు పూలే స్ఫూర్తితో చైతన్యంతో ముందుకు సాగుదాం.పూలే ఆశించిన సమాజం కోసం వారు చేసిన ఉద్యమాలను స్ఫూర్తిగా తీసుకొని వెనుకబడిన బహుజనుల సమాజ సమగ్ర వికాసానికి " సామాజిక న్యాయం" కోసం ప్రభుత్వాలు పౌర సమాజం సామాజిక సమానత్వ సాధనకు ఉద్యమించాలి. మహాత్మా జ్యోతిరావు పూలే చూపిన బాటలో నడిచి బహుజనుల బతుకుల్లో నూతన వెలుగుల సాధనకు సమిష్టిగా సాగుదాం .జ్యోతిరావు పూలే అందించిన జ్వాలతో చైతన్యంతో బహుజనులు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలి. సమున్నత లక్ష్యాలతో సాధికారిత స్వావలంబన స్వయం స్వమృద్ధియే ధ్యేయంగా పూలే ఆశయాల సాధన సంకల్పంతో సామాజిక సమరసత సౌహార్థతతో వివక్షలు లేని కుల 'మత 'రహిత సమాజ నిర్మాణమే జ్యోతిరావు పూలేకు మనం ఇచ్చే నివాళి. నవ సమాజ నిర్మాణంలో పౌర సమాజం 'స్వచ్ఛంద సంస్థలు యువత' మహిళా సంఘాలు క్రియాశీలక పాత్ర పోషించి నూతన క్రాంతి కై ఉద్యమించాలి.

# అక్కడ ఉన్నది దీదీ... వక్ఫ్ చట్టంపై మోదీకి షాక్ !



దేశంలో ఇటీవల కాలంలో అతి పెద్ద చర్చగా సాగిన విషయం వక్ఫ్ సవరణ చట్టం 2025. దీనిని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రెండో సెషన్ చివరిలో కేవలం రెండు రోజుల వ్యవధిలో కేంద్ర ప్రభుత్వం ఆమోదించుకుంది. మంచి మెజారిటీతోనే ఉభయ సభలలో వక్ఫ్ బిల్లు ఆమోదం పొందింది. ఆ వెంటనే దానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయడంతో చట్టంగా మారింది. ఈ నెల 8వ తేదీ నుంచి దేశమంతా వక్ఫ్ సవరణ చట్టం 2005 అమలులోకి వచ్చిందని కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా స్పష్టం చేసింది. అయితే దేశంలో పలు చోట్ల వక్ఫ్ చట్టం అమలు చేయవద్దని డిమాండ్ చేస్తూ ఆందోళనలు కొనసాగుతున్నాయి. వివిధ రాష్ట్రాలలో అయితే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టం వచ్చినా కూడా అమలులోకి తీసుకుని రావద్దని కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మోడీ సర్కార్ తీసుకుని వచ్చిన వక్ఫ్ చట్టం మీద షాకింగ్ డెసిషన్ తీసుకున్నారు. ఇక్కడ ఉన్నది దీదీ నేను నా రాష్ట్రంలో ఈ చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయబోను అని ఆమె ఖండితంగా చెప్పారు. పశ్చిమ బెంగాల్ ని విభజించి పాలించలేను అని ఆమె చెప్పారు. మైనారిటీలకు తాను అండగా ఉంటాను అని ఆమె హామీ ఇచ్చారు. పశ్చిమ బెంగాల్ లో 33 శాతం ముస్లిం లు జీవిస్తున్నారని వారందరి హక్కులను తాను కాపాడుతాను అని ఆమె అంటున్నారు. శతాబ్దాలుగా అంతా ఒక్కటిగా జీవిస్తున్నారని అలాంటిది విభజన రేఖలు గీసి దూరం పెట్టలేమని ఆమె అంటున్నారు. తాను మైనారిటీలను కాపాడడమే కాకుండా వారి హక్కులను సైతం పరిరక్షిస్తామని ఆమె గట్టి భరోసా ఇస్తున్నారు. ఇదిలా ఉంటే కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని చట్టంగా చేసిన వక్ఫ్ 2025 ని అమలు చేయమని ఒక రాష్ట్రం అంటోంది. అది రాజ్యాంగబద్ధంగా వీలు అవుతుందా అన్న చర్చ మొదలైంది. ఎందుకంటే ఈ దేశంలో అందరికీ ఒక్కటే రాజ్యాంగం ఉంది. రాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో చట్టం చేస్తే అది దేశంలో అన్ని చోట్ల అమలు అవ్వాల్సిందే. అలా కనుక జరగకపోతే అది రాజ్యాంగం ఉల్లంఘనగానే చూస్తారు. ఇక ఈ బిల్లు రాజ్యాంగ బద్ధంగా ఆమోదం పొందింది అని చెప్పాలి. లోక్ సభలో బిల్లు పెడితే 288 మంది సభ్యులు ఔకూలంగా ఓటు వేశారు. రాజ్యసభలో అయితే 128 మంది అనుకూలంగా ఓటు చేస్తే 95 మంది వ్యతిరేకంగా వేశారు. అలా బిల్లు ఆమోదం పొంది రాజ్యంగ అధినేత అయిన రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారింది. దానిని అమలు చేయమని చెబితే ఎలా అన్న చర్చ వస్తోంది. అయితే కొంతకాలం పాటు వాయిదా వేయగలరు కానీ అమలు చేయకుండా ఉండలేరని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు. ఇక మమతా బెనర్జీ ఈ తరహా వ్యాఖ్యలు చేయడానికి కారణాలు ఏమిటి అన్నది చూస్తే కనుక 2026 మే నెలలో ఆ రాష్ట్రంలో ఎన్నికలు ఉన్నాయి. పైగా మూడింట ఒక వంతు ముస్లిం జనాభా ఉంది. మొత్తం 294 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను నిర్ణయించే శక్తిగా వారు ఉన్నారు. దాంతో నాలుగవ సారి సీఎం గా మమత ప్రమాణం చేయాలని చూస్తున్నారు. దానికి ఆమె వక్ఫ్ చట్టాన్ని ఉపయోగించుకుంటున్నారని విపక్షాలు అంటున్నాయి. ఇక మమత చేసిన ఈ ప్రకటన తరహాలోనే మిగిలిన బీజేపీయేతర రాష్ట్రాలలో ఎవరైనా అంటారా అన్న చర్చ కూడా ఉంది. అలా కనుక ఇదే తీరుని ఎవరైనా అనుసరిస్తే మాత్రం అది రాజ్యాంగం ప్రకారం ఇబ్బంది అవుతుంది అని అంటున్నారు. నిజానికి ఈ చట్టం మీద ఇప్పటికే కొందరు సుప్రీంకోర్టుకు వెళ్లారు. కోర్టు ఏమి చెబుతుందో కూడా చూడాల్సి ఉంది. ఏది ఏమైనా దీదీ మాత్రం మోదీని ఢీ కొట్టడానికే రెడీ అని చెబుతున్నారని అంటున్నారు.

# రిలేషన్‌షిప్ లో ఎవరికీ సహనం ఉండట్లేదు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మాజీ భార్య రేణు దేశాయ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటారనే విషయం తెలిసిందే. పవన్ నుంచి విడిపోయిన తర్వాత పిల్లలు అకీరా, ఆద్య బాధ్యతని తీసుకుని వారిని పెంచుతూ జీవితాన్ని గడుపుతున్న రేణూ దేశాయ్ ప్రతీ విషయాన్ని తన ఇన్‌స్టాలో షేర్ చేస్తూ అందరికీ టచ్ లో ఉంటుంది. రీసెంట్ గా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న రేణూ దేశాయ్ పలు వ్యక్తిగత విషయాలతో పాటూ ప్రెజెంట్ జెనరేషన్ రిలేషన్‌షిప్ పై తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఈ రోజుల్లో ఎవరికీ సహనం లేకుండా పోయిందని, 1% కూడా సహనం ఉండట్లేదని, వాస్తవానికి తాను ఈ విషయం గురించి మాట్లాడకూడదనుకుంటున్నానని, ఏమైనా మాట్లాడితే మీరెందుకు మాట్లాడుతున్నారు? పెళ్లైపోయి విడాకులు తీసుకున్నానంటారని అంటోంది రేణూ. పెళ్లిలో ఓ గొప్ప సంస్కృతి ఉందని, ఆ సంప్రాదాయాన్ని అమ్మాయి, అబ్బాయి



ఇద్దరూ అర్థం చేసుకోవాలని, పెళ్లి చాలా గొప్పదని, అందరూ ఆడ, మగ సమానమంటారు కానీ అసలు సమానం కాదని, ఆడవాళ్ల గొప్ప ఆడవాళ్లదేనని, మగవాళ్ల గొప్ప మగవాళ్లదేనని, ఇద్దరూ ఎప్పటికీ సమానం కాదని రేణూ కుండబద్దలు కొట్టి మరీ చెప్పింది. ఆడవాళ్ల పని సున్నితంగా ఉంటూ ఇంటిని చక్కబెట్టుకుంటూ మంచి వంట చేసుకుని అన్నీ సక్రమంగా చూసుకోవడం అయితే, మగవాడి పని బయటికెళ్లి యుద్ధం చేసైనా సరే డబ్బు సంపాదించి కుటుంబాన్ని సంతోషంగా చూసుకోవడమని, ఈ రెండూ సరిగ్గా జరిగితే అంతా సక్రమంగా జరిగి లైఫ్ చాలా బావుంటుందని తెలిపింది రేణూ. ఇప్పుడు జెనరేషన్ మారింది కానీ పెళ్లి పైన అందరికీ సరైన అవగాహన రావడం లేదని, తనకు తెలిసిన ఎంతో మంది మంచి మగాళ్లు కూడా ఉన్నారని, వారంతా పెళ్లి చేసుకుని సంతోషంగా లైఫ్ ను లీడ్ చేస్తున్నారని రేణూ తెలిపింది. ఇదే ఇంటర్వ్యూలో రెండో పెళ్లి గురించి కూడా రేణూ మాట్లాడింది. పిల్లలు ఇంకా చిన్నవాళ్లే అవడంతో రెండో పెళ్లి చేసుకుంటే రిలేషన్‌షిప్‌కీ, పిల్లలకీ సరైన టైమ్ ను కేటాయించలేననే భయంతోనే ఆ ఆలోచనను విరమించుకున్నానని, ప్రస్తుతం ఆద్యకు 15 సంవత్సరాలనీ, తనకు 18 ఏళ్లు నిండాక రెండో పెళ్లి ఆలోచన చేస్తానేమో అని రేణూ తెలిపింది.

# పాకిస్థాన్ లో అజ్ఞాత వ్యక్తుల హల్ చల్..

## మసూద్ అజాద్ బంధువు హతం

దాయాది దేశం పాకిస్థాన్ లో అజ్ఞాత వ్యక్తులు అలజడి సృష్టిస్తున్నారు. గుట్టుగా వస్తున్న అజ్ఞాతవాసులు మోస్ట్ వాంటెండ్ తీవ్రవాదులను క్షణాల్లో మట్టుబెట్టి మాయమైపోతున్నారు. ఈ హఠాత్ పరిణామాలతో పాక్ ప్రభుత్వం తల్లడిల్లిపోతోందని అంటున్నారు. మరోవైపు భారత్ పై అప్రకటిత యుద్ధం చేస్తున్న ఉగ్రవాదులు ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడిపోతున్నారని చెబుతున్నారు. పాక్ ప్రభుత్వంతోపాటు దాని ఇంటెలిజెన్స్ నెట్ వర్కు ఐఎస్ఐకి కూడా తెలియకుండా జరుగుతున్న ఈ దాడులు ఉగ్రవాదుల్లో దడ పుట్టిస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. ఉగ్రవాదులు, ఉగ్రవాదానికి స్వర్గధామమైన పాకిస్థాన్ లో ఇప్పుడు వారికి రక్షణ కరువైంది. భారత వ్యతిరేక టెర్రరిస్టులు ఇళ్లలో నుంచి బయటకు వెళ్తే మళ్లీ ఇంటికి చేరడం లేదు. "అజ్ఞాత వ్యక్తులు" లేదా "గుర్తు తెలియని వ్యక్తుల" దాడుల్లో మరుసగా మరణిస్తున్నారు. సింపుల్ గా బైక్ పై వచ్చేవారు ఉగ్రవాదిని దగ్గర నుంచి కాల్చివేసి శరవేగంగా అక్కడి నుంచి పారిపోతున్నారు. అసలు వీరు ఎవరనేది మిస్టరీగా మారుతోంది. కెనడాలో ఖలీస్థాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లే పాక్ లో భారత



వ్యతిరేక శక్తులను ఏరివేస్తుండటం ఆసక్తి రేపుతోంది. గతంలో కెనడాలో తలదాచుకున్న ఖలీస్థానీ టెర్రరిస్ట్ హరదీప్ సింగ్ నిజ్జర్ ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చడం తెలిసిందే. ఇప్పుడు పాక్ లోనూ అదేవిధంగా మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టు, జైషే ఏ మొహమ్మద్ అధినేత మౌలానా అజార్ బంధువు మౌలానా ఐజాజ్ అబిద్ ను కాల్చిచంపారు. పాకిస్థాన్ రాడికల్ ఇస్లామిస్ట్ గా ఐజాజ్ అబిద్ కు పేరుంది. ఇతను జైషే కోసం కీలక రిక్రూటర్ గా కూడా వ్యవహరిస్తుంటాడని అంటారు. ఖైబర్ ఫఖ్తుంఖ్వా రాజధాని పెషావర్ లోని పిష్టాఖరా ప్రాంతంలో పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు అబిద్ ని కాల్చి చంపడం పాక్ లో చర్చనీయాంశమైంది. అహ్లే-ఎ-సున్నత్ వాల్ జమాత్ ((%ూూఔజీ%) అనే ఉగ్రవాద సంస్థకు అబిద్ బాగా కావాల్సిన వాడిగా చెబుతున్నారు. అంతర్జాతీయ ఖత్మ్-ఎ-సబువత్ ఉద్యమానికి ప్రాంతీయ అధిపతిగా ఇతడు పనిచేస్తున్నాడు. ఒక మసీదు వెలుపల జరిగిన మెరుపుదాడిలో ఇతను హతమయ్యాడు. జైషే మహ్మద్ లో అబిద్ కీలక వ్యక్తిగా చలామణి అవుతున్నాడు. అలాంటి కీలక వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చడంతో టెర్రరిస్టు క్యాంపులు హడలిపోతున్నాయని అంటున్నారు.

# చురకలు

## సంపాదకీయం

## పుతిన్ వచ్చాకే వైరం పెరిగిందా?

### అమెరికా రష్యా సంబంధాల వెనుక అసలు కథ!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధానం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. దీని కారణంగా గ్లోబల్ స్టాక్ మార్కెట్ నష్టాల్లోకి వెళుతోంది. ఈ విధానం వల్ల భారత్, చైనా వంటి అనేక దేశాలు ఇబ్బందుల్లో పడ్డాయి. టారిఫ్ కారణంగా రష్యా కూడా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రష్యా ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా చమురు, గ్యాస్ , ఖనిజాల ఎగుమతులపై ఆధారపడి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ సంక్షోభం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఒకానొక సమయంలో అమెరికా రష్యాపై ఆంక్షలు విధించింది.


అందుకే ఈ రెండు దేశాలు ఒకరితో ఒకరు వ్యాపారం చేసుకోవు.

**అమెరికా, రష్యా ఎందుకు శత్రువులు?...** అమెరికా, రష్యా మధ్య శత్రుత్వం ఈనాటిది కాదు. ఉక్రెయిన్ యుద్ధం కావచ్చు లేదా రెండవ ప్రపంచ యుద్ధం కావచ్చు. అమెరికా, రష్యా సంబంధాలు ఎల్లప్పుడూ ఉద్రిక్తంగానే ఉన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో సోవియట్ యూనియన్, అమెరికా మధ్య కూడా తీవ్రమైన విభేదాలు ఉన్నాయి. అందుకే ఈ రెండు దేశాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థితికి చేరుకున్నాయి. సోవియట్ యూనియన్ కాలంలోనే రెండు దేశాల మధ్య వైరం పెరగడంతో ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయింది. ఒకటి అమెరికా, యూరప్ , బ్రిటన్ కలిసి నాటోగా ఏర్పడగా, మరొకటి తూర్పు యూరప్‌తో కలిసి వార్సా ఒప్పందం కింద ఏర్పడింది.

**పుతిన్ రాకతో మరింత పెరిగిన వైరం...** అమెరికా, రష్యా మధ్య వైరం చాలా సంవత్సరాలుగా ఉన్నప్పటికీ, వ్లాదిమిర్ పుతిన్ అధికారం చేపట్టిన తర్వాత అది మరింత పెరిగింది. ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు ఎంతగా దిగజారాయంటే, అమెరికా రష్యాపై అనేక రకాల ఆంక్షలు విధించింది. మరోవైపు రష్యా కూడా అనేకసార్లు అమెరికాపై అణ్వాయుధ దాడి చేస్తామని బెదిరించింది.

**అమెరికా, రష్యా వ్యాపారం చేసుకోరా?...** అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం ప్రకారం, 2024లో అమెరికా, రష్యా మధ్య వాణిజ్యం $3.5 బిలియన్లు (2.7 బిలియన్లు). ఇందులో ప్రధానంగా ఎరువులు, అణు ఇంధనం, కొన్ని లోహాలు ఉన్నాయి. అమెరికా, రష్యా మధ్య వాణిజ్యం నిలిచిపోయినప్పటికీ, కొన్ని ముఖ్యమైన వస్తువుల విషయంలో నేటికీ దిగుమతులు, ఎగుమతులు జరుగుతున్నాయి. కానీ చాలా వస్తువులపై అమెరికా రష్యాపై నిషేధం విధించింది.

# పీడిత జన బాంధవుడు జ్యోతి రావు పూలే - ఏప్రిల్ 11... మహాత్మా పూలే జయంతి



భారత జాతిపిత మోహన్ దాస్ గాంధీ కన్నా ముందే "మహాత్మునిగా"" భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ చే, ""గురువుగా" భావింప బడి, ప్రకటింప బడి, జన నీరాజనాలు అందుకున్న జ్యోతిరావు పూలే భారత ప్రప్రథమ సామాజిక తత్వవేత్త. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న ప్రజలకు ఆత్మస్థైర్యం అందించేందుకు, వారి హక్కుల కోసం, నిరంతరం అననుకూల పరిస్థితులలో పోరాటాలు చేసి సత్య ధర్మ శోధక మండలిని స్థాపించి, పలు సమస్యల పరిష్కారానికి కృషిచేసిన మహనీయుడు పూలే. సామాజిక తత్వవేత్తగా, ఉద్యమకారునిగా, సంస్కరణవాదిగా, సాంఘిక సేవా తత్పరునిగా, బాలికా విద్య ప్రోత్సాహకునిగా, మహిళా హక్కుల పరిరక్షకునిగా, కార్మిక పక్షపాతిగా, దీన జన బాంధవునిగా, లింగ వివక్షకు వ్యతిరేకిగా అణగదొక్కబడిన వర్గాల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారు పూలే. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్ర ( బ్రిటిష్ ఇండియా)లో జన్మించిన పూలే. తండ్రి గోవిందరావు పీష్వాల కాలంలో పూల వ్యాపారం చేయడం వల్ల వారికి పూలే అని పేరు వచ్చింది. చిన్నతనంలో చదువు మానేసి, తిరిగి పుణేలో 1941లో క్రైస్తవ ముస్లిం మిత్రుల సహకారంతో , స్కాటిష్ మిషన్ లో చేరి విద్యాభ్యాసం కొనసాగించారు. పుస్తకపఠనం పై మక్కువ ఎక్కువ చూపారు. చదువుకునే సమయాన 1948లో బ్రాహ్మణ స్నేహితుని వివాహానికి హాజరైన సందర్భంగా బిసి "మాలి" కులానికి చెందిన పూలే కుల వివక్ష కు లోనై తీవ్ర మానసిక వ్యధ చెందారు. సదాశివ బిల్లాల్ గోవింద్ అనే బ్రాహ్మణ మిత్ర పరిచయం, సాన్నిహిత్యం, "థా మస్" రచన మానవ హక్కుల ప్రభావం, ఆయనపై ఎంతగానో ప్రభావం చూపింది. కులం, వర్గం, ప్రాంతం, లింగాది, వివక్షతలకు అవిద్యే కారణమని భావించి, తన భార్య సావిత్రిని బడికి పంపా రాయన. 1848 ఆగస్టులో బాలికల పాఠశాలను 51ь52 లో మరో రెండు పాఠశాలలను ఆదర్శ దంపతులు స్థాపించారు. 1853లో దేశంలోనే మొదటిదిగా పూలే వితంతువుల అనాధ శిశువుల కోసం సేవా సదనం స్థాపించారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని స్థాపించారు. 1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించి, వితంతువులెట్కన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచారు. 1868లో తన ఇంటి దగ్గరున్న స్నానాల తొట్టి వద్ద స్నానం చేసేందుకు అంటరాని వారికి కూడా అనుమతి ఇచ్చారు. బాల హత్య ప్రతిబంధక్ గృహలో జన్మించిన బ్రాహ్మణ వితంతు కుమారున్ని 1872 లో దత్తత స్వీకరించారు. తాను అనుభవించిన కుల వివక్ష ఇతరులకు అనుభవానికి రాకూడదని ఆకాంక్షించారు. సహ ధర్మ చారిణి సావిత్రి తో కలిసి 40 ఏళ్ల పాటు నిర్వహించిన సామాజిక ఉద్యమాలు, పూలే దంపతులకు పేద జనోద్ధారకులుగా సమాజంలో గుర్తింపు తెచ్చాయి. ఎక్కడ అన్యాయం, వివక్ష చోటు చేసుకుంటే, అక్కడ ఉద్యమం నడిపారు. అణగారిన వర్గాలకే కాదు, బాధితులైన అగ్రకుల వితంతు పునర్వివాహాలకు విశేష కృషి సలిపారు. బ్రాహ్మణ వితంతువులకు శిరో ముండనాలు చేయమని క్షురకులచే సమ్మెలు చేయించారు. 1871 లో సత్యశోధన పక్షాన దీనబంధు పత్రిక నడిపాడు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించారు. 1873 సెప్టెంబరు 24న సత్య శోధక సమాజాన్ని పూలే స్థాపించాడు. దేశంలోనే ఇది మొట్టమొదటి సంస్కరణోద్యమం. బొంబాయి నిర్మాణానికి తెలంగాణ నుండి వలస వెళ్ళి ఎదిగిన మున్నూరుకాపులే అధికం. బొంబాయిలో సత్యశోధక్ సమాజ్ శాఖ పుట్టింది సయాజీ నాగు మున్నూరుకాపు ఇంటిలోనే. పూలే సామాజిక సంస్కరణోద్యమానికి తుదిశ్వాస వరకు చేదోడు వాదోడై నిలిచిన జాయా కారాడీ లింగు తెలంగాణం కన్న మున్నూరు కాపు బిడ్డ. కారాడి లింగు తండ్రి జాయా ఎల్లప్పలింగు ముంబైలో భవన నిర్మాణ కాంట్రాక్టరు. పూలే కొంతకాలం భవన నిర్మాణ కాంట్రాక్టరుగా పనిచేశారు. అప్పుడే ఆయనకు ముంబై తెలుగు ప్రజల పితామహునిగా ప్రసిద్ధులైన కాంట్రాక్టరు రామయ్య వెంకయ్య అయ్యవారితో పరిచయమైంది. వెంకయ్య పూలేను ముంబైకి ఆహ్వానించి, తోటి కాంట్రాక్టర్లతో కలిసి సత్యశోధక సమాజాన్ని విస్తరింపజేయడానికి, పాఠశాలలను ఏర్పాటుచేసి నడపడానికి ఆర్థిక, హార్దిక సహాయాలను అందించారు. సత్యశోధక సమాజానికి తెలుగువారి విరాళాలే ప్రధాన ఆర్థిక వనరుగా ఉండేవి. వెంకయ్య ఇల్లే అనాథ బాలల ఆశ్రమంగా ఉండేది. వారిని గొప్ప విద్యా వంతులుగా, సత్యశోధకులుగా చేసిన ఘనత వెంకయ్యదే. పూలే ప్రసిద్ధ గ్రంథం "గులాంగిరి" పుస్తక ప్రచురణ 1873లో వెంకయ్యనే ప్రచురించారు. 1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటిష్ వారిచే పాఠశాలల్ని ఏర్పాటు చేయించారు. 83 లో కల్టివేటర్ విప్ కార్డ్ ( సేద్య గాడిపై చర్నాకోల) ముప్పై మూడు వ్యాసాల పుస్తకాన్ని సార్వజనిక సత్య ధర్మ పేరున ప్రచురించారు. బ్రాహ్మణేతరులచే జరిపించిన కులాంతర వివాహాలు చెల్లవని బ్రాహ్మణులు తీర్మానాలు చేస్తే, సత్యశోధన మండలి ద్వారా కోర్టుకు వెళ్లారు. 1990లో కోర్టు పూలే వాదనను సమర్థించింది. తద్వారా పూలే అమితానందం చెందారు. ఆయన వ్రాసిన 33 ఆర్టికల్స్ గల "సార్వజనిక్ సత్యధర్మ" పుస్తకంలో కుటుంబ సృష్టి నియమాల గురించి వివరిస్తూ ప్రపంచం మొత్తాన్ని ఒక కుటుంబంగా వ్యక్తీకరించారు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ పూలే తన గురువు అని డా బి.ఆర్. అంబేద్కర్ ప్రకటించారు. పూలేకు కేవలం కుల వ్యవస్థ వ్యతిరేకతే కాదు, సామ్రాజ్యవాద వ్యతిరేకత, కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడే అవగాహన, కార్యాచరణ ఉన్నాయి. అనారోగ్యానికి గురై పడకకే పరిమితం అయిన సమయాన, తాను మృతి చెందాక, ఎవరు ఏ బాధ్యతలు స్వీకరించాలో వివరించి సామాజిక ఉద్యమాలు, విస్తరింపచేసి, ప్రగతి మార్గంలో ప్రజలను తీసుకెళ్లాలని నొక్కి చెప్పి, తన ఆదర్శాలను కొనసాగించాలని హితవు పలికి 63వ ఏట 1890 నవంబర్ 28న గురువారం రాత్రి ప్రార్థనా గీతాల మధ్య దీర్ఘ నిద్రకు మహాత్మ పూలే ఉపక్రమించారు. భారతావనిలో గొప్ప సాంఘిక సంస్కర్తగా ఆచంద్ర తారార్కం మహాత్మ పూలే మిగిలి పోనున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పెంపుడు జంతువుల సంరక్షణకు పెద్ద పీట వేయాలి - ఏప్రిల్ 11...జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవం


ప్రతి ఏప్రిల్ 11న జరుపుకునే జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవం మానవ సమాజానికి మూగ జీవుల పట్ల ఉన్న మానవతా విలువలను గుర్తు చేసే రోజు. పెంపుడు జంతువులు మన జీవితాల్లో కేవలం వినోదానికి పరిమితమైన ప్రాణులు కాదుబీ అవి మన జీవిత భాగస్వాములు. కానీ ఈ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న సమాజంలో, ఇంకా అనేక జంతువులు నిర్లక్ష్యానికి, హింసకు గురవుతుండటం నిజంగా విచారకరం. ఈ దినోత్సవం 2006లో అమెరికాలోని జంతు హక్కుల ఉద్యమకారిణి కోలీన్ పైజ్ ద్వారా ప్రారంభించ బడింది. ఇప్పుడది భారత దేశంలో కూడా చైతన్యాన్ని కలిగిస్తూ ఉంది. లక్ష్యం ఒక్కటే %-% పెంపుడు జంతువుల పట్ల ప్రేమను వేడుక చేసుకోవడమే కాక, వాటి సంక్షేమాన్ని, హక్కులను గుర్తించి, సంరక్షణకు పెద్ద పీట వేయడం. పెంపుడు జంతువులు మనకు ఒత్తిడిని తగ్గించే సహచరులు, మనసుకు ఓదార్పు ఇచ్చే స్నేహితులు. అవి మాట్లాడలేవు గానీ మన హృదయానికి అత్యంత దగ్గరగా ఉంటాయి. ఇవి మనకు నిజమైన, స్వార్థ రహిత ప్రేమను అందిస్తాయి. అలాంటి జీవుల పట్ల మన ప్రేమను వ్యక్తపరచేందుకు, వాటికి మంచి జీవితాన్ని ఇవ్వాల్సిన బాధ్యతను గుర్తు చేసేందుకు ఈ రోజు ఒక గొప్ప అవకాశంగా మారుతోంది. నగరాల్లో పెంపుడు జంతువుల పెంపకం ఒక ఫ్యాషన్‌గా మారుతోంది. కానీ పలు సందర్భాల్లో, బాధ్యతలేమి వల్ల, జంతువులను వీధుల్లో వదిలేయడం, గాలికొదిలేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. వీధుల్లో తిరిగే అనేక మూగ జీవులు ఆకలితో, వ్యాధులతో బాధపడుతూ, ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇది మన సమాజానికి కంటిపాపగా నిలవాల్సిన సత్యం. పెంపుడు జంతువుల దినోత్సవం అంటే వాటికి ట్రీట్ ఇవ్వడం, ఫోటోలు తీసి షేర్ చేయడం మాత్రమే కాదు. వాటి ఆరోగ్యం, భద్రత, మానసిక శాంతిని కాపాడడం కూడా మన బాధ్యత. ప్రతి యజమాని ఈ విషయాలను అర్థం చేసుకొని, జంతువుల పట్ల బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. పిల్లల్లో చిన్ననాటి నుంచే జంతువుల పట్ల దయా దాక్షిణ్యాలు కల్పించేందుకు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. కుటుంబాల స్థాయిలో జంతు సంరక్షణ పట్ల అవగాహన పెంపొందించాలి. ప్రభుత్వాలు ఈ దినాన్ని పురస్కరించుకొని అనాథ జంతువుల ఆశ్రయ కేంద్రాలకు నిధులు, పశు వైద్యం కోసం అవసరమైన సదుపాయాలు కల్పించాలి. పెంపుడు జంతువుల కొనుగోలు కన్నా, ఆశ్రయ కేంద్రాల్లో ఉన్న జంతువులను దత్తత తీసుకోవడం ద్వారా ఒక జీవితం కాపాడవచ్చు. కాలానుగుణంగా జంతువులకు వైద్య పరీక్షలు, టీకాలు, మరియు చికిత్సలు అందించాలి. పెంపుడు జంతువుల బాధ్యతలపై వర్క్‌షాపులు, అవగాహన కార్యక్రమాలు జరపాలి. జంతు హింసకు పాల్పడినవారికి శిక్షలు తప్పనిసరిగా ఉండాలి. జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవం మన ప్రేమను వ్యక్తపరచే ఒక రోజు మాత్రమే కాదు ... మన బాధ్యతలను గుర్తు చేసే పిలుపు కూడా. మూగ జీవుల పట్ల మన ప్రేమ నిజంగా పరిపూర్ణం కావాలంటే, దానికి బాధ్యత అనే పునాదిని కలిపి చూడాలి. ఒక మూగ జీవికి మనం చూపే శ్రద్ధ, ప్రేమ, సంరక్షణ – ఇవే నిజమైన మానవత్వానికి నిదర్శనం. ఈ దినోత్సవం ద్వారా ఒక్కొక్కరికీ మానవతా స్పర్శ గల హృదయం కలగాలి – ప్రేమతో పాటు బాధ్యతను చాటే ఉదాత్త జీవన దృక్కోణం కలగాలి.




**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# ఏప్రిల్ 11... ప్రపంచ పార్కిన్సన్ దినోత్సవం

18వ శతాబ్దంలో జేమ్స్ పార్కిన్ సన్ అనే ఆంగ్లవైద్యుడు ఒళ్ళు ఒణుకు వ్యాధి అనే పేరుతో మొదట దీన్ని నిర్వచించిన కారణంగా పార్కిన్సన్స్ వ్యాధి అంటారు. ఈ వ్యాధి వేదకాలం లోనే ప్రస్తావించ బడింది. ఆయుర్వేద సంహితలో అంటే ప్రాచీన భారతీయ వైద్యశాస్త్రంలో ఈ వ్యాధి, దాని లక్షణాలు, చికిత్స పేర్కొన బడ్డాయి. నాటి వైద్యశాస్త్ర నిపుణులు దీన్ని కంపవాత మన్నారు. 2500 సంవత్సరాలకు పూర్వమే నైజింగ్ అనే చైనా వైద్యశాస్త్రంలో దీని గురించిన ప్రస్తావన వుంది. కంపవాతం ఆయుర్వేద రీత్యా ఒక నరాల జబ్బు. ఈ వ్యాధి సోకిన మనిషి కదలికలో వ్యత్యాసం కనిపిస్తుంది. కూర్చొని, పడుకొని ఉన్నంతసేపూ బాగుం టాడు. కాని లేచి నిలబడి కదలబోతే శరీరం వణికి ఇటూ అటూ కదిలి పోతూ పడిపోతుంటాడు. పార్కిన్సన్ వ్యాధిని ఇప్పటికీ కారణం తెలియని వ్యాధిగానే పరిగణిస్తున్నారు. జన్యుపరంగా, పర్యావరణ కారణాలవల్ల ఈ వ్యాధి వస్తుంది. పర్యావరణ కాలుష్యం విషపదార్థాలు, ఎరువులు, డ్రగ్స్ (యాంటీ సైకోటికో, వాంతి వచ్చే మందులు) తయారీ, తరచుగా తలనొప్పి తదితర కారణాలతో పార్కిన్సన్ వ్యాధి ముడిపడి ఉంది. మెదడులో ఉత్పన్నమయ్యే డోపమైన్ కణాలు తగ్గిన పక్షంలో ఈ వ్యాధి వచ్చినట్టు నిర్ధారణ చేసుకోవచ్చు. ప్రొటీనోపతి (ప్రోటీన్లకు సంబంధించిన రుగ్మత) వల్ల పార్కిన్సన్ వ్యాధివచ్చే అవకాశముంది. పార్కిన్సన్ వ్యాధి సర్వసాధారణ వ్యాధి. ఇది సమాజంలో ప్రబలంగా ఉంది. 60 ఏళు దాటిన వయోవృద్ధులకు ఇది వస్తుంది. దీన్ని వృద్ధాప్యంలో వచ్చే అంగవైకల్య వ్యాధిగా పరిగణిస్తారు. "వణుకుడు రోగం" లేక "పార్కిన్సన్స్ వ్యాధి" నాడీ కణాలను (నరాల కణాలను) దెబ్బ తీయడం ద్వారా ప్రగతిశీల మెదడు దెబ్బకు దారితీస్తుంది. 'డోపమైన్' అని పలవబడే న్యూరోట్రాన్స్మిటర్ ద్వారా మెదడు అంతటా సంకేతాలు ప్రసరించే బాధ్యత ఈ నాడీ కణాలదే. సాధారణ పరిస్థితులలో, మృదువైన, సమతుల్య కండరాల సమన్వయాన్ని డోపమైన్ సహాయంతో సాధించవచ్చు. ఈ డోపామైన్ అనే ఈ న్యూరోట్రాన్స్మిటర్ లేకపోవడం మూలంగానే "పార్కిన్సన్స్ వ్యాధి" లేక వణుకుడు రోగం మనుషుల్లో సంభవిస్తుంది. పార్కిన్సన్స్ వ్యాధి యొక్క ప్రారంభ మరియు అత్యంత సాధారణ లక్షణాలు శరీరంలోని అవయవాల్లోని ఏదో ఒక భాగంలో...




చేతులు లేదా కాళ్ళు లేదా దవడ లోనైనా, వణుకుడు రావడం. చేయి విశ్రాంతి దశలో ఉన్నప్పుడు ప్రకంపన లేదా వణుకు సాధారణంగా గుర్తించ బడుతుంది, సాధారణంగా చూపుడు వేలుకు వ్యతిరేకంగా బొటనవేలు యొక్క కదలికను చూడవచ్చు. దీని రెండవ లక్షణం సాధారణంగా కండరాల పెడసరం లేదా కండరాలు బిగదీయడం. మనిషి స్వేచ్ఛా చలన వలయాల్ని కుంటుపరుస్తూ (పరిమితం చేస్తూ) అనియంత్రితమైన కండరాల పెడసరం లేక కండరాలు పట్టేయడమనేది వణుకుడు వ్యాధి లక్షణం. వ్యాధికి గురైన వ్యక్తులు చేపట్టిన ఏదైనా పనియొక్క వేగంలో క్రమమైన తగ్గుదలను చూపుతారు. స్నానం లేదా తినడం వంటి సాధారణ కార్యకలాపాల్ని పూర్తి చేయడంలో కూడా వీళ్ళు అసాధారణంగా ఎక్కువసేపు తీసుకోవాల్సి వస్తుంది. సాపేక్షంగా అరుదుగా ఉండే లక్షణాలలో భయము, చొంగ కార్చడం, చర్మ సమస్యలు, మూత్ర సమస్యలు, లైంగిక అసమర్థత ఉంటాయి. వ్యాధి బాధితుడి వణుకుడు గణనీయంగా సదరు వ్యక్తి మాటల్ని మరియు చేతివ్రాతను దెబ్బ తీస్తుంది. వణుకుడు రోగానికి సంభావ్య కారణాలను గుర్తించడానికి పరిశోధన కొనసాగుతున్నప్పటికీ, అదిప్పటికీ తెలియదు. జన్యు కారకాలు మరియు కొన్ని పర్యావరణ పరిస్థితుల్ని వణుకుడు జబ్బుకు ప్రమాద కారకాలుగా భావిస్తారు. పార్కిన్సన్స్ వ్యాధిని అభివృద్ధి చేయడంలో జన్యు పరివర్తనలు ప్రమాద కారకంగా గుర్తించ బడ్డాయి, యాంటిసైకోటిక్ ఔషధాలను సేవించే వ్యక్తులు లేదా మెదడు అనారోగ్యంతో బాధపడుతున్న వారిలో లేదా గతంలో స్ట్రోక్ లకు గురై బాధపడుతున్న వ్యక్తులకు వణుకుడు రోగం సంభవించ వచ్చునని భావించ బడుతోంది. పరిస్థితిని నిర్ధారించడానికి నిర్దిష్ట రక్తం లేదా ప్రయోగశాల పరిశోధన లేనందున పార్కిన్సన్స్ వ్యాధి నిర్ధారణను గందరగోళంగా చెప్పవచ్చు. అంతే కాకుండా, లక్షణాలు తరచూ కీళ్ళ అసాధారణతలు లేదా విటమిన్ లోపాల వంటి ఇతర రుగ్మతలను అనుకరిస్తాయి. ఒక అర్హత కలిగిన న్యూరాలజిస్ట్ తో సలహా, సంప్రదింపులు తీసుకోవాలి. ఈ న్యూరాలజిస్ట్ కొంతకాలం పాటు లక్షణాలను పరిశీలించి, వ్యాధి పురోగతిని ఆపడమే లేక నియంత్రించడమో చేయగలరు. చికిత్సకు సంబంధించినంత వరకు, 'డోపమైన్' లోప పరిస్థితికి వివిధ రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఈ మందులు వ్యాధికి గురైన మెదడు బాగాలను ప్రేరేపించడం ద్వారా పని చేస్తాయి. అయితే, దీర్ఘకాలిక దశలో, ఈ మందులు దుష్ప్రభావాలను చూపుతాయి. మందులు వ్యాధి లక్షణాలను నియంత్రించ లేకుంటే, శస్త్రచికిత్స అవసరం కావచ్చు. మెదడును ప్రేరేపించటానికి ఎలక్ట్రోడ్లు ఉపయోగించడం ఇందులో జరుగుతుంది, ఇలా చేయడం ద్వారా వణుకుడ్ని ప్రేరేపించడానికి దారితీసే ప్రేరణల్ని అడ్డుకోవడం జరుగుతుంది. పార్కిన్సన్స్ వ్యాధి ఒక ప్రగతిశీల రుగ్మత. ఈ రుగ్మతకు ఖచ్చితమైన నివారణ లేదు. మానసిక ఆరోగ్యాన్ని, శారీరక చర్యల్ని చేపట్టే సామర్థ్యాన్ని కాపాడు కోవడమే ఈ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తుల దీర్ఘకాలిక లక్ష్యాలుగా ఉండాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అంతా బాధ్యులే.. అన్నీ బాధలే..!

భువనగిరి : ప్రభుత్వ సంక్షేమశాఖల పాలన ఏళ్లతరబడి ఇన్‌ఛార్జి అధికారులతో కొనసాగుతోంది. బీసీ సంక్షేమశాఖ మినహా అన్ని శాఖలకు పలువురు అధికారులు అదనపు బాధ్యతలతో పనిభారం మోస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, గిరిజన, మైనార్టీ సంక్షేమశాఖల పరిధిలోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇన్‌ఛార్జులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు నిర్ణీత వ్యవధిలో అందుబాటులో లేకపోవడంతో ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఉపకార వేతనాలు, ఇతర పాలనాపరమైన పనులు కుంటుపడుతున్నాయి. సేవలు, పనుల్లో జాప్యం పర్యవేక్షణ లోపంతో పాలనపై పరోక్ష ప్రభావం పడుతోంది. గిరిజన సంక్షేమశాఖ పరిధిలో ఎనిమిది వసతి గృహాలు, ఒక ఆశ్రమ పాఠశాల ఉంది. ఆయా వసతి గృహాలు, పాఠశాలల్లో 520 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. 11 మంది బోధన, 52 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. సంక్షేమ అధికారిగా పనిచేస్తున్న మంగ్తానాయక్ 2022లో ఏసీబీకి పట్టుబడటంతో నాటి నుంచి నేటి వరకు విడతల వారీగా డీఆర్‌డీవో నాగిరెడ్డి ఇన్‌ఛార్జిగా పనిచేశారు. మందడి ఉపేందర్‌రెడ్డి, కృష్ణన్ తదుపరి మళ్లీ నాగిరెడ్డి ఇన్‌ఛార్జిగా



వ్యవహరిస్తున్నారు. మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా 2016 నుంచి నవంబరు 2022 వరకు సత్యనారాయణ పనిచేశారు. ప్రస్తుతం బీసీ సంక్షేమశాఖ అధికారి యాదయ్య ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. శాఖ పరిధిలో ఆలేరు, భువనగిరి, చౌటుప్పల్‌లలో మైనార్టీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. బోధన సిబ్బంది 120 మంది, బోధనేత సిబ్బంది 30 మంది వరకు ఉన్నారు.

ఎస్సీ సంక్షేమశాఖకు ప్రస్తుతం ఏఎస్‌డబ్ల్యూవో ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 19 ఎస్సీ వసతి గృహాలు, రెండు కళాశాల వసతి గృహాలు పనిచేస్తున్నాయి. 19 వసతి గృహాల్లో 1127 మంది విద్యార్థులు, రెండు కళాశాల వసతి గృహాల్లో 263 మంది విద్యార్థులు ఉన్నారు. 11 మంది వార్డెన్లు, 85 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. రామారావు, జైపాల్‌రెడ్డి రెగ్యులర్ జిల్లా అధికారులుగా పనిచేశారు. రామారావు తదుపరి ఆఫీస్ సూపరింటెం డెంట్‌గా పనిచేసిన సజ్జన్ కుమార్ రెండు పర్యాయాలు, బాల్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, జడ్పీ డిప్యూటీ సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి ఇన్‌ఛార్జిలుగా పనిచేయడం గమనార్హం. ప్రస్తుతం ఏఎస్‌డబ్ల్యూవోగా పనిచేస్తున్న వసంతకుమార్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు.

# పంట పండింది.. గల్లాపెట్టె నిండింది

ఆదిలాబాద్ : ఉమ్మడి జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు భారీగా జరగడంతో ఉమ్మడి జిల్లాలోని పలు మార్కెట్లలో లక్ష్యానికి మించి ఆదాయం సమకూరింది. గతేడాది మార్కెట్లవారీగా ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.48.62 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా మార్చి 31 నాటికి రూ.60.90 కోట్లు వసూలయ్యాయి. ప్రైవేటు వ్యాపారులతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు సైతం విక్రయాలు జరపడంతో మార్కెట్ ఫీజుల రూపంలో మార్కెట్లకు భారీగా ఆదాయం చేకూరింది. ఉమ్మడి జిల్లాలో 18 మార్కెట్లు ఉన్నాయి. ఈ ఏడాది ప్రైవేట్‌లో పత్తికి మద్దతు ధర కంటే తక్కువగా ఉండటంతో 25 కేంద్రాలు ఏర్పాటు చేసి సీసీఐ పత్తిని కొనుగోలు చేసింది. పత్తి తర్వాత ఎక్కువగా సాగయ్యే సోయా, కందులు, శనగ తదితర వాటిని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. వరి పంటకు బోనస్ ఇవ్వడంతో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పంట విక్రయించారు.

**రికార్డుస్థాయిలో 65.65 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు**

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా ఉంటుంది. గతేడాది 10.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగుకాగా రికార్డు స్థాయిలో విక్రయాలు



జరిగాయి. గతంలో 46.88 లక్షల క్వింటాళ్ల పత్తి విక్రయాలుకాగా ఈ ఏడాది ప్రైవేట్, సీసీఐ కలిపి 65.65 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశాయి. మరోవైపు పంట ఉత్పత్తుల ధరలు ఎక్కువగా ఉండటంతో ఆదాయం ఎక్కువ మొత్తంలో సమకూరింది. మార్కెట్లలో జరిగిన విక్రయాల్లో సగానికిపైగా ఆదాయం పత్తితో వచ్చింది.

ఉమ్మడి జిల్లాలో అయిదు మార్కెట్లకు కలిపి రూ.19.57 కోట్ల ఆదాయం వస్తే అందులో ఆదిలాబాద్ మార్కెట్‌కు రూ.11.59 కోట్ల ఆదాయం వచ్చింది. జైనథ్ మార్కెట్‌కు రూ.1.60 కోట్లు లక్ష్యంకాగా రూ.1.25 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. నిర్మల్ జిల్లా పరిధిలో అయిదు మార్కెట్లు ఉండగా ఇక్కడ పత్తితోపాటు సోయా, మొక్కజొన్న, కంది పంటల విక్రయాలు జరుగుతాయి. భైంసా మార్కెట్‌లో పత్తి విక్రయాలు ఎక్కువగా జరుగుతుండటంతో మార్కెట్‌కు రూ.6.49 కోట్ల ఆదాయం వచ్చింది. మంచిర్యాల జిల్లాలో అయిదు మార్కెట్లు ఉండగా రూ.8.73 కోట్ల లక్ష్యం నిర్దేశించగా రూ.13.18 కోట్ల ఆదాయం సమకూరింది. అత్యధికంగా చెన్నూరు మార్కెట్‌కు రూ.6.20 కోట్ల ఆదాయం వచ్చింది. కుమురంభీం జిల్లా పరిధిలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, జైనూర్ మార్కెట్లు ఉన్నాయి. ఆసిఫాబాద్‌లో పత్తితోపాటు ఇతర పంట ఉత్పత్తుల విక్రయాలు ఎక్కువగా ఉండటంతో మార్కెట్ ఆదాయం రూ.7.21 కోట్లు వచ్చింది. జైనూర్‌లో లక్ష్యం మేరకు ఆదాయం రాలేదు.

# ఏటా రెండు జయంతులు



మల్యాల : రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామికి ఏటా రెండుసార్లు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఏటా చైత్ర పౌర్ణమి రోజు హనుమాన్ చిన్న జయంతిని వైశాఖ బహుళ దశమి పూర్వాభద్ర నక్షత్రం రోజున పెద్ద జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. చిన్న జయంతి నుంచి పెద్ద జయంతి మధ్య 41 రోజుల వ్యవధి ఉంటుంది.

**స్థల పురాణం**

జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి 15 కి.మీ దూరంలోని జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారికి రెండు కి.మీ దూరంలో ఎత్తయిన కొండలపై వెలసి కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తులు విశ్వసిస్తారు. దాదాపు అయిదు వందల ఏళ్ల కిందట కొడిమ్యాల పరగణాకు చెందిన సింగం సంజీవుడు ఆవులను మేపుతూ కొండగట్టు ప్రాంతంలోని గుట్టల్లోకి వెళ్లగా ఓ ఆవు తప్పిపోయింది. దానిని వెతికే క్రమంలో ఓ బండరాయిపై సేదతీరుతూ నిద్రలోకి జారుకోగా స్వప్నంలో ఆంజనేయ స్వామి ప్రత్యక్షమై ముళ్లపొదల్లో పడి ఉన్న తనకు గుడి నిర్మించాలని, ఆవు చెట్ల పొదల్లో ఉందని చెప్పి మాయమైనట్లు.. తర్వాత సంజీవుడు మేల్కొని ముళ్ల పొదల మధ్య ఉన్న స్వామివారి విగ్రహం వద్దకు వెళ్లగానే ఆవు ఎదురుగా వచ్చిందని, తర్వాత చిన్న గుడి నిర్మించినట్లు అర్చకులు, చరిత్రకారులు కథగా చెబుతుంటారు.

**దర్శనీయ స్థలాలు**

కొండగట్టు ఘాట్‌రోడ్డుపై నుంచి వెళ్తుండగా ఎడమవైపున 'జలబుగ్గ' అనే ప్రాంతంలో మండు వేసవిలోనూ నీరు ప్రవహిస్తుంటుంది. స్వామివారి ప్రధాన ఆలయానికి కుడివైపున వేంకటేశ్వరస్వామి, ఎడమవైపున అమ్మవారి ఉపాలయాలు ఉన్నాయి. ఆలయానికి వెనుకవైపున క్షేత్రపాలకుడైన భేతాళుని గుడి ఉంది. దాని పక్కనే ఎత్తయిన బండరాళ్లపై కొండాల్‌రాయుడు అనే పరాక్రమవంతుడు శత్రువులకు చిక్కకుండా నివాసమున్నట్లు ఆనవాళ్లు కూడా ఉన్నాయి. మరికొంత దూరంలో కనిపించే గుహల్లో మునులు తపస్సు చేసినట్లు చెబుతారు. ఆలయానికి వెళ్లే దారి పక్కన సీతమ్మ కన్నీటి గుంతలు కనిపిస్తాయి.

**ఇలా చేరుకోవచ్చు..**

కరీంనగర్ నుంచి దాదాపు 40 కి.మీ.ల దూరంలో దొంగలమర్రి నుంచి జేఎన్టీయూ కళాశాల మీదుగా ఆలయానికి చేరుకోవచ్చు. జగిత్యాల వైపు నుంచి వచ్చే భక్తులు 15 కి.మీ.ల దూరంలోని కొండగట్టు స్టేజీ నుంచి ఘాట్‌రోడ్డు మీదుగా 2 కి.మీ.లు ప్రయాణించి ఆలయానికి చేరుకోవచ్చు. మెట్లదారిన ఆలయం వరకు నడచి వెళ్లవచ్చు. కరీంనగర్, జగిత్యాల నుంచి నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.

**నారసింహ వక్త్రంతో ఆంజనేయస్వామివారు**

కొండగట్టులో కొలువుదీరిన ఆంజనేయస్వామివారు ముకుళిత హస్తాలతో ఉత్తరం వైపు వెళ్తున్నట్లు కనిపిస్తారు. విగ్రహం తలపై స్వామివారి పంచముఖాలలో ఒకటైన నారసింహుని ముఖం(వక్త్రం)తో దర్శనమివ్వడం మరో ప్రత్యేకత. ఆలయానికి దాదాపు అర కి.మీ దూరంలోని లోయలోని మంచినీళ్ల బావి నుంచి జలాన్ని తీసుకొచ్చే నిత్యం ఉదయం, సాయంత్రం రెండుసార్లు స్వామివారికి అభిషేకం చేయడం మరో ప్రత్యేకత.

# భూసేకరణతో సరి.. పరిశ్రమల ఏర్పాటేదీ?




సిరిసిల్ల : ఎక్కడైనా పరిశ్రమలు స్థాపించాలంటే భూసేకరణ పెద్దసవాలు.. చాలాచోట్ల భూముల లభ్యత లేక ప్రభుత్వాలకు ఇబ్బందులు తప్పడం లేదు. గంభీరావుపేట మండలం నర్మాల, దేశాయిపల్లి గ్రామాల్లో 2019లో పరిశ్రమల ఏర్పాటుకు 410 ఎకరాలు సేకరించారు. ఆహారశుద్ధిలో భాగంగా భారీ పరిశ్రమలు. 150 ఎకరాల్లో ఎంఎస్ఎంఈలో వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉపయోగపడేలా ప్లాట్లు చేశారు. పరిశ్రమలు నెలకొల్పితే.. జిల్లాలో పంటల సాగులో వైవిధ్యం నెలకొంటుంది. సాగులో నూతన ఒరవడి ప్రారంభమవుతుందని అందరూ భావించారు. పరిసర గ్రామాల్లోని యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని భావించారు. కాగా ఆరేళ్లలో ఒక్క పరిశ్రమ మాత్రమే ఏర్పాటైంది. మరో రెండు పరిశ్రమలు భూ కేటాయింపులకే పరిమితమయ్యాయి. ప్రారంభించిన ఒక్క ఆహారశుద్ధి పరిశ్రమలో దానికి తగిన విద్యార్హతలు.. నైపుణ్యాలు లేవంటూ యువతకు ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

**ప్రభుత్వం దృష్టి సారిస్తేనే..**

నర్మాల, దేశాయిపల్లి గ్రామాల్లో వ్యవసాయ భూమి తక్కువ. పరిశ్రమలతోనైనా ఉపాధి లభిస్తుందని స్థానికులు ఉన్న కాస్తభూమిని ప్రభుత్వానికి అప్పగించారు. వారు పరిహారం అందజేసి చేతులు దులుపుకొన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇక్కడి పరిశ్రమల ఊసే లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో మూడు పరిశ్రమలు ఎంవోయూ చేసుకుంటే ఇక్కడి మాత్రమే నిర్మాణం పూర్తిచేసింది. మరికొన్ని పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వంతో ఒప్పందదశలోనే ఉండిపోయాయి. ప్రభుత్వం మారడంతో రూ.10కోట్లతో టీజీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన మినహా పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియ అటకెక్కింది.

**ఊసేలేని నైపుణ్య శిక్షణకేంద్రం**

జిల్లాలో ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోంది. ఆయా రంగాలకు అవసరమైన నిపుణులు అవసరం. గతంలో జిల్లా యువతకు ఇక్కడ విస్తరించబోయే వివిధ రకాల పరిశ్రమల్లో పనిచేసేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పరిశ్రమల స్థాపన జరగకపోగా నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు ఊసేలేకుండా పోయింది.

**ఆరేళ్లలో ఒక్కటే ప్రారంభమైంది**

ఇదివరకు మా తాత చిన్నతనంలోనే ఎగువమానేరు జలాశయంలో భూములు కోల్పోయాము. ఉన్న కొద్ది భూమిలోనే వ్యవసాయం చేసుకుంటున్నాం. పరిశ్రమలు ఏర్పాటైతే ఉద్యోగ అవకాశాల్లో గ్రామస్థులకే తొలి ప్రాధాన్యమని చెప్పారు. ఆరేళ్లుగా ఒక్క పరిశ్రమనే ఏర్పాటు చేశారు. పరిశ్రమల రాకకోసం చాలా మంది యువకులు ఎదురుచూస్తున్నారు. ఎడబోయిన రాజు, నర్మాల

**పదిగుంటలు వచ్చే పరిస్థితిలేదు**

ప్రభుత్వం సేకరించిన భూములకు ఎకరానికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పరిహారం చెల్లించింది. పక్కగ్రామాల్లో భూములు కొందామంటే ఈ డబ్బులతో పది గుంటలు కూడా వచ్చే పరిస్థితిలేదు. ఇప్పటికే చాలా మంది వీటిని సొంత ఖర్చులకు వాడుకున్నారు. గ్రామంలో సాగుభూమి తగ్గింది. పనులకోసం పక్కగ్రామాలకు వెళుతున్నారు. గొర్రె దేవరాజు, నర్మాల

# మాధ్యమాలపై.. పోలీస్ నిఘా..!

నాంపల్లి : గతంలో చేతి గడియారం ధరిస్తే గంభీరంగా ఉండేది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఆభరణంగా మారింది. ఆదే సమయంలో సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగింది. వాస్తవం తెలుసుకోకుండా ఇష్టారీతిన పోస్టులు పెడుతుండటంతో విభేదాలు ఏర్పడి గొడవలు జరుగుతున్నాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల పోస్టుల కారణంగా పల్లెల్లో శాంతి భద్రతల సమస్య ఏర్పడే అవకాశం ఉంది. దీనిపై నిర్ధారణకు వచ్చిన పోలీసులు కట్టడికి కార్యాచరణ రూపొందించారు. గ్రామాల్లో నిఘా నిమిత్తం 'వాట్సాప్' తదితర సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో సాధారణ వ్యక్తుల మాదిరి నమోదవుతున్నారు.

**తప్పుడు పోస్టులపై చర్యలు..**

అసత్యాల ప్రచారం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టే వారికి పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇటీవల నల్గొండ జిల్లాలోని ఓ కేంద్రం నుంచి పదో తరగతి ప్రశ్నపత్రం బయటికి వచ్చిన కేసులో పలువురిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేసిన విషయం విధితమే. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో జరగని ఘటనలు జరిగినట్టుగా పోస్టులు పెడుతున్న వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. తీరు మారకపోతే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

**'వీపీవో'ల నియామకాలు..**

క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఘటనలు తెలుసుకోవడం, ప్రజలతో మమేకమయ్యే ఉద్దేశంతో జిల్లా పోలీస్ బాస్ వీపీవో (విలేజ్ పోలీస్



ఆఫీసర్) వ్యవస్థను పునరుద్ధ రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని గ్రామాల్లో వీపీవోల నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వీరికి నేరాల నియంత్రణతో పాటు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట వేసే బాధ్యతనూ అప్పగిస్తున్నారు. దీనికి తోడు సైబర్ నేరాలపై గ్రామీణులకు అవగాహన కల్పించే బాధ్యతనూ అప్పగించింది. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

# కుంటాలలో.. కుంటుపడిన అభివృద్ధి

ఇచ్చోడ : జిల్లాలోని కుంటాల జలపాతం రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందింది. చుట్టూ అడవి అందాల నడుమ జాలువారే జలపాత దృశ్యాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయి. కానీ ఇక్కడ పర్యాటకులకు సరైన వసతులు లేవు. సమస్యలు పరిష్కరిస్తే మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుంది.

నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతానికి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి పర్యాటకులు వస్తారు. మహాభారత కాలంలో కుంతిదేవి అరణ్యమార్గంలో విహారయాత్రకు వచ్చిన క్రమంలో ఇక్కడే కొద్దిరోజులు గడిపిందని, ఆ క్రమంలో ఇక్కడ శివలింగంను ఏర్పాటు చేసి పూజలు చేసినట్లు ఇక్కడి ప్రజలు కథలుగా చెప్పుకొంటారు. ఈ క్రమంలో ఈ జలపాతంపేరు కుంతాల నుంచి కుంటాలగా మారిందంటారు.

**ఇవి చేస్తే మరింత ఆదాయం**

దశాబ్దాలుగా ఇక్కడి అభివృద్ధికి నిధుల కేటాయింపు కోసం ప్రతిపాదనలు పంపిస్తుండగా కాగితాలకే పరిమితమైపోతున్నాయి. జలపాతాన్ని దగ్గరి నుంచి వీక్షించేందుకు తీగల వంతెన ఏర్పాటుతో పాటు జలపాతం కింది భాగంలో ఆనకట్ట ఏర్పాటు చేసి బోట్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాలను కోరినా నేటికీ ఆ దిశగా అడుగులు పడటం



లేదు. వీటి నిర్మాణం పూర్తయితే పర్యాటకుల తాకిడి పెరగడంతోపాటు జిల్లాకు ఆదాయ వనరు పెరిగే అవకాశం ఉంది. గతంలో పలు సినిమా షూటింగ్‌లు సైతం ఇక్కడ జరిగాయి.

**సమస్యలు ఇవి..**

రెండేళ్ల క్రితం గుడారాలను ఏర్పాటు చేసినా ఆశించిన ప్రయోజనం చేకూరలేదు. గతేడాది రూ.3.81 కోట్లతో రిసార్ట్ మంజూరైంది. ప్రస్తుతం పనులు కొనసాగుతుండగా ఈ ఏడాది వినియోగంలోకి తీసుకువస్తే పర్యాటకులకు ఇబ్బందులు తీరే అవకాశం ఉంది.

ఇక్కడికి వచ్చేవారు జలపాతం అందాలను వీక్షించేందుకు దాదాపు 400 మెట్లు కిందకి దిగి వెళ్లాలి. కింది భాగంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, వస్త్రాలను మార్చుకునేందుకు గదులను ఏర్పాటు చేయాలి. తాగు నీటి సౌకర్యం కల్పించాలి.

మెట్ల మార్గంలో వెళ్లే క్రమంలో వర్షం కురిస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంకేతాలు అందకపోవడంతో ఎలాంటి సమాచారం బయటకు అందే పరిస్థితి లేదు. పైన ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు సైతం అధ్వానంగా ఉండగా వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి.

# రూ. 7కోట్ల వ్యయం.. నిర్వహణ అధ్వానం

మంచిర్యాల : మంచిర్యాల పట్టణంలో రెండేళ్ల కిందట అప్పటి మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సుందరీకరణ పేరుతో ఏర్పాటు చేసిన పార్కుల నిర్వహణ లేక ఆ నిధులు మట్టిపాలయ్యాయి. ప్రజలకు ప్రయోజనం కలిగించే అభివృద్ధి పనులు చేయకుండా కమీషన్లకు కక్కుర్తిపడి సుందరీకరణ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వినవస్తున్నాయి. పాతమంచిర్యాల, హైటెక్‌సిటీ, రాంనగర్, రెడ్డికాలనీలో పార్కులు నిర్మించి అందులో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని చోట్ల ఓపెన్ జిమ్‌లు నిర్మించారు. ఆ పార్కుల్లో పూల మొక్కలు, ఆకర్షణీయమైన మొక్కలు పెంచకపోవడంతో అందులో గడ్డి ఏపుగా పెరిగి సందర్శకులకు ఆహ్లాదం అందకుండా పోయింది. రాముని చెరువు కట్టపై సుందరీకరణ, రాజీవ్‌నగర్, గర్మిళ్లలో చేపట్టిన పార్కులు నిర్మాణం మధ్యలోనే ఆపేశారు. జిల్లా కేంద్రంలో అప్పుడు రూ.7 కోట్ల వ్యయంతో ఏడు పార్కులు నిర్మాణం చేపట్టినా అందులో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తేవాలని నగరవాసులు కోరుతున్నారు.

మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో రెండేళ్ల కిందట పార్కు ఏర్పాటు చేశారు. అక్కడి మున్సిపల్ లేఔట్ స్థలంలో రూ.60 లక్షలతో వాకింగ్



ట్రాక్, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. పూల మొక్కలు కూడా నాటలేదు. వాచ్‌మెన్ గదికి, చుట్టూ గోడకు మరమ్మతులు చేసి రంగులు వేశారు. ఆ పార్కు నిర్వహణపై నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అందులో గడ్డి పెరిగింది.

పాతమంచిర్యాలలోని మున్సిపల్ లేఔట్ స్థలంలో రెండేళ్ల కిందట రూ.90 లక్షలతో పార్కు నిర్మించారు. అందులో టైల్స్‌తో వాకింగ్ ట్రాక్‌లు, ఓ వాచ్‌మెన్ గది నిర్మించారు. పూల మొక్కలు కూడా నాటలేదు. గతంలో పెద్ద చెట్లు పెంచారు. వాటి ఆకులు ఎండి వాకింగ్ ట్రాక్‌పై పడి అపరిశుభ్రంగా ఉన్నా శుభ్రం చేయడం లేదు. నగరపాలక సంస్థ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అందులో అన్ని పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. నడకమార్గంలో టైల్స్ అక్కడక్కడ కుంగిపోయాయి. అందులో మరో రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. వాటి పరికరాలు కొన్ని ఊడిపోయినా అధికారులు మరమ్మతులు చేయించడం లేదు.

చురకలు



# లీకేజీల పరంపర

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి పైపులైన్లు తరచూ పగిలిపోవడం.. వాటి నాణ్యతను ప్రశ్నిస్తున్నాయి. లీకేజీలు ఏర్పడుతున్నాయనే ఫిర్యాదులు ఇటీవల అధికమయ్యాయి. దీని కారణంగా వచ్చిన నీరు మురికి రావడంతోపాటు కొందరికీ సరఫరా కావడంలేదు. నీరు రాక ఇబ్బంది పడుతున్నారు. వీటికి మరమ్మతు చేస్తున్నా.. కొత్తగా వేసిన పైపులైన్లు కూడా పగిలిపోవడంతో నాణ్యతపై అనుమానాలు వస్తున్నాయి.

నగరంలోని కమాన్ చౌరస్తా నుంచి మారుతీనగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ తీగల వంతెన వరకు రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో తారు రోడ్డుతోపాటు మురుగుకాలువ, తాగునీటి పైపులైను వేసి పనులు పూర్తి చేశారు. ఇందులో సుమారు రూ.కోటి వెచ్చించి రహదారికి రెండు వైపులా సుమారు 400 మీటర్ల పొడవునా హెచ్‌డీపీఈ పైపులైను వేసి కనెక్షన్లు ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉండగా కొన్ని రోజుల నుంచే లీకేజీలు మొదలయ్యాయి. ఒకటెండ్రు కాదు..పలు చోట్ల ఇలాగే ఉండగా మరమ్మతులు చేయడం మాత్రం సమస్యగా మారింది. మరమ్మతులకు తవ్వితే రోడ్లు పాడవుతున్నాయి.



**నిర్లక్ష్యం.. ఆపై పట్టింపు కరవు..**

కొత్తగా పైపులైను వేసిన వారే రెండేళ్లపాటు నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇష్టానుసారంగా పనులు చేసి పట్టనట్లుగా ఉంటుండటంతో లీకేజీలు నెలల తరబడి అలాగే ఉంటున్నాయి. నిర్ణీత గడువులోగా ఎక్కడ లీకేజీ అయినా సరే వెంటనే సరి చేయాల్సి ఉండగా, ఆ వైపు తొంగి చూడకుండా దాటేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదులు రావడం, ఉన్నతాధికారుల ఒత్తిడితో గత్యంతరం లేక అత్యవసర పరిస్థితిలో నగర పాలక ఇంజినీరింగ్ అధికారులే ఆ లీకేజీలకు మరమ్మతులు చేయిస్తున్నారు.

**మరమ్మతులు చేయిస్తాం**

తాగునీటి పైపులైను పగిలిన విషయం మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో సంబంధిత సిబ్బంది వెళ్లి పరిశీలిస్తారు. వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

**పరీక్షలు చేసినట్టేనా?**

కొత్తగా పైపులైను వేసే ముందు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పైపుల కంపెనీ లేదంటే ఏజెన్సీ దగ్గరికి వెళ్లి నాణ్యత పరీక్షలు చేస్తారు. నగరపాలక పరిధిలో వేసే పైపులన్నింటికి ఇలాగే ముందస్తుగా కంపెనీ దగ్గరే పరిశీలించి నిర్ధారిస్తారు.

ప్రధానంగా దాని మందం, నీటి ఒత్తిడి ఏవిధంగా తట్టుకుంటుందనే వివరాలను కంపెనీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో వివరిస్తారు.

నిబంధనల ప్రకారం వ్యవహరిస్తే తప్ప పైపుల ఎంపిక జరగదు. ఏదైతే టెండర్‌లో పొందుపర్చారో ఆ పైపులను వేయాల్సి ఉంటుంది. కమాన్ నుంచి తీగల వంతెన వైపు వేసిన పైపులైను మాత్రం పరీక్షలు చేయకుండా వేసినట్లుగా ఉందని అంటున్నారు.

లీకేజీ కాకుండా పైపులైను పొడవుగా పగుళ్లుతుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# కోతలు సరే.. కొనే వారేరీ..?

తుంగతుర్తి : యాసంగి(రబీ)లో రైతులు సాగు చేసిన వరి పొలాలు కోతకొచ్చాయి. కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్లలో కొనుగోలు కేంద్రాల్లో పోసి ఆరబెడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మిల్లులను నిర్ణయించాల్సి ఉంది. ఎండలు విపరీతంగా కాస్తుడటంతో ధాన్యం రెండు, మూడు రోజుల్లోనే పూర్తిగా ఆరిపోతుంది. వెంటవెంటనే కాంటా వేసి లారీల్లో మిల్లులకు తరలిస్తే రైతులకు ఇబ్బంది ఉండదు. ఒకవేళ అకాల వర్షాలు కురిస్తే ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీటిపాలవుతుందని రైతన్నలు వాపోతున్నారు.

జిల్లాలో రబీ సీజన్‌లో సుమారు 1.5 లక్షల ఎకరాల్లో.. బావులు, బోర్లతోపాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు విడుదల కావటంతో ఆయకట్టు కింద వరి సాగు చేశారు. ఆశించిన మేర భూగర్భ జలం, వారబందీ విధానంతో పొలాలకు సరిపడా నీరందకపోవటంతో సుమారు 30శాతం వరకు పొలాలు ఎండిపోయాయి. మిగతా పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం జిల్లాలో సుమారు 286 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమైంది. త్వరలో వాటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**రెండురోజుల్లో అన్ని ప్రారంభిస్తాం..** -రాజేశ్వర్, డీఎస్వో, సూర్యాపేట జిల్లాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి 286



కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో కొన్నింటిని ఇప్పటికే ప్రారంభించాం. మిగతా వాటిని రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. అక్కడ రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు ఆదేశించాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

**కేంద్రాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలి..** -వీరబోయిన పద్మ, రైతు, తుంగతుర్తి

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి. ఇప్పటికే వరి కోసి ధాన్యాన్ని కేంద్రాల్లో పోసి ఆరబెట్టాం. ఎండలు కొడుతుండటంతో కేంద్రాల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

# మహాదారి.. ఎలా సాగాలి?.. కొలిక్కిరాని శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ



హైదరాబాద్: నగరం నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాలకు రవాణా సాఫీగా సాగేందుకు సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఔటర్‌రింగ్ రోడ్డు వరకు నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్‌కు భూగ్రహణం వీడటం లేదు. ఇప్పటికే ప్రైవేటు ఆస్తుల సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. రక్షణశాఖ భూముల బదలాయింపునకు కేంద్రం నుంచి సానుకూలత వచ్చినప్పటికీ... అప్పగింత విషయంలో ఆలస్యమవుతోంది. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో ఈ ప్రక్రియలు పూర్తయితేనే టెండర్లు పిలిచేందుకు హెచ్ఎండీఏకు అవకాశం ఉంటుంది. ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం వరకు 5.4 కిలోమీటర్ల కారిడార్‌తోపాటు, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట అవుటర్ రింగ్ రోడ్డు ఇంటర్‌ఛేంజ్ వరకు 18.10 కిలోమీటర్ల మరో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించేందుకు ఏడాది క్రితమే శంకుస్థాపన చేశారు. శామీర్‌పేట కారిడార్ ప్రాజెక్టుకు మొత్తం 197 ఎకరాల భూమి సేకరణకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో 113.48 ఎకరాలు రక్షణశాఖ నుంచి సేకరించాల్సి ఉంది. ఆ శాఖ నుంచి తీసుకునే భూమికి బదులు..అంతే విలువైన భూమిని మరోచోట ప్రభుత్వం కేటాయించాల్సి ఉంటుంది. ఇప్పటికే హెచ్ఎండీఏ పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను రక్షణశాఖకు నివేదించింది. ఈ ప్రక్రియలో ఆలస్యంతె మిగతా పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. రక్షణ శాఖ భూముల్లో ఒకచోట 5 లక్షల గ్యాలన్ల, మరోచోట 2.5 లక్షల గ్యాలన్ల తాగునీటి సరఫరా రిజర్వాయర్లు ఉన్నాయి. ఇవే కాకుండా ఆ శాఖకు చెందిన కొన్ని భవనాలను తొలగించాలి. బదులుగా వేరేచోట స్థలం కేటాయించి అక్కడ రిజర్వాయర్లు, భవనాలు నిర్మించి అప్పగించాలి. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయితేనే ఆ శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. ఇందుకు మరి కొంత సమయం పట్టనుందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులతోపాటు భూ సేకరణ కలిపి మొత్తం రూ.3619 కోట్లు వెచ్చించనున్నారు.

**టెండర్లు ఎవరికో?**

మరోవైపు ప్యారడైజ్ నుంచి డైయిరీఫాం వరకు 5.4 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌కు ఇప్పటికే హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఇ-ప్రొక్యూర్ విధానంలో పిలిచింది. ఈ నెల 15న వాటిని తెరవనున్నారు. తొలుత సాంకేతిక బిడ్లు పరిశీలించి అర్హత సాధించిన సంస్థల ప్రైస్ బిడ్‌లను తర్వాత తెరుస్తారు. తక్కువకు కోట్ చేసిన సంస్థ ఎల్1గా నిలిచి పనులు దక్కించుకోనుంది. ప్యారడైజ్ నుంచి సికింద్రాబాద్, తాడ్‌బండ్, బోయిన్‌పల్లి మీదుగా డెయిరీఫాం వరకు ఈ కారిడార్ అందుబాటులోకి వస్తుంది. ప్రాజెక్టు కోసం రూ.652 కోట్లు, భూసేకరణతో కలిపి మొత్తం రూ.1550 కోట్లు ఖర్చు చేస్తారు. అందుబాటులోకి వస్తే...44వ జాతీయ రహదారిలో మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ వైపు వాహనాల రాకపోకలు ఎంతో సులువు కానున్నాయి.

# మంజీరా.. లీకేజీలే నిలువెల్లా



హైదరాబాద్: హైదరాబాద్ మహానగరానికి తాగునీటిని అందించే కీలక మంజీరా పైపులైన్ తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కీలకమైన ప్రాంతాలకు 45 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్న ఈ పైపులైను వ్యవస్థ ఆరు దశాబ్దాల క్రితం నాటిది కావడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. నెలలో కనీసం రెండు మూడుసార్లు మంజీరా పైపులైన్‌లకు జలమండలి మరమ్మతులు చేయాల్సి వస్తోంది. దీంతో ప్రతి సారీ వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరాపై రెండు మూడు రోజులు ప్రభావం ఉంటోంది. నగరానికి సంగారెడ్డి సమీపంలోని మంజీరా డ్యాం నుంచి నీటిని సరఫరా చేసేందుకు 1965లో 1500 ఎంఎం డయా సామర్థ్యంతో పైపులైన్ ఏర్పాటు చేశారు. పాతది కావడంతో అనేక ప్రాంతాల్లో దెబ్బతిని ఒక మోస్తరు నీటి సరఫరాలో పీడనం ఎక్కువైనా లీకేజీలు ఏర్పడటం సహజంగా మారింది. జనవరి నుంచి ఏప్రిల్ మొదటివారం వరకు ఐదుసార్లకుపైగా లీకేజీలు, పైపులైన్ పగలడంతో నీటి సరఫరాను నిలిపివేయాల్సి వచ్చింది. ఇక జాయింట్ లీకేజీలు అతి సాధారణంగా మారాయి. పనులు పూర్తయ్యాక సరఫరాకు సమయం: మంజీరా పైపులైన్‌కు మరమ్మతులు ఏర్పడితే ప్రధానంగా నగరంలోని 6,9,15,17,22,24 డివిజన్లలో అనేక ప్రాంతాల్లో నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బీరంగూడ, అమీన్‌పూర్, మియాపూర్, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, మూసాపేట, ఎర్రగడ్డ, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రభావం ఉంటోంది. ఇక నీటి సరఫరాకు మరమ్మతులు పూర్తయ్యాక మూడు నాలుగు రోజులు సమయం తీసుకుంటుందని జలమండలి అధికారులు చెబుతున్నారు. ట్యాంకర్ల సరఫరాలోనూ తీవ్ర ఇబ్బందులుంటున్నాయని, భారీగా పెండింగ్ ఏర్పడటంతో పూర్తి చేయడానికి కనీసం రెండు రోజులు సమయం తీసుకుంటుందని తెలిపారు. అవకాశం ఉన్న మేరకు నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయకుండానే పరిమాణాన్ని తగ్గించి చేస్తున్నామన్నారు.

**రూ.600 కోట్లతో కొత్త పైపులైన్ ప్రతిపాదనలు**

మంజీరా పాత పైపులైన్ స్థానంలో కొత్తది ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. జనవరి మొదటివారంలో జరిగిన జలమండలి బోర్డు సమావేశంలో మంజీరా పైపులైన్ లీకేజీలు, మరమ్మతులు, ఇతర సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా ఆయన పైమేరకు ఆదేశించారు. దీంతో పాత లైను వెంబడి సమాంతరంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా జలమండలి ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం చేసింది. దీనికి రూ.600 కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

# బిల్లులు రావు.. నాణ్యత కరవు!



కరీంనగర్ : బయట హోటల్లో ప్లేట్ ఇడ్లీ ధర రూ.40. అదే జిల్లాసుపత్రుల్లో రోగులకు అందించే అల్పాహారం, రెండు పూటల భోజనానికి చెల్లించే ధర మాత్రం రూ.72.. దీంతో గుత్తేదారులు అరకొరగా మెనూ అమలు చేస్తున్నారు.. రోగులు అయిష్టంగానే తింటున్నారు. ఉమ్మడి కరీంనగర్‌లోని నాలుగు జిల్లా ఆసుపత్రుల తోపాటు ప్రాంతీయాసుపత్రుల్లో నిత్యం 1,650 మంది ఇన్ పేషెంట్లకు మూడుపూటలా అందించే భోజనంలో పూర్తిస్థాయి పోషకాలు ఉండటం లేదు.

**సకాలంలో చెల్లింపులు లేవు**

ప్రస్తుతం గుత్తేదారులకు 6 నెలల నుంచి 20 నెలల వరకు పెట్టిన భోజనానికి సంబంధించిన బిల్లులు రావాల్సి ఉంది. సకాలంలో చెల్లింపులు లేకపోవడంతో ఆస్పత్రి వర్గాలు కూడా పర్యవేక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించడం లేదు. దీంతో గుత్తేదారులు పెట్టిందే మెనూగా మారిపోయింది. అసలే అనారోగ్యంగా ఉన్నవారికి దొడ్డు బియ్యం అన్నం పెట్టడంతో తినలేకపోతున్నారు. ఆస్పత్రుల్లో స్వచ్ఛంద సంస్థలు పెడుతున్న ఉచిత భోజనం బాగుంటోందని రోగుల సహాయకులు వాపోతున్నారు. కరీంనగర్ జనరల్ ఆసుపత్రికి సంబంధించి ఆరు నెలల నుంచి బిల్లులు రావాల్సి ఉంది. ఇక్కడ ఎంసీహెచ్, ఆసుపత్రి కలిపి రోజుకు సగటున 270 మందికి భోజనం అందిస్తున్నారు. జగిత్యాల, సిరిసిల్ల ఆస్పత్రుల్లోనూ గుత్తేదారులు బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు. గోదావరిఖని ఆసుపత్రి గుత్తేదారుకు 20 నెలల నుంచి నెలకు రూ.3.5 లక్షల చొప్పున బిల్లు రావాల్సి ఉంది.

**గిట్టుబాటు కాక..**

ఉదయం అల్పాహారంలో ఇడ్లీ, ఉప్మా, పాలు, బ్రెడ్డు, కిచిడీని నిర్ణీత రోజు వారీగా అందించాలి. కచ్చితంగా మధ్యాహ్న భోజనంలో గుడ్డుతోపాటు అరటిపండు ఉండాలి. అన్నంతోపాటు పప్పు, ఆకుకూర, సాంబారు, పెరుగు లేదా మజ్జిగ ఇవ్వాలి. ఇక డయాలసిస్ రోగులకు రెండు చపాతీలు అందించాలి. కానీ దొడ్డు బియ్యంతో కూడిన ముద్దన్నం రోగులకు దిక్కవుతోంది. పప్పు, ఆకుకూరలు సరిగా అందించడం లేదని రోగులు వాపోతున్నారు. సాంబారు కూడా ఒక్కోసారి నీళ్లచారు తరహాలో ఉంటుందని పేర్కొంటున్నారు. రోజుకు ఒక రోగికి ఇచ్చే రూ.72 గిట్టుబాటు కాకపోవడం వల్లనే ఈ సమస్యని గుత్తేదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ధరలు పెంచాలని కోరుతున్నారు. ఆస్పత్రి అధికారులు పక్కాగా పర్యవేక్షణ చేస్తేనే మెనూ అమలయ్యే అవకాశం ఉంది.

# జీవి.. జరభద్రం..!

నల్గొండ : ఎండాకాలం పశువులకు గడ్డు కాలం.. ఈ సీజన్‌లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న తరుణంలో పాడి పశువులను, జీవాలను, కోళ్లను, పెంపుడు కుక్కలను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. మనుషుల మాదిరిగా జంతువులకూ వడదెబ్బ తగులుతుందని నల్గొండ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జీవీ.రమేష్ తెలిపారు.

**వడదెబ్బ లక్షణాలు ఇలా..**

జ్వరం-శరీర ఉష్ణోగ్రత 103-108 సెల్సియస్‌కు చేరుతుంది. విపరీతమైన చెమట, ఆయాసం అధికం అవుతుంది. ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. శ్వాస క్రియ, పల్స్ అధికం అవుతుంది. అపస్మారక స్థితి చేరుకుంటుంది. బీ మేత తినక పోవడం, సొల్లు కార్చడం, అధిక దాహం, నీరసించి పోవడం, చర్మం పొడిబారడం, పశువులు నీడను కోరుకోవడం తదితరం కనిపిస్తాయి. పాల ఉత్పత్తి, పునరుత్పాదక శక్తి తగ్గుతుంది.



**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే మేపాలి. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వదలొద్దు. పశువులను, జీవాలను చెట్ల నీడన కాని, కొట్టాల్లో కట్టి వేయాలి. కొట్టం పైన గడ్డి పరిచి అప్పుడప్పుడు నీటితో చల్లాలి. వడగాలులు కొట్టంలోకి రాకుండా చూడాలి.

**ఎక్కువ ప్రభావితం అయ్యే జంతువులు**

దేశ గో జాతులు వేడిని తట్టుకునే శక్తిని కలిగి ఉంటాయి.

సంకర, విదేశీ జాతులైన హెచ్, ఏఫ్. జెర్సీ ఆవులు సున్నితంగా ఉంటాయి.గేదెలో వేడి ప్రభావం ఎక్కువ.

కుక్కలు, కోళ్లు వేడిని నోటి ద్వారా బయటకు వదులుతాయి.

చికిత్సవడదెబ్బ తగిలిన పశువులను వెంటనే నీడకి తరలించాలి. పశువును నీటితో తడపడం, గుడ్డతో తుడవడం లేదా తడిసిన గోనె సంచిని శరీరంపై కప్పాలి. చల్లని నీటిని తాగించాలి. ఆ నీటిలో ఓఆర్ఎస్ పౌడర్, గ్లూకోజ్ పౌడర్ లేదా చెక్కరతో పాటు ఉప్పు కలపాలి. జ్వరానికి అంటీపైరేటిక్స్ మందులు ఇవ్వాలి. చికిత్స అనంతరం 24 గంటలు శుభ్రమైన చల్లని తాగు నీరు అందేలా చూడాలి.

# ఏ మార్పులొచ్చినా.. ఎదురుచూపులే..!

సూర్యాపేట : ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన జి.కృష్ణ రెండు నెలల క్రితం సదరం శిబిరానికి హాజరయ్యేందుకు స్లాట్ నమోదు చేసుకున్నాడు. శిబిరానికి వెళ్లేందుకు చరవాణికి సంక్షిప్త సమాచారం వస్తుందని మీసేవ నిర్వాహకులు తెలిపారు. కానీ ఎలాంటి సమాచారం రాకపోవటంతో తిరిగి వారిని ఆశ్రయించారు. యూడీఐడీ ద్వారా స్లాట్ చేసుకోవాలని సూచించగా.. అదే నెలలో దరఖాస్తు చేసుకున్నాడు. ఏప్రిల్ నెలకు సంబంధించి శిబిరాల తేదీలు ఖరారయ్యాయి. కానీ ఈ శిబిరాల్లోనూ ఆయనకు ఎలాంటి సమాచారం రాలేదు.

సదరం ధ్రువపత్రం పొందేందుకు దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. వీరి ఇబ్బందులు పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆధార్ తరహాలో యూడీఐడీ కార్డు విధానాన్ని రూపొందించింది. దీని ద్వారా సులువుగా స్లాట్ నమోదై వెంటనే శిబిరానికి హాజరయ్యే అవకాశముంటుందని, ఈ కార్డుతో 21 రకాల సేవలు సులువుగా పొందే అవకాశముంటుందని వెల్లడించారు. ఈ కార్డు కోసం ఇప్పటికే దరఖాస్తులు సైతం చేసుకున్నారు. కానీ ఆదిలోనే హంసపాదం అన్న తరహాలో ఈ విధానం ద్వారా కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీని ద్వారా ధ్రువపత్రం కోసం శిబిరానికి పది మందికి మాత్రమే వైద్యులు పరీక్షలు చేసేలా ఉండటంతో మరింత



అవస్థలు పడాల్సి వస్తోంది.

జిల్లాలో గతంలో, ప్రస్తుతం సదరం ధ్రువపత్రానికి వివిధ వైకల్యమున్న వారు సుమారు 1,525 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. యూడీఐడీ రాకముందే దాదాపు వెయ్యి మంది శిబిరానికి స్లాటు బుక్ చేసుకున్నారు. రెండు నెలలుగా శిబిరానికి.. పది మందిని మాత్రమే వైద్యులు పరీక్షలు చేస్తుండటంతో అత్యవసరమున్న వారు, రెన్యువల్ చేసుకునే వారి పరిస్థితి దయనీయంగా మారింది. అటు రెన్యువల్ కాక పింఛన్ నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సదరం శిబిరాల్లో ఎక్కువ మందికి పరీక్షలు చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.

జిల్లాలో సదరం ధ్రువపత్రానికి యూడీఐడీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఏప్రిల్ నెలకు సంబంధించి తేదీలు విడుదల చేశారు. ఈ నెల 8, 17, 22, 25, 29లలో ముందుగా నమోదు చేసుకుని సంక్షిప్త సమాచారం వచ్చిన వారు హాజరు కావాల్సి ఉంటుంది. కొత్తగా చేసుకున్న వారు వైద్యుల వద్ద చూపించుకున్న రసీదులు, రిపోర్టులు, వాడుతున్న మందులు, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాల్సి ఉంది.

# పెండింగ్ పనులపై ఆశలు!

గోదావరిఖని : రాష్ట్రంలో త్వరలో స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా పుర, నగరపాలికల్లో పాత బిల్లులు చెల్లించి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రామగుండం నగరపాలికలో కొన్నేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక, పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు మధ్యంతర బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదార్లు పనులు నిలిపివేశారు. ఆయా పనుల పూర్తికి ఎన్ని నిధులు అవసరమో ఆయా పుర, నగరపాలికలు గతంలోనే ప్రభుత్వానికి నివేదించినా పనులు జరగలేదు. తాజాగా పుర, నగరపాలికల ఎన్నికల్లోపు పాత బిల్లులు చెల్లించి పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**గుత్తేదారుల అనాసక్తి**

నగరంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించి గుత్తేదారుకు పనులు అప్పగించినప్పటికీ చేసిన పనులకే బిల్లులు రాకపోవడంతో గుత్తేదార్లు మిగతా పనులు చేపట్టడం లేదు. బకాయిల కోసం గుత్తేదార్లు ఏళ్లుగా ప్రాధేయపడుతున్నా ప్రయోజనం లేకపోయింది. ఇటీవల నిర్వహించిన పలు అభివృద్ధి పనుల టెండర్లలో గుత్తేదార్లు పాల్గొనకపోవడం గమనార్హం.



**అన్ని అసంపూర్తిగానే..**

రూ.5 కోట్లతో గోదావరిఖని మల్కాపూర్ శివారులో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్ర నిర్మాణానికి సుమారు ఆరేళ్ల క్రితం నిధులు కేటాయించారు. నాలుగేళ్ల క్రితం పనులు మొదలు కాగా.. మధ్యంతర బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు పనులు మధ్యలోనే ఆపేశారు.

గోదావరిఖని నడిబొడ్డున సీనియర్ సిటిజన్ పార్కు, నగరపాలక పాత భవనాన్ని కూల్చి రూ.8 కోట్లతో సుమారు అయిదేళ్ల క్రితం బహుళ ప్రయోజనకర భవన నిర్మాణం పనులు చేపట్టారు. రూ.2 కోట్ల వరకు పనులు పూర్తి చేసి వదిలేశారు.ఎన్టీఆర్‌నగర్‌లో రూ.4.5 కోట్లతో రెండున్నరేళ్ల క్రితం పనులు చేపట్టినా సమీకృత మార్కెట్ భవనం పునాదులకే పరిమితం అయింది. పిల్లర్ల కోసం వేసిన ఇనుప చువ్వలు తుప్పు పడుతున్నాయి.విఠల్‌నగర్‌లో సుమారు ఏడేళ్ల క్రితం రూ.4 కోట్లతో మొదలుపెట్టిన సమీకృత హోల్‌సేల్, రిటైయిల్ మార్కెట్ భవనాలు, రూ.1 కోటి వ్యయంతో చేపట్టిన సామాజిక భవనం పనులు చివరిదశకు చేరుకున్నాయి.


లక్ష్మీనగర్‌లో సుమారు రెండు దశాబ్దాల క్రితం దాదాపుగా రూ.8 కోట్లతో నిర్మించిన వాణిజ్య భవన సముదాయం నిరుపయోగంగా ఉండగా.. దానిపైన రూ.5 కోట్లతో మరో అంతస్తు నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు.సుమారు రెండు దశాబ్దాల క్రితం హనుమాన్‌నగర్‌లో చేపట్టిన స్వశక్తి భవనం పిల్లర్లకే పరిమితమైంది.

# ఆరుతడి వైపు.. అన్నదాత చూపు

కోనరావుపేట : జిల్లా మెట్టప్రాంతం కావడం.. ఎండల తీవ్రత పెరుగుతుండటంతో సాగునీటి లభ్యత ఈ యాసంగిలో అంతంతమాత్రంగానే ఉంటోంది. వరిసాగుకు నీటి ఎద్దడి సమస్య ఏర్పడుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి ఎండిపోవడంతో జీవాలకు మేతగా మారుతోంది. పూర్తిస్థాయిలో నష్టపోయే ప్రమాదం ఉందని భావించిన పలువురు రైతులు యాసంగిలో మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న సాగుతో శ్రమ, పెట్టుబడి వ్యయం, నీరు, సమయం ఆదా అవుతుందని అన్నదాతలు చెబుతున్నారు. పంట మార్పిడితో భూమిలో పోషక విలువలు పెరిగి వానాకాలంలో సాగు చేసే పంటలకు మేలు జరుగుతుందని చెబుతున్నారు.

జిల్లాలో 1,775 ఎకరాల్లో మొక్కజొన్న సాగు...

జిల్లాలో 2.40 లక్షల ఎకరాల భూమి పంటల సాగుకు అనుకూలంగా ఉంది. యాసంగిలో రైతులు సాధారణ పంట వరి 1.78.350 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 1,775.23 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. సాగుకు ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి అవుతోంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 30కి పైగా అనుబంధ గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో 1,775 ఎకరాల్లో మొక్కజొన్న వేయగా కోనరావుపేట మండలం మంగళ్లపల్లిలోనే ఏకంగా 100కు పైగా



ఎకరాల్లో సాగు చేశారు.

ఆదాయం బాగుంది నాకున్న ఐదు ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నా. కొద్దిపాటి నీటి సౌకర్యం ఉన్న ఎకరం భూమిలో రెండు దశల్లో మొక్కజొన్న సాగుచేశా. మొదటి దశలో శివరాత్రి సమయానికి పంట చేతికి వచ్చింది. సుమారు రూ.60 వేలు సమకూరగా అన్ని ఖర్చులు పోను రూ.40 వేల ఆదాయం సమకూరింది. మరో పదిరోజుల్లో మిగతా పంట చేతికి వస్తుంది. పంట మార్పిడితో మెరుగైన దిగుబడి వస్తుంది.

సాసాల నాగరాజు, రైతు మంగళ్లపల్లి

ఆదర్శంగా మంగళ్లపల్లి

పంటల సాగులో జిల్లాలోనే మంగళ్లపల్లి గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. ఒక్కో రైతు 5 నుంచి 10 ఎకరాల్లో పత్తి, ఎండు మిర్చి, కూరగాయాలు సాగు చేస్తుంటారు. యాసంగిలో మొక్కజొన్న సాగు చేయటంతో మంచి దిగుబడి వస్తుంది. పంట మార్పిడి చేయటంతో భూసారం పెరిగి పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. అన్నదాతలకు మెరుగైన ఆదాయం సమకూరుతుంది.

సందీప్ వ్యవసాయాధికారి కోనరావుపేట

# ఉపాధి కూలీలకు వసతులు కరవు



గంగాధర : జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతుంది. ప్రస్తుతం జిల్లాలో సుమారు 15 వేల మంది పనులకు హాజరవుతున్నారు.

**ఎండదెబ్బతో ముప్పు**

జిల్లాలో ఆయా గ్రామాల్లోని పని ప్రదేశాల్లో వడదెబ్బ తగిలి ఏటా ఆరెడుగురు మృత్యువాత పడుతున్నారు. మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుంది. అప్పుడు కూలీల సంఖ్య ఒక్కసారిగా పెరుగుతోంది. ఉపాధి కూలీలు భోజనం చేయడానికి, అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి ప్రభుత్వం గతంలో గుడారాలు (టెంట్లు)పంపిణీ చేసేది. ఏడేళ్ల నుంచి వాటి పంపిణీ పక్కన పెట్టింది. ఈ సారైనా వాటిని అందిస్తే కూలీలకు ఉపశమనం కలుగుతుంది.

**ఇంటి నుంచే తాగునీరు**

పని ప్రదేశాల్లో తాగునీటి సదుపాయం లేక ఇళ్లనుంచే నీటి డబ్బాలు వెంట తెచ్చుకుంటున్నారు. మరికొందరు తడారిన గొంతులతో తల్లడిల్లుతున్నారు. పని ప్రదేశాల్లో నేల గట్టిగా ఉండటంతో.. భూమిని తడిపేందుకు ట్యాంకర్లతో నీరు పట్టే వెసులుబాటు ఉంటున్నప్పటికి అలా చేయడం లేదు. పదేళ్లుగా పనిముట్లు అందించడం లేదు. దీంతో కూలీలే ఎవరికి వారు పనిముట్లు తెచ్చుకుంటున్నారు.

అందుబాటులో లేని చికిత్స కిట్లు

పనులు చేసే సమయంలో కూలీలకు గాయాలు జరిగిన సందర్భంలో ప్రాథమిక చికిత్స కిట్లు సమకూర్చాలి. కిట్‌లో అయోడిన్, బ్యాండేజి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కొన్ని రకాల మాత్రలు అందుబాటులో ఉంచాలి. ఎనిమిదేళ్లుగా వీటి పంపిణీ నిలిచిపోయింది. ఎండలు తీవ్రమైన వెంటనే గుడారాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో అధికారులు పేర్కొన్నారు.

జిల్లాలో వివరాలు ఇలా..

గ్రామ పంచాయతీలు: 313మొత్తం జాబ్ కార్డులు: 1,24,002 నమోదైన కూలీలు: 2,32,569100 రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాలు: 3268

# పెద్దాసుపత్రిలో ఉక్కపోత



కరీంనగర్ : కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు అత్యవసరంగా చికిత్స అందించడానికి పలు వార్డులతోపాటు ఆపరేషన్ థియేటర్, ఐసీయూల్లో సరిపడా ఏసీలు లేక.. ఉన్నదాంట్లో కొన్ని పనిచేయక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే అవకాశముండటంతో.. వీటిని మరమ్మత్తు చేయడంతోపాటు కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. కాలిన గాయాలతో వచ్చినవారు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఉన్నవి పనిచేయక** ఆసుపత్రిలో 15 పడకల ఐసీయూలు రెండున్నాయి. ఇందులో ఎనిమిది ఏసీలు అవసరముండగా.. 6 మాత్రమే ఏర్పాటు చేశారు. ఇందులోనూ నాలుగు పని చేయడం లేదు. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పాతవి తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. 30 నుంచి 40 శాతానికి పైగా కాలిన గాయాలతో ఆసుపత్రికి వచ్చినవారికి రెండు గదులు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు, శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత ఉంచే వార్డులో ఐదు ఏసీలు అవసరముండగా కేవలం రెండే ఉన్నాయి. ఆపరేషన్ థియేటర్‌లో నాలుగు ఏసీలు అవసరమున్నాయి.

**మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోనూ ఇదే పరిస్థితి**

మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవ గదులు 6 ఉండగా.. అందులో రెండే ఏసీలు పనిచేస్తున్నాయి. ప్రసవం తర్వాత ఉంచే వార్డులో నాలుగు ఏసీలు, అత్యంత క్లిష్ట పరిస్థితులో ఉంచే బాలింతల వార్డులో మరో నాలుగుండాలి. నవజాత శిశువు సంరక్షణ కేంద్రంలో ఉన్నవి సరిగా పనిచేయడం లేదు. హెచ్‌డీయూలో కిటికీలు తీసుకునే పరిస్థితి లేకపోవడంతో ఉక్కపోత నెలకొంది. రక్తనిధి కేంద్రంలో ఒక ఏసీ అవసరముంది.

**ఇబ్బందుల్లేకుండా చూస్తాం**

వేసవికాలం దృష్టిలో ఉంచుకొని రోగులకు ఇబ్బందుల్లేకుండా ఉండడానికి ఏసీల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఆసుపత్రిలోని అత్యవసర వార్డులన్నింటిలో కలిపి 40 ఏసీల వరకు అవసరమున్నాయి. జిల్లా కలెక్టర్‌కు నివేదించగా 30 ఏసీలు మంజూరు చేస్తామన్నారు. ప్రస్తుతానికి చల్లదనం ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం.డా.వీరారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్

# చుక్‌చుక్.. చకచకా

హైదరాబాద్: మెట్రోరైలు రెండో దశలో చేర్చాల్సిన మూడు మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) రూపకల్పన తుది దశకు చేరింది. దీని తయారీకి అవసరమైన భూసామర్థ్య పరీక్షలు, పర్యావరణ మదింపు అధ్యయనం, ట్రాఫిక్ సర్వేలు ఇప్పటికే పూర్తి చేశారు. అవసరమైన సందర్భంలో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నారు.

మెట్రో రెండోదశ మొదటి భాగంలో ఐదు కారిడార్లు ఉన్నాయి. వీటి డీపీఆర్‌లు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రం అనుమతి కోసం ఇప్పటికే పంపించింది. ప్రజల నుంచి డిమాండ్లు రావడంతో రెండోదశ రెండో భాగంలో మరో మూడు మార్గాలను ప్రతిపాదించింది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట (21కి.మీ.), జేబీఎస్ నుంచి మేడ్చల్ (24 కి.మీ.) తోపాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీకి మెట్రోని ప్రతిపాదించింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఓఆర్ఆర్, రావిర్యాల మీదుగా ఫోర్త్‌సిటీకి (40 కి.మీ.) ప్రతిపాదించింది. వీటి డీపీఆర్ ప్రక్రియనే ప్రస్తుతం మెట్రోరైలు అధికారులు రూపొందిస్తున్నారు. కొద్దిరోజుల్లోనే ఈ ప్రక్రియను కొలిక్కి తీసుకొచ్చి ప్రభుత్వానికి నివేదించి.. మార్పులు చేర్పులు ఏమైనా సూచిస్తే వాటిని జోడించి తుది నివేదికను సిద్ధం చేస్తారు. ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు ఈ ప్రక్రియను వేగిరం చేశారు.

**ఉమ్మడి భాగస్వామ్యంతోనేనా..?**

రెండోదశ మొదటి భాగం 76.4 కి.మీ.కు డీపీఆర్ ప్రకారం రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టేలా ప్రతిపాదించారు. కేంద్రం వాటా 18 శాతం, రాష్ట్రం వాటా 30 శాతంగా నిర్ణయించారు. 48 శాతం రుణాలు, 4 శాతం పీపీపీకి అవకాశం ఇవ్వాలని ప్రతిపాదించారు.



రెండో దశ రెండోభాగంలో 85 కి.మీ.కు జేబీఎస్-శామీర్‌పేట, జేబీఎస్-మేడ్చల్ రెండు కారిడార్లు కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతోనే నిర్మించేలా ఆర్థిక ప్రణాళిక ఉండనుంది. ఫోర్త్‌సిటీపై త్వరలోనే స్పష్టత రానుందని అధికారులు అంటున్నారు.

# రూ.కోట్లు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలేసి

సిరిసిల్ల : రాష్ట్రంలోని మరమగ్గాల్లో సింహభాగం సిరిసిల్లలోనే ఉన్నాయి. అందుకే ప్రభుత్వశాఖలకు అవసరమైన వస్త్రోత్పత్తుల ఆర్డర్లు జిల్లా పరిశ్రమకు కేటాయించేందుకు ప్రాధాన్యం ఉంటుంది. ఈ రంగంలో ఎప్పటికప్పుడు కొత్తఉత్పత్తులతోనే మనుగడ సాధ్యం. దీనికోసం టెక్స్‌టైల్‌పార్కులో 2006లో వస్త్రపరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు.. ఈ రంగంలో రాణించాలని ఆసక్తి ఉన్న కొత్తతరానికి శిక్షణనిచ్చేందుకు మరమగ్గాల సేవాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులోనే పరిశ్రమలో ఉపయోగించే నూలు నాణ్యత పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.కోట్లు వెచ్చించగా కేంద్రం ఇప్పుడు వృథాగా మారింది.

**యంత్రాలకు తుప్పు**

జిల్లాలో కార్మికులకు ఉపాధి నైపుణ్యాలు మెరుగుపరిచే ఉద్దేశంతో 2006లో టెక్స్‌టైల్ పార్కులో మరమగ్గాల సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. అయిదేళ్లు ఉపకారవేతనాలతో కూడిన 21 రోజుల శిక్షణ అందించారు. దాని తర్వాత మారుతున్న వస్త్రోత్పత్తులు.. మరమగ్గాల్లో వస్తున్న మార్పులకు తగిన శిక్షణలేకపోవడంతో యువతలో ఆసక్తి తగ్గింది. అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చే వస్త్రోత్పత్తుల ఆర్డర్లకు వినియోగించే నూలు నాణ్యతను పరిశీలించేందుకు రూ.2 కోట్లతో ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. పదిహేనేళ్లుగా సేవాకేంద్రం వినియోగంలేకపోవడంతో మరమగ్గాలు, ప్రయోగశాలలోని పరికరాలు తుప్పు పడుతున్నాయి. ఉన్న ఒక అటెండరు, టెక్నీషియన్ పార్కు పరిపాలన విభాగంలో పనిచేస్తున్నారు.

**వినియోగంలోకి తీసుకువస్తే...**

జిల్లాలో సాధారణ మరమగ్గాలకే డాబీ, జకార్డ్ నుంచి ఎలక్ట్రానిక్ జకార్ట్ అమర్చి అధునిక వస్త్రోత్పత్తులు చేపడుతున్నారు. నూతన ఉత్పత్తులు వచ్చిన ప్రతిసారి కార్మికులకు వృత్తి నైపుణ్యం తప్పనిసరి. ఉత్పత్తిలో మెలకువలు నేర్పించడంతోపాటు వాటిని మార్కెటింగ్ చేసే అవకాశాలపై సూచనల కోసం సేవాకేంద్రాన్ని వినియోగంలోకి తీసు



కొస్తే జిల్లా పరిశ్రమకు మేలు జరుగుతుంది. జిల్లాలోని జేఎన్‌టీయూ హెచ్ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలో టెక్స్‌టైల్ డిప్లొమా కోర్సులు ఉన్నాయి. మరమగ్గాలు, నూలు నాణ్యతా పరీక్షలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తే సేవాకేంద్రం వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ఈ రంగంలో రాణించేందుకు ఆసక్తి పెరుగుతుంది.

**కొత్త ఆర్డర్లకు శిక్షణ అవసరం**

జిల్లాకు ఏకరూప దుస్తులతోపాటు, మహిళా సంఘాలకు పంపిణీ చేసే చీరల ఆర్డర్లు వచ్చాయి. చీరలను డాబీ, జకార్డు పింజర్లు ఉన్న 16 వేల మర మగ్గాలపై ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక చేశారు. వీటికి ట్విస్టింగ్ నూలు వాడతారు. వీటికి జిల్లాలోఉన్న వార్పిన్ యూనిట్లపై ఈ నూలు రాదు. దీనికోసం ప్రత్యేక యంత్రాలు అవసరం. ఇప్పటికే పరిశ్రమలో వార్పిన్ యూనిట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. చీరల ఉత్పత్తికి ప్రభుత్వం నూలు కంపెనీలకు టెండర్లు పిలిచింది. ఒప్పందం జరిగితే కంపెనీలు నూలు సరఫరా చేస్తాయి. ఈ లోపు వార్పర్లకు మరమగ్గాలపై ట్విస్టింగ్ నూలుతో కార్మికులకు శిక్షణఇస్తే ఉత్పత్తిలో జాప్యం జరగదు. గతంలోనూ బతుకమ్మ చీరల ఆర్డర్ల సమయంలో డిజైన్లు మారినపుడు కార్మికులు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులోని నిపుణులను సిరిసిల్లకు రప్పించుకుని మెలకువలు తెలుసుకున్నారు.

# పదేళ్లయినా అసంపూర్తిగానే!

మల్లాపూర్ : వచ్చే రెండేళ్లలో గోదావరి పుష్కరాలు రానున్నాయి. గత పుష్కరాల సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం నిధుల మంజూరులో జాప్యంతో నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. మల్లాపూర్ మండలం వెంకట్రావుపేట గంగా గౌరీశ్వర దేవస్థానం దేవదాయశాఖ పరిధిలో ఉన్నప్పటికీ ఆలయ నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత పుష్కరాల సందర్భంగా గోదావరి నదిలో రెండు చోట్ల స్నానాల కోసం మెట్లు, ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు చేపట్టిన గుత్తేదారుకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు



అర్ధాంతరంగా నిలిపివేశారు. మెట్ల నిర్మాణం పూర్తిచేసిన గుత్తేదారు ఆలయ నిర్మాణ పనులను మాత్రం స్లాబ్ దశలోనే వదిలేశారు.

మల్లాపూర్ మండలం వెంకట్రావుపేట గ్రామంలో గంగా గౌరీశ్వర ఆలయ పునఃనిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. 2015లో గోదావరి పుష్కరాల సమయంలో ప్రభుత్వం రూ.25లక్షల వ్యయంతో ఆలయాన్ని పునఃనిర్మాణానికి చర్యలు చేపట్టింది. అదే సంవత్సరం జూన్ నెలలో గుత్తేదారు పనులు ప్రారంభించారు. దాదాపు రూ.13 లక్షల మేర పనులు పూర్తయ్యాయి. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం నుంచి నిధుల కేటాయింపు జరిగింది. పదేళ్లు గడుస్తున్నా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆలయ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోవడంతో దర్శనానికి వచ్చే భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. భక్తులు అధిక సంఖ్యలో వస్తే గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయడానికి సైతం వీలులేని పరిస్థితి. భక్తులు స్నానాలు చేసే ఘాట్‌లో ప్రమాద హెచ్చరిక బోర్డులు, నీటిలో కొట్టుకుపోకుండా రక్షణ జాలీలను ఏర్పాటు చేయలేదు. నీటిలోకి దిగి ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఆలయ ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. గుడి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి సౌకర్యాలు మెరుగుపరచాలని భక్తులు కోరుతున్నారు.

# ట్రిపుల్ ఐటీ.. ఈ కష్టాలేంటీ!

ఒంగోలు : నిద్ర లేచి ముఖం కడుక్కోవాలన్నా.. కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా నీరు లేదు. ఎప్పుడొస్తాయో తెలియదు.. దీంతో తరగతులకు వెళ్లడం మానేసి నీటి కోసం నిరీక్షించాల్సిన దుస్థితి ఒంగోలు నగరంలోని ట్రిపుల్ఐటీ విద్యార్థులది. తరచూ నీటి సమస్య తలెత్తుతోంది. ప్రతిసారీ పాత మోటార్లకు మరమ్మతులు చేయించి మమ అనిపిస్తున్నారు. సుమారు రూ.5 లక్షలు వెచ్చిస్తే కొత్తవి ఏర్పాటు చేసుకునే వీలున్నా ఆ దిశగా చేపడుతున్న చర్యలు శూన్యం. అదే సమయంలో మరమ్మతులకు రూ. వేలు ఖర్చు పెడుతుండటం గమనార్హం.

**పండగ రోజు స్నానాలే లేవు:** ఒంగోలు నగరంలో రెండు ట్రిపుల్ఐటీ ప్రాంగణాలున్నాయి. రెండూ అద్దె భవనాల్లో సాగుతున్నాయి. వీటిలో ఒకటైన రావ్ అండ్ నాయుడు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మొదటి(1,000), ద్వితీయ(360) సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు ఉంటున్నారు. శ్రీరామనవమి ముందురోజు మోటార్లు పనిచేయలేదు. దీంతో అవసరాలకు నీరు లేక విద్యార్థులు ఇబ్బందులెదుర్కొన్నారు. పండగ రోజు స్నానాలు లేవని, సమస్యను వాట్సప్ గ్రూప్ ద్వారా అధికారులకు తెలిపినా స్పందన లేకపోయిందని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



**ట్యాంకర్లతో అరకొర సరఫరా**

ట్రిపుల్ఐటీకి ఒకటో వేసవి చెరువు వద్ద నుంచి పైపులైను ఉంది. రెండున్నర అంగుళాల సామర్థ్యం గల పైపుల్లో ఒక అంగుళం నీరు మాత్రమే వస్తోంది. పైపు ద్వారా వచ్చిన నీటిని సంపులో నింపి అక్కడ నుంచి మోటారు ద్వారా ఓవర్హెడ్ ట్యాంక్కు ఎక్కిస్తారు. ఇందుకోసం అమర్చిన రెండు మోటార్లు పనిచేయక ఈ సమస్య తలెత్తింది. దీంతో గడిచిన రెండు రోజుల నుంచి ట్రిప్పునకు రూ.800 చెల్లించి ప్రైవేట్ ట్యాంకర్లతో నీరు తెప్పిస్తున్నారు. అవి సరిపోవడం లేదని, తరగతుల నిర్వహణ సమయంలో ట్యాంకరు వస్తే పట్టుకోవడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ట్రిపుల్ఐటీ డైరెక్టర్ భాస్కర్ పటేల్ మాట్లాడుతూ.. విద్యుత్తు హైవోల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోయినట్లు తెలిపారు. నీటి ఇబ్బందులను దృష్టికి తేవడంతో వెంటనే మెకానిక్లను పిలిపించి మరమ్మతు పనులు చేయించా మన్నారు. ఒక మోటారు కొత్తది బిగించామని.. ఆలోపు విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ట్యాంకర్ల ద్వారా నీరు తెప్పించినట్లు వివరించారు.

# పురంలో కాన్పులు తగ్గుముఖం

మార్కాపురం : మార్కాపురం సర్వజన వైద్యశాల పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. వైద్యశాలలో గతంలో నలుగురు స్త్రీల వైద్య నిపుణులుండేవారు. ప్రస్తుతం ఇద్దరే సేవలందిస్తున్నారు. దీంతో కాన్పులు గణనీయంగా తగ్గిపోయాయి. ఒక్కరు ఓపీ చూస్తుంటే మరొకరు శస్త్రచికిత్స కేంద్రంలో ఉంటారు. అన్ని వేళల్లో అందుబాటులో ఉండలేని పరిస్థితి. దీంతో గర్భిణులు ప్రైవేట్ బాట పడుతున్నారు. మరికొందరు ఒంగోలుకు వెళ్తున్నారు.

**నాడు ప్రథమం..:** సాధారణ కాన్పులు, శస్త్రచికిత్స కాన్పులు విషయంలో మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల జిల్లాలోనే ప్రథమంగా




ఉండేది. ఉత్తమ వైద్యసేవలకుగాను వైద్యులు అవార్డులు పొందారు. కాన్పుల కోసం మార్కాపురంతో పాటు సమీపంలోని యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల్లోని గ్రామాలు, నంద్యాల జిల్లా శ్రీశైలం, సున్నిపెంట తదితర ప్రాంతాల నుంచి కూడా వచ్చేవారు. ఇదంతా గతం. జీజీహెచ్గా మార్పు చెందిన అనంతరం ఆ పరిస్థితి మారింది. ఇప్పుడు కాన్పుల సంఖ్య సగానికి సగం తగ్గింది. ఈ విషయమై మార్కాపురం సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ.. వైద్యశాలలో ప్రస్తుతం 22 మంది వైద్యులు, 150 మంది సిబ్బందితో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. వైద్యశాలకు వచ్చే గర్భిణులకు స్థానికంగానే సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అత్యవసరమైతే ఒంగోలుకు రిఫర్ చేస్తున్నామన్నారు.

# బకాయిలిచ్చినా.. జాప్యమెందుకు?

శ్రీకాకుళం : సామాజిక ఆసుపత్రుల్లో భవనాలు శిథిలావస్థకు చేరడంతో అధునాతన వసతులతో కొత్త నిర్మాణాలకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో 8 చోట్ల పనులు ప్రారంభించినా బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు అర్ధాంతరంగా నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వాటిని చెల్లించినా ప్రారంభం కాలేదు. ఆసుపత్రుల్లో భవనాల నిర్మాణాలకు 2022లో నాబార్డు నుంచి రూ.42.89 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. సోంపేట, పొందూరు, ఆమదాలవలస, నరసన్నపేట, కోటబొమ్మాళి, కొత్తూరు, పలాస, బారువ, పాతపట్నం ఆసుపత్రుల్లో అధునాతన వసతులతో నిర్మించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

**వేధిస్తున్న సమస్యలు**

జిల్లాలో ఇప్పటివరకు శిథిల భవనాల్లో ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. మరుగుదొడ్లు, నీటి సదుపాయం లేని దుస్థితి. ఇరుకైన గదుల్లో అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారు. డ్రైనేజీ సమస్యలు వేధిస్తున్నాయి. వందల సంఖ్యలో వచ్చే రోగులు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం రూ.8 కోట్ల వరకు బకాయిలు చెల్లించింది. కొత్త భవనాల నిర్మాణ పనులు చాలావరకు చివరి దశలో ఉన్నాయి. త్వరితగతిన పూర్తి చేస్తే రోగులకు అవస్థలు తప్పుతాయి.

**నోటీసులు జారీ చేశాం..**

బకాయిల కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. పనులు ప్రారంభించాలని గుత్తేదారు సంస్థకు నోటీసులు జారీ చేశాం. జూన్ నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం. సత్య ప్రభాకర్, ఈఈ, ఏపీహెచ్ఎంఐడీసీ

# అనంతపై డ్రోన్ కన్ను



రాయదుర్గం : నేరాలు జరగక ముందే వాటిని పసిగట్టి నివారణకు చర్యలు తీసుకుంటే నేరాల తీవ్రత చాలా వరకు తగ్గుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేరాల కట్టడికి డ్రోన్ల వినియోగానికి మొగ్గు చూపింది. జిల్లాకు మూడు చొప్పున డ్రోన్లను అందజేసింది. వీటి వినియోగం వల్ల నేరాలకు చెక్ పడుతోంది. ముఖ్యంగా బహిరంగ మద్యం తాగడం, గంజాయి, జూదం, వ్యభిచారం వంటివి తగ్గుముఖం పట్టాయి. పలు ప్రైవేటు సంస్థల సాయంతో మరిన్ని డ్రోన్లను సమకూర్చుకుని జిల్లా పోలీసు శాఖ ప్రజల రక్షణకు ముందడుగు వేసింది.

**కంపెనీల సాయం:** ఇప్పటికే పలు కంపెనీలు డ్రోన్లు అందజేశాయి. తాడిపత్రిలోని అర్జాస్ కంపెనీ రూ.18.17 లక్షలతో 10 డ్రోన్లు, జిందాల్ స్టీల్ కంపెనీ రూ.10 లక్షలతో 6, సప్తగిరి క్యాంఫర్ సంస్థ రూ.3.10 లక్షలతో 2 డ్రోన్లను అందించాయి. వాటితోపాటు అల్ట్రాటెక్ సోలార్ లైట్లు, మొబిస్ ఇండియా రూ.33 లక్షలతో 300 సోలార్ ఆధారిత సీసీ కెమెరాలు, అదానీ సంస్థ ఎల్ఈడీ డిస్ప్లే వాహనం సమకూర్చాయి.

**ప్రతి రెండు స్టేషన్లకు ఒకటి:** డ్రోన్ల వినియోగం జిల్లాలో గతేడాది నవంబర్ 24 నుంచి పోలీసు శాఖ అందుబాటులోకి తెచ్చింది. జిల్లా కేంద్రంతోపాటు పలు పట్టణాల్లో ఈ కార్యక్రమం సత్ఫలితాలివ్వడంతో డ్రోన్ల సేవలను విస్తరించడానికి ఉన్నతాధికారులు పూనుకున్నారు. మొత్తం 42 పోలీసు స్టేషన్లు ఉండగా 21 డ్రోన్లు అందుబాటులో ఉన్నాయి. సబ్ డివిజన్ల వారీగా అనంతపురం అర్బన్కు 3, అనంతపురం రూరల్కు 4, కళ్యాణదుర్గం 4, గుంతకల్లుకు 4, తాడిపత్రికి 4, హెడ్క్వార్టర్లో 2 వినియోగిస్తున్నారు. ప్రతి పోలీసు స్టేషను నుంచి ఒకరు చొప్పున ఇప్పటికే డ్రోన్ల ఆపరేటింగ్పై శిక్షణ తీసుకున్నారు.

**నేర ప్రాంతాలపై దృష్టి:** జిల్లా వ్యాప్తంగా స్టేషన్ల వారీగా అసాంఘిక కార్యకలాపాలు, నేర ప్రాంతాలను ఇప్పటికే గుర్తించారు. శిక్షణ పొందిన కానిస్టేబుల్ డ్రోన్ ఎగిరే సమయంలో అగుపించే దృశ్యాలను, వ్యక్తులు, ఆయా స్థావరాలను వీడియో ద్వారా గుర్తించి.. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని అనుమానం వస్తే టాస్క్ బృందానికి పంపుతారు. పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు.

**తక్కువ సమయంలోనే ఫలితాలు:** డ్రోన్లు ఎగుర వేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు బెంబేలెత్తుతున్నారు. ఈ కార్యక్రమంపై పత్రికలు, టీవీల్లో విస్తృతంగా ప్రచారం జరగడంతో ప్రజల్లో చైతన్యం కలుగుతుంది. పలువురు పోలీసులకు ఫోన్లు చేసి తమ ప్రాంతాలపై కూడా డ్రోన్లు ప్రయోగించాలని కోరుతున్నారు. భద్రత విషయంలో పోలీసులకు డ్రోన్లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. జాతరలు, ర్యాలీలు, ఉత్సవాల్లో ఓ చోట కూర్చుని బందోబస్తుకు సూచనలు చేస్తూ చక్కబరుస్తున్నారు. ఇటీవల సంక్రాంతి, శివరాత్రి, ఉగాది, శ్రీరామనవమి, పరుషల్లో డ్రోన్లను ప్రయోగించి రద్దీని క్రమబద్ధీకరించారు.

అందుబాటులో ఉన్న డ్రోన్లు : 21
ప్రయోగించే పోలీసుస్టేషన్లు : 42
ఇప్పటి వరకు నమోదైన కేసులు : 70

# మేమింతే.. అవసరం లేదంతే!



చిత్తూరు : ఒక గ్రానైట్ క్వారీ కార్యకలాపాలు చేపట్టాలంటే రెవెన్యూ, గనులు, కాలుష్య నియంత్రణ శాఖ అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ వంటి అనేక తంతులు ఉంటాయి. దరఖాస్తు ఫీజు, డెడ్రెంట్, సీనరేజీ, పర్మిట్ ఇలా రకరకాల ఫీజులు చెల్లించాలి. అవన్నీ కట్టినా ముందస్తుగా ఎవరు అర్జీ ఇస్తారో.. నిబంధనలు పాటిస్తారో వారికే అనుమతులు వస్తాయి. నెలల తరబడి ఓపికగా కార్యాలయాల చుట్టూ తిరగాలి. ఇవేవీ లేకుండానే నియమాలు పాటించకుండానే చిత్తూరు గ్రామీణ మండలంలో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా రోడ్డు వేసుకుని మరీ పొరుగునే ఉన్న తమిళనాడుకు తరలిస్తున్నారు. అధికార యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటే తప్ప అక్రమార్కులు దారిలోకి వచ్చేలా లేరు. చిత్తూరు గ్రామీణ మండలం తుమ్మింద రెవెన్యూ మర్రిగుంటలో దాదాపు రెండు ఎకరాల్లో అక్రమంగా గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నేత కావడంతో అటువైపు వెళ్లేందుకు ఎవరూ సాహసం చేయడం లేదు. పచ్చటి పొలాల మధ్య దారి ఏర్పాటు చేసుకున్నా అభ్యంతరం చెప్పే నాథుడే లేరు. పైపెచ్చు మధ్యాహ్నం సమయంలో పేలుళ్లు జరుపుతున్నారు. దీంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. 24 గంటలూ పొక్లెయిన్, ఇతర యంత్రాలు అక్కడే మోహరించి సహజ సంపదను వెలికి తీస్తున్నారు. రాత్రిళ్లు గ్రానైట్ను తమిళనాడులోని పరధరామికి తరలిస్తున్నారు. దాదాపు రెండు నెలలుగా ఈ వ్యవహారం జరుగుతోంది. ఇప్పటివరకు రూ.4 కోట్ల విలువైన బ్లాక్లను అక్రమంగా రవాణా చేశారని సమాచారం.

**యంత్రాంగానికి తెలిసినా..** మర్రిగుంట కేంద్రంగా జరుగుతున్న దందా గురించి స్థానిక రెవెన్యూ యంత్రాంగానికి తెలుసు. గనుల శాఖ అధికారులకు సైతం స్థానికులు ఫిర్యాదు చేశారు. అయినా తనిఖీలు చేసి బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు మాత్రం ముందుకు రావడంలేదు. అక్రమార్కుల పలుకుబడికి తలొగ్గారా? లేదంటే కాసులకు కక్కుర్తి పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే అప్పుడే స్పందిస్తారా? అని రైతాంగం ప్రశ్నిస్తోంది.

**ఖజానాకు గండి పడుతున్నా..**

క్వారీకి అనుమతులు తీసుకోవాలంటే కనీసం రూ.70 లక్షలు- రూ.80 లక్షల వ్యయమవుతుంది. ఇదంతా ప్రభుత్వ ఖజానాకే జమ అవుతుంది. ఆపై పర్మిట్ల రూపంలో నెలకు ప్రభుత్వానికి కనిష్ఠంగా రూ.6 లక్షలు- రూ.8 లక్షలు చెల్లించాలి. జిల్లా ఖనిజ నిధి (డీఎంఎఫ్) కింద కొంత కట్టాలి. ఆ డబ్బుతో గని పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు. ఇలా అటు సర్కార్కు ఇటు స్థానిక సంస్థలకు చేయూత అందినట్లవుతుంది. ప్రస్తుతం అనుమతులు తీసుకోనందున ఇప్పటికే రూ.కోటి వరకు ఆదాయానికి గండి పడింది. మరోవైపు పర్యావరణ విధ్వంసం జరుగుతోంది. **చర్యలకు వెనుకంజ** గత జగన్ పాలనలో చిత్తూరు మండలంలో అచ్చంగా ఇలాగే అక్రమ రవాణా జరిగింది. అప్పట్లో వైకాపా నేతలే ఇందులో భాగస్వాములు కావడంతో అప్పుడు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గనులు, రెవెన్యూ, పోలీసు శాఖ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వచ్చింది. అయినా కూడా మీనమేషాలు లెక్కించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# కుక్కలున్నాయ్... పిక్కలు జాగ్రత్త

పుత్తూరు : నగరం అడవి తక్కెళ్లపాడులో ఐజక్(4)ను ఊరకుక్కలు గొంతు కొరికి చంపేశాయి. దీంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతం. ఇలా నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటివి జరుగుతునే ఉన్నాయి. కుక్కల వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ ప్రక్రియ అంతా రికార్డులకే పరిమితం అవుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. పుత్తూరు మున్సిపాలిటీలో మొత్తం 1000 పైచిలుకు కుక్కలున్నాయి. గత మూడేళ్లలో 567 కుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేశారు. మిగిలినవి అలానే తిరుగుతున్నాయి. దీంతో వాటి సంతతి ఏటా పెరుగుతోంది. పలమనేరు మున్సిపాలిటీలో ఈ ఒక్క ఏడాదే 50 మంది కుక్కకాటుకు గురై ఆస్పత్రిలో చేరారు.

న్యూస్టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏటా ఊర కుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజ్ చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఇదంతా రికార్డులకే పరిమితం అన్నది అక్షర సత్యం. నగరిలో వెయ్యి కుక్కలు, పుత్తూరు 499, పలమనేరులో 1200, పుంగనూరులో 500, కుప్పంలో 1250 వీధికుక్కలు ఉన్నట్లు అధికారుల లెక్క. తిరుపతి జిల్లాలోని నగరపాలక, మున్సిపాలిటీల్లో 15 వేలు ఉన్నాయి. వాటి నియంత్రణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే. నగరపాలక సంస్థ, మున్సిపల్ అధికారులు కుక్కల సంతతి పెరగకుండా వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేపడుతున్నట్లు లెక్కలు చూపుతున్నారు. అయితే నగర, పట్టణాల్లో వీటి సంతతి పెరుగుతోంది తప్ప తగ్గడంలేదు. నిత్యం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కుక్కకాటుకు గురై మృతి చెందిన సంఘటనలు గతంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటి నియంత్రణకు అధికారులు సక్రమంగా చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు కుక్కల నియంత్రణకు అధిక



ప్రాధాన్యం ఇచ్చి వాటి నుంచి ప్రజలను రక్షించాల్సిన అవసరం ఉంది. **నియంత్రణే మార్గం..:** వీధికుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ ఒక్కటే మార్గం. కుక్కల పునరుత్పత్తి ప్రక్రియను నియంత్రించేలా శస్త్రచికిత్స చేయడం. ఆడవాటన్నింటికీ ఒకేసారి సంతాన నిరోధక శస్త్రచికిత్స జరిగితేనే వాటి సంతతి తగ్గుతుంది. నగరాల్లో వేలాదిగా, పట్టణాల్లో వందలాది శునకాలకు శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు కార్పొరేషన్, మున్సిపల్, వెటర్నరీ విభాగాల అధికారులు చెబుతున్న మాటలన్నీ డొల్లలేనని పెరుగుతున్న వీటిసంఖ్య చెబుతోంది.

**చర్యలు చేపట్టాలి** నగరాలు, పట్టణాల్లో కుక్కల సంతతి పెరగకుండా నిధులు కేటాయించుకుని వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ పూర్తిగా చేపట్టాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. ఏటా కొన్నింటికి మాత్రమే చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. ఒక్కో మున్సిపాలిటీ పూర్తి స్థాయిలో చేపడితే వాటి సంతతి పెరగదు. ఆ దిశగా చర్యలు చేపట్టాలి. విశ్వనాథ్, ఆర్డీ, అనంతపురం

# రాపాక వారి రోడ్డు పంచాయితీ

కాకినాడ: ఖరీదైన నివాసం..చుట్టూ ప్రహరీ.. విశాలమైన సిమెంటు రోడ్డు.. లోనికి ఎవరూ వెళ్లకుండా పెద్ద గేటు.. ఆ భవనం యజమాని పేరు రాపాక వరప్రసాద్. ఆయన వైకాపా నేత, రాజోలు మాజీ ఎమ్మెల్యే.. ఈ రోడ్డు నిర్మాణానికి వెచ్చించింది రాపాక సొంత సొమ్ము కాదు ఎంపీ ల్యాడ్స్ నిధులు.. నాడు వైకాపా ప్రభుత్వ హయాంలో ఇలాంటి పోకడలు ఎన్నో. ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోలేదు. కూటమి వచ్చాక ఫిర్యాదుదారు మరోసారి గుర్తుచేశారు. దీంతో రోడ్డు పంచాయితీ మళ్లీ తెరమీదికి వచ్చింది.

**అడ్డు చెప్పేదెవరంటూ..**

మలికిపురం మండలం కత్తిమండలోని సర్వే నంబర్ 2/2లో రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్కు 1.60 ఎకరాల స్థలం ఉంది. ఆయన నిర్మించుకున్న ఇంటికి రోడ్డు అవసరం. 2019-20 నాటి ఎంపీ ల్యాడ్స్ నిధులు ఉండడంతో రూ. 4 లక్షల చొప్పున మూడు పనులు (మొత్తం రూ.12లక్షలు) కేటాయించేలా అప్పటి అమలాపురం ఎంపీ చింతా అనురాధ ఆమోదం పొందారు. 2021-22లో రోడ్డు పనులు సాగాయి. వైకాపా నేత సొంతింటికి ఎంపీ ల్యాడ్స్ ఎలా వాడుతారంటూ ఇదే జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐ యనుముల వెంకటపతిరాజా అభ్యంతరం తెలిపారు. అప్పటి కలెక్టర్, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. కేంద్ర ప్రభుత్వ గణాంకాలు- ప్రగతి అమలు మంత్రిత్వశాఖ (ఎంపీ ల్యాడ్స్ డివిజన్)ను ఆయన ఆశ్రయించడంతో తాజాగా ఆరాలు మొదలయ్యాయి.



**ప్రజలు వినియోగిస్తున్నారట..**

వాస్తవమేమిటో నిర్ధారించడానికి జిల్లా పంచాయతీ అధికారి, ఆర్డీవోతో గతయేడాది జనవరిలో కలెక్టర్ ఓ కమిటీ వేశారు. రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంపు పేపర్పై రాపాక రాత పూర్వకంగా ఈ భూమిని పంచాయతీకి ఉచితంగా ఇచ్చారని.. భవిష్యత్తులో ఎలాంటి అభ్యంతరం లేవనెత్తబోమని వెల్లడించడంతో తీర్మానం చేసి.. పీఆర్ శాఖ పర్యవేక్షణలో రోడ్డు వేశారని గుర్తించింది. ప్రజలు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగిస్తున్నారని నివేదికలో పేర్కొనడం గమనార్హం. కేంద్ర మంత్రిత్వ శాఖ మళ్లీ ఆరా తీయడంతో..మలికిపురం ఎంపీడీవో, తహసీల్దార్, క్షేత్ర సిబ్బందితో తనిఖీ చేయించారు. ఈ బృందం సైతం ఈ రోడ్డును ప్రజలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాడుతున్నట్లు జనవరిలో నివేదిక ఇచ్చింది. ఇదే విషయాన్ని ఫిబ్రవరిలో ఎంపీల్యాడ్స్ విభాగం దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. ఇంటి చుట్టూ ప్రహరీ, భారీ గేట్లు, ఆ ప్రాంగణం మధ్యలో రోడ్డు ఉంటే స్థానికులు ఎలా వినియోగించుకుంటారనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. ప్రజల కోసం ఉచితంగా రోడ్డు నిర్మాణానికి భూమి ఇచ్చారనుకుంటే.. దానిపై యాజమాన్య హక్కులు నేటికీ పంచాయతీకి దక్కలేదు. పంచాయతీ పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేశాకే రోడ్డు వేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. నాటి ఉల్లంఘనలు ప్రభుత్వం దృష్టికి వెళ్లకుండా తొక్కిపెట్టే ప్రయత్నాలు నేటికీ సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# సొంతింటి కల.. సాకారమయ్యేనా..?

కాకినాడ : గత ప్రభుత్వంలో పట్టాలు పొంది, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఆర్థిక సమస్యలతో మధ్యలో నిలిపివేసినవాటిని పూర్తిచేసి పేదల కల సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. అయితే లబ్ధిదారుల నుంచి మిశ్రమ స్పందన కనిపిస్తోంది. బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75, రూ.లక్ష చొప్పున అదనపు సాయం మంజూరు చేసినా చాలా మంది ముందుకు రావడం లేదు. **7,742 మందితో..** జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు నిలిపివేసిన 7,742 మంది లబ్ధిదారులను గుర్తించి గత నెలలో వారి నుంచి అంగీకార పత్రాల సేకరణకు గృహ నిర్మాణ సంస్థ అధికారులు సర్వే నిర్వహించారు. 4,002 మంది మాత్రమే అంగీకారం తెలపగా 3,740 మంది ఆసక్తి చూపలేదు. గుర్తించిన పేదలంతా అదనపు సాయంతో గృహాలు పూర్తిచేసుకోవాలనే సంకల్పంతో మరోసారి సర్వేకు ప్రభుత్వం ఆదేశించి ంది. గృహ నిర్మాణ సంస్థ అధికారులు, సిబ్బంది మళ్లీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించింది. దీంతో అధికారులు మళ్లీ ఈనెలలో లబ్ధిదారుల గృహబాట పట్టారు. ఇప్పటికే అంగీకారం తెలిపిన వారికి తొలి విడతగా రూ.4 కోట్ల మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశామని, వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలని సూచిస్తున్నారు.

**సరైన సదుపాయాలు లేక..**

జగనన్నకాలనీల్లో సరైన సదుపాయాలు లేవని, అక్కడకు వెళ్లి ఎలా ఉండాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.



అప్పట్లో 60 శాతం మంది ఆవాసం ఉంటేనే మౌలిక సదుపాయాలు కల్పించాలనే నిబంధన విధించారు. చాలా కాలనీల్లో ఈ పరిస్థితి లేదు. అరకొరగా విద్యుత్తు, తాగునీరు, రహదారులు కల్పించారు. కొన్నిచోట్ల తాగునీటి సరఫరా, వీధి దీపాల వ్యవస్థను సక్రమంగా తీర్చిదిద్దలేదు. దీంతో చాలా మంది ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. అదనపు సాయంతో నిర్మించుకోవాలని అవగాహన కల్పించినా.. సదుపాయాలు లేవని చెబుతున్నారని సర్వే సిబ్బంది వాపోతున్నారు.

**అంగీకార పత్రాలు తీసుకుంటున్నాం..**

ఈ విషయమై జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి ఎన్వీవీ సత్యనారాయణను వివరణ కోరగా మరోసారి లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలకు అంగీకార పత్రాలు తీసుకుంటున్నామని చెప్పారు. అదనపు ఆర్థికసాయంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదనపు సాయం కింద జిల్లాకు రూ.12 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. గృహ నిర్మాణానికి అంగీకారం తెలిపిన వెంటనే సంబంధిత పత్రాన్ని లబ్ధిదారులకు అందిస్తున్నామని, ఆ వెంటనే తొలి విడత ఆర్థికసాయాన్ని ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా మిగిలిన 3,740 మంది ఇళ్లకు వెళుతున్నామని, ఈసారి ఎక్కువ మంది అంగీకారం తెలిపే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# లక్ష్యానికి దూరంగా.. గత ఆదాయానికి చేరువగా..!

తిరుపతి : జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ తన ఆదాయ లక్ష్యంలో 65 శాతమే చేరుకోగలిగింది. గత పాలకుల తప్పిదాలు సరిదిద్దే క్రమంలో ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం, నిబంధనలు పకడ్బందీగా అమలుపరచడంతోపాటు స్థిరాస్తి రంగంలో నెలకొన్న స్తబ్ధతతో ఈ పరిస్థితి ఎదురైనట్లు తెలుస్తోంది. శ్రీకాళహస్తి, సత్యవేడు సబ్ డివిజన్‌లో డీకేటీ భూములు.. గూడూరు సబ్ డివిజన్లలో చుక్కల భూములకు సంబంధించి దాదాపు రెండువేల ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు గత ఏడాది జరిగాయి. పేద రైతుల భూములను వైకాపా పెద్దలు లాక్కున్నారనే ఆరోపణలపై ప్రస్తుత ప్రభుత్వం మే 15వ తేదీ వరకు



నిషేధం విధించింది. అలాగే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో క్రయవిక్రయాల ఊపు తగ్గడం మరో కారణమైంది. ప్రపంచ దేశాల్లో ఉన్న తెలుగువారి సంపాదన తగ్గడంతో.. జిల్లాలో వారి కుటుంబ సభ్యులు ఆస్తుల కొనుగోలు తగ్గినట్లు సమాచారం. ఇదివరకు తితిదే ఉద్యోగులకు ఇంటి స్థలాల కేటాయింపుతో దాదాపు ఐదువేలు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రస్తుతం అవి ఆగిపోవడం కొంత ప్రతికూలంగా మారింది.

**సగానికిలోపే రిజిస్ట్రేషన్లు..** 2023-24లో 1,823 దస్త్రాలు రిజిస్ట్రేషన్ చేయగా 2024-25లో 880 పత్రాలు మాత్రమే సాధ్యమైంది. ఆ మేరకు దస్త్రాల రిజిస్ట్రేషన్ తగ్గింది. రూ.521.74 కోట్లు రాగా ఈసారి రూ.507.18 కోట్లు వచ్చింది. పూర్వ ఏడాది ఆదాయంతోపోల్చితే రూ.14.56 కోట్ల ఆదాయం తగ్గింది.

# ఉచితం మాటున ఇసుక దందా



తాడిపత్రి : తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా పెన్నానది వేదికగా ఇసుకను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని ఆసరాగా తీసుకొని ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారు. పెన్నానది నుంచి పగలు ట్రాక్టర్లతో తరలించి రహస్య ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రి కాగానే టిప్పర్లు, లారీల్లో అనుకున్న ప్రాంతానికి తరలిస్తున్నారు. పెన్నానదిలో పొక్లెయిన్లను సైతం వినియోగించి తవ్వకాలు చేపడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

**ఈ గ్రామాల్లోనే అధికంగా..**

తాడిపత్రి మండలంలోని గంగాదేవిపల్లి, ఇగుడూరు, ఆలూరు, సజ్జలదిన్నె, చిన్నపొడమల నందలపాడు, శ్రీనివాసపురం, పెద్దపప్పూరు మండలంలోని జోడీ ధర్మాపురం, చింతలపల్లి, చాగల్లు, కుమ్మెత, బొందలదిన్నె, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలంలోని కొండూరు, చిట్టూరు, చిత్రచేడు, నాగలాపురం, ఈరన్నపల్లి తదితర ప్రాంతాల నుంచి ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు.

**దర్జాగా సరిహద్దులు దాటిస్తూ..**

నది నుంచి ఇసుకను తోడి రహస్య ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. ఆతర్వాత టిప్పర్లు, లారీల ద్వారా బళ్లారి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, బెంగళూరు ప్రాంతాలకు తరలించి రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇసుక అక్రమంగా తరలించే వాహనాలు కళ్లెదుటే వెళుతున్నా నియంత్రించాల్సిన కొందరు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**60 కి.మీ. పరిధిలో దోపిడీ**

తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో మండలం, పట్టణం, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల పరిధిలో దాదాపు 60 కి.మీ మేర పెన్నానది విస్తరించింది. నది నుంచి ఆయా మండలాల పరిధిలో నిత్యం వందలాది ట్రాక్టర్లతో పట్టపగలే ఇసుకను తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న వారైనా తరలించాలంటే అధికారుల అనుమతి ఉండాల్సిందే అని నిబంధన ఉన్నా ఎవరూ పాటించడం లేదు.

**అనుమతులు ఉండాల్సిందే** -ఓబుళరెడ్డి, భూగర్భ గనులశాఖ, ఏడీ, తాడిపత్రి

భూగర్భ గనుల శాఖ నుంచి పెన్నానదిలో ఇసుక తవ్వుకోవాలని తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. స్థానికంగా ఉన్న తహసీల్దార్లు వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వ నిబంధనలు అనుసరించి తవ్వకాలకు అనుమతులు ఇవ్వొచ్చు. మరి అనుమతి ఇచ్చారో లేదో తెలియదు. నియోజకవర్గంలోని తహసీల్దార్లు, పోలీసు అధికారులతో చర్చించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# జోరుగా హంద్రీనీవా పనులు

అనంతపురం: ప్రజల కోసం పనిచేయాలనే తపన.. చిత్తశుద్ధి పాలకులకు ఉంటే ఎంతటి పనులైనా చేయవచ్చని చెప్పడానికి హంద్రీనీవా విస్తరణే నిదర్శనం. జిల్లాలో కాలువ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు వారాల్లోనే 15 శాతం పూర్తి అయ్యాయి. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జూన్ 10 నాటికి వందశాతం విస్తరణ పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. మార్చి 8న మల్యాల నుంచి నీటి పంపింగ్ నిలిపివేశారు. 8 రోజుల పాటు కాలువలో నిలిచిన నీటిని ఎత్తిపోశారు. తర్వాత బురద తొలగించి 20 నుంచి పనులు మొదలుపెట్టారు. కంపచెట్లను తొలగించి దారులు ఏర్పాటు చేశారు. గట్లపై ఉన్న మట్టిని తీసేసి పనులకు ఆటంకం లేకుండా చేసుకున్నారు.

క్షేత్రస్థాయిలో 195 పొక్లెయిన్లు, 292 భారీ వాహనాలతో పనులు సాగుతున్నాయి. ప్యాపిలి, రాగులపాడు, ఉరవకొండ, లత్తవరం, కొట్టాలపల్లి ప్రాంతాల్లో పనులు దాదాపు పూర్తయ్యాయి.

**సవాళ్లను అధిగమిస్తూ..** అనంత జిల్లా పరిధిలో 81 కి.మీ మేర విస్తరణ పనులు చేస్తున్నారు. కాలువను 12 నుంచి 19 మీటర్లకు పొడిగిస్తున్నారు. రాగులపాడు, గుంతకల్లు, కసాపురం ప్రాంతాల్లో రాతిపొర తొలగించాల్సి ఉంది. ఉరవకొండ మండలంలో బురద ఉ



ండటంతో పనులు కష్టంగా మారుతున్నాయి. వాటిని అధిగమిస్తూ పనులు సాగుతున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

ఫేజ్-1లో విస్తరణ: 88-216 కి.మీ
అనంతపురం జిల్లాలో: 134-216 కి.మీ
విలువ: రూ.440 కోట్లు
నిర్మించే తూములు: 19
ఈనెలాఖరుకు లక్ష్యం: 40 కి.మీ

# కృష్ణమ్మ చేరాలి.. కరవు తీరాలి

డోన్ : రాయలసీమ జీవనాడి హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వ విస్తరణపై దృష్టి సారించింది. ఇందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో రూ.660 కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. 6.35 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పనులు మొదలయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 134 కి.మీ మేర కాల్వ విస్తరించి ఉంది.. 35 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. కాల్వలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 2,100 క్యూసెక్కుల నుంచి 3,850 క్యూసెక్కులకు పెంచేలా పనులు జూన్ 15 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ కాల్వ నీటి ఆధారంగా నీటిని తరలించే చెరువులను బాగు చేయాలని స్థానిక రైతులు విన్నవిస్తున్నారు.

**ట్రయల్ రన్‌తో సరిపెట్టిన వైకాపా**

ఏటా కరవు పరిస్థితులు నెలకొనే పశ్చిమ ప్రాంతానికి సాగు నీరు అందించాలని గతంలో తెదేపా హయాంలో నిర్ణయించింది. 68 చెరువుల్లోకి హంద్రీనీవా ప్రధాన కాల్వ ద్వారా కృష్ణాజలాలు తరలించి బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్నది ప్రాజెక్టుల లక్ష్యం.. ఇందుకు రూ.224.31 కోట్లు కేటాయించి 60 శాతం పనులు పూర్తి చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా.. చెరువుల సంఖ్యను 77కు పెంచింది.. పనులు పూర్తి చేయకుండానే ఎన్నికల ముందు



ప్రారంభోత్సవం చేసి ట్రయల్ రన్‌తో సరి పెట్టారు.

**నిర్వహణకు నిధులు కావాలి**

చెరువుల ద్వారా పొలాలకు నీరందాలంటే ఏటా రూ.1.69 కోట్ల నిర్వహణ (ఓఅండ్ఎం) నిధులు తప్పనిసరిగా విడుదల చేయాల్సి ఉంది. విడుదల చేయకుంటే రూ.242 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు నిరుపయోగమయ్యే ప్రమాదముంది. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు.

**చెరువుకు చేరని నీరు**

హంద్రీ ప్రధాన కాల్వకు ఇరువైపులా ఉన్న రైతులు కి.మీ. మేర పైపులు ఏర్పాటు చేసుకుని, విద్యుత్తు లేదా డీజిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని పంటలకు నీరందిస్తున్నారు.

ఇప్పటి వరకు ఒక్క చెరువు వద్ద కూడా పూర్తిస్థాయి పనులు చేపట్టలేదు. అధికారులు మాత్రం పనులన్నీ పూర్తైనట్లు.. వంద శాతం మేరకు నీటిని నింపుతున్నట్లు ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తున్నారు. ప్యాపిలి మండలం నాయనిచెరువు, గుడిపాడు, కలచట్లలో నీటి జాడనే లేదు. డోన్ మండలం వెంకటాపురం చెరువు కింద 1740 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇలాంటి వాటి విస్తీర్ణం పెంచాలని రైతులు విన్నవిస్తున్నారు. చాలా చెరువులో పూడిక తీయలేదు. కనీసం ముళ్లపొదలు తొలగించ లేదు. కట్టల బలోపేతం మరిచారు. హంద్రీ కాల్వ నుంచి చెరువులకు నీళ్లు వెళ్లే మార్గం(గ్రావిటీ)లో పూడిక తీయలేదు.. ఇరువైపులా ముళ్లపొదలు ఉండటంతో సాగు నీరు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది. పైపులైన్లు పూర్తిగా వేయలేదు. కృష్ణగిరి మండలం ఆలంకొండ- కటారుకొండ గ్రామాల మధ్య ఇప్పటికీ అలాగే వదిలేశారు.

ఎంపిక చేసిన చెరువులు : 77
డోన్ (36), పత్తికొండ (35), ఆలూర (4), పాణ్యం (2)
నీటి కేటాయింపు : 1.238 టీఎంసీలు
మొత్తం ఆయకట్టు : 10,450 ఎకరాలు
లబ్ధి పొందే గ్రామాలు : 61
వేయాల్సిన పైపులైన్ల పొడవు : 192.76 కి.మీ.లు

# నిషేధిత ప్లాస్టిక్ విక్రయాల అడ్డా ధర్మవరం!



ధర్మవరం : ధర్మవరం నిషేధిత పాలిథిన్ కవర్లు, సామగ్రి సరఫరా చేసే కేంద్రంగా మారింది. జిల్లాలోని పలు పట్టణాలకు, మండల కేంద్రాలకు, పల్లెలకు ఇక్కడి నుంచే వాటిని రహస్యంగా చేరవేస్తున్నారు. రోజూ సుమారుగా రూ.20 నుంచి రూ.25 లక్షల విలువచేసే మూడు టన్నుల నిషేధిత కవర్లు, గ్లాసులు, ఇతర సామగ్రి దుకాణాలకు సరఫరా చేస్తూ.. కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ధర్మవరంలో వివిధ వస్తువుల డీలర్‌షిప్ తీసుకున్న కొందరు డీలర్లు నిషేధిత పాలిథిన్ కవర్లు, సామగ్రి దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. మున్సిపాలిటీలో నిషేధిత ప్లాస్టిక్ వ్యర్థాలు రోజూ 0.5 - 1 టన్నుల వరకు పారిశుద్ధ్య కార్మికులు సేకరిస్తున్నారంటే వాటి విక్రయాలు ఏ స్థాయిలో ఉందోఅంచనా వేయవచ్చు.

**తనిఖీలు చేయకుండా కట్టడి చేస్తున్న డీలర్లు**

పట్టణంలోని ఎన్టీఆర్, అంజుమన్, మదీనా మసీదు సర్కిల్‌లో సిండికేట్‌గా ఏర్పడిన కొందరు వ్యాపారులు శివారు ప్రాంతంలో రహస్యంగా గోదాములు బాడుగకు తీసుకుని ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్నారు. ప్రధానంగా ముగ్గురు డీలర్లు నిషేధిత వస్తువులను పెద్ద మొత్తం వాటిని ఇక్కడికి తెప్పించుకుని జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. పట్టుబడితే రాజకీయ నాయకులను ఆశ్రయించి కేసులు లేకుండా చేస్తున్నారనే విమర్శలున్నాయి. తమ గోదాములు తనిఖీ చేయకుండా అధికారులను ధనం.. రాజకీయ బలంతో కట్టడి చేస్తున్నారని తెలిసింది. బల్క్‌లో ఆర్డర్ ఇచ్చిన వారికి డీలర్లే డెలవరీ చేస్తున్నారు. తక్కువ మొత్తంలో కావాల్సిన వారు డీలర్ల దగ్గరకు వచ్చి తీసుకెళ్తున్నారు.

**కలెక్టర్ ఆదేశాలతో ..**

పర్యావరణానికి, మానవాళి మనుగడకు నష్టం కల్గిస్తున్న వాటిని నిషేధిస్తూ.. విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని ఇటీవల వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆ మరుసటి రోజే కలెక్టర్ శ్రీసత్యసాయి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, శానిటేషన్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ విక్రయం, వినియోగంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధర్మవరం నుంచే జిల్లాలోని మున్సిపాలిటీలకు ఎక్కువగా ప్లాస్టిక్ వస్తువులు చేరుతున్నాయని కలెక్టర్ దృష్టికి వచ్చింది. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారని సమాచారం. దీంతో పట్టణంలోని గోదాముల్లో మున్సిపల్ అధికారులు తనిఖీలు చేశారు. 600 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రూ.లక్ష దాకా జరిమానా విధించారు.

**కఠిన చర్యలు తప్పవు**

ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ధర్మవరం

ధర్మవరం పట్టణంలో కొందరు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు బల్క్‌గా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో వారి గోదాములపై దాడి చేసి అన్నింటిని సీజ్ చేశాం. భారీగా జరిమానాలు విధించాం. ఎవరైనా వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోము. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

# పన్ను రాయితీ.. వసూళ్లలో పురోగతి

ఆత్మకూరు : పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపోయాయి. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా చాలామంది ఆస్తుల యజమానులు పన్ను బకాయిలు చెల్లించడం లేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పన్ను వసూళ్లపై దృష్టి పెట్టింది. గత ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరులోగా పన్ను చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ మాఫీ చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు వసూలు కాలేదు. ఈ క్రమంలో వందశాతం పన్ను వసూలే లక్ష్యంగా మొత్తం పన్నులో 5 శాతం రాయితీ ప్రకటిస్తూ ఈనెల 4న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రత్యేక కార్యాచరణ**

రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ప్రకటించటంతో ప్రజలు పన్నులు



చెల్లించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈనెల 4వ తేదీన పన్ను రాయితీ ప్రకటించినా శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో చెల్లింపులకు వీలుకాలేదు. సోమవారం ఉదయం 10 గంటల నుంచే పలువురు పన్ను చెల్లించేందుకు పురపాలక కార్యాలయాల్లో బారులుతీరారు. రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు బకాయిలు ఉన్న వారు కార్యాలయాలకే వచ్చి చెల్లిస్తున్నారు. ప్రజల నుంచి స్పందన చూసి పురపాలక అధికారులు పన్ను చెల్లింపుదారులకు కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ వేడిమి తగలకుండా రేకులు, తడికెలతో షెడ్లు ఏర్పాటు చేసి నీటివసతి కల్పించారు. వృద్ధులు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. పన్నుల వివరాలు తెలియజేసేందుకు ప్రత్యేక కౌంటరును ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

# పంట కుంట.. రైతులకు ఊరట



రాయదుర్గం : కరవు జిల్లాలో వర్షపు నీటిని పొదుపు చేసి భూగర్భ జలాలను పెంచటానికి కూటమి ప్రభుత్వం పంట కుంటలను ప్రోత్సహిస్తోంది. ప్రతి రైతు తన పొలంలో పంట కుంటలను తవ్వుకుని వర్షపు నీటిని పొదుపు చేస్తే వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. వర్షాభావ, బెట్ట పరిస్థితుల్లో కుంటల్లోని నీటితో వివిధ రకాల పంటలు పండించవచ్చు. కూలీలకు ఆ గ్రామాల్లోనే ఉపాధి పనులు కూడా లభిస్తాయి. వేసవిలో బోర్లలో భూగర్భజలాలు సమృద్ధిగా లభిస్తాయి.

**లక్ష్యానికి మించి మంజూరు :** జిల్లాలో ప్రభుత్వం 9,000 పంట కుంటలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రైతుల నుంచి సానుకూల స్పందన రావటంతో 10,561 పంట కుంటలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఉగాది, రంజాన్ పండగలు పూర్తి కావటంతో కుంటల తవ్వకం పనులు ఊపందుకున్నాయి. మరో రెండు వారాల్లో వాటిని పూర్తి చేసేందుకు డ్వామా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కువ పొలం ఉన్న రైతులు 10 అడుగుల వెడల్పుచ 10 అడుగుల పొడవు, ఆరడుగుల లోతు వరకు కుంటలను తవ్వుకోవచ్చు. లోతు ఎక్కువగా తవ్వాలనుకునే రైతులు మరో నాలుగడుగులకు వారే సొంతంగా భరించాల్సి ఉంటుంది. ఒక్కో పంట కుంటకు ప్రభుత్వం రూ.46,800 చెల్లిస్తుంది. సన్న, చిన్నకారు రైతులు 5 అడుగుల పొడవు, 5 అడగుల వెడల్పుతో తక్కువ పరిమాణంలో కుంటలను నిర్మించుకోవచ్చు. ఈ కుంట నిర్మాణానికి ప్రభుత్వం రూ.24,000 మంజూరు చేస్తుంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

– సలీంబాషా, డ్వామా పీడీ, అనంతపురం

జిల్లాల్లో ఎర్రనేలలు ఎక్కువగా ఉంటాయి. వర్షాలు కురిసిన సమయంలో నీటిని కుంటల్లో నిల్వ ఉంచితే భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లో నీరు సమృద్ధిగా లభిస్తాయి. పంటల సాగుతోపాటు ఇతర అవసరాలకు ఉపయోగపడతాయి. వర్షాభావ పరిస్థితుల సమయంలో ఈ నీటి ద్వారా పంటలకు రక్షక తడులు ఇచ్చుకోవచ్చు. ఫారంపాండ్ల చుట్టూ పండ్లు, కూరగాయల మొక్కలు సాగు చేసుకొని అదనపు ఆదాయాన్ని రైతులు పొందేందుకు అవకాశం ఉంటుంది.

జిల్లాలో మంజూరు చేసిన పంట కుంటలు: 10,561
ప్రారంభించిన పనులు: 2,564
పూర్తయినవి : 590

# భవితకు ఊతం

డోన్ : గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం 'భవిత' కేంద్రాలను వదిలేసింది. దీంతో దివ్యాంగ బాలలు ఇబ్బంది పడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55 భవిత కేంద్రాలు ఉన్నాయి. 10 వేల మంది వరకు దివ్యాంగ బాలలు ఉండగా 1,370 మందే కేంద్రాలకు వస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది పేద కుటుంబాలకు చెందిన వారే. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భవిత కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అలవెన్సులు పిల్లల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.. సిబ్బందికి సకాలంలో వేతనాలు మంజూరు చేస్తున్నారు. అదేవిధంగా బాలలకు అవసరమైన ఉపకరణాల పంపిణీకి రంగం సిద్ధం చేసింది.

**భత్యం విడుదల చేసి**

రవాణా భత్యం కింద పది నెలలకు ఒక్కో విద్యార్థికి రూ.3 వేలు, పీఎంశ్రీ పాఠశాల దివ్యాంగ బాలికలకు స్టైపండ్ కింద పది నెలలకు రూ.3వేలు, మిగతా పాఠశాలల్లోని బాలికలకు రూ.2వేలు, బడికి స్వతహాగా వెళ్లలేని పిల్లల సహాయకులకు ఎస్కార్ట్ అలవెన్స్ రూ.3వేలు ఇవ్వాలి. వైకాపా ప్రభుత్వం వీటిని ఇవ్వలేదు. దీంతో పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు ఇబ్బంది పడ్డారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబరులో అలవెన్స్ నిధులను మంజూరు చేసింది. నంద్యాల జిల్లాకు రూ.87,28,000, కర్నూలు జిల్లాకు రూ.49,45,000 చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేశారు.

**త్వరలో శిబిరాల నిర్వహణ**

గతేడాది ఆదోని, కర్నూలులో ఉచిత వైద్య ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహించి అవసరమైన ఉపకరణాల తయారు చేయించారు. ఈ మేరకు కర్నూలు జిల్లాకు రూ.10 లక్షలు విలువ చేసే వివిధ రకాల ఉపకరణాలు వచ్చాయి. ఎంపికైన పిల్లలకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి త్వరలో పంపిణీ చేయనున్నారు. త్వరలో ప్రత్యక్షంగా చూపిస్తూ బోధించే బోధనోపకరణాలకు సంబంధించి 31 కిట్లు రానున్నట్లు అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలో రెండేళ్లుగా ఉచిత వైద్య ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు నిర్వహించని కారణంగా ఉపకరణాలు మంజూరు కాలేని పరిస్థితి నెలకొంది.

చురకలు



# చిన్నారులకు సుజలం

శ్రీకాకుళం: చిన్నారుల్లో సూక్ష్మక్రిముల సంక్రమణ వ్యాధులకు మూలకారణం తాగునీరు. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుద్ధజలం అందించడానికి సన్నాహాలు చేసింది. వైకాపా హయాంలో యంత్రాలు ఏర్పాటు చేసినా పర్యవేక్షణ కొరవడటంతో కొన్నిచోట్ల మూలకు చేరాయి.

కేంద్రాలకు వస్తున్న వారిలో కొందరు ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. కొన్నిచోట్ల సిబ్బంది కాచి చల్లార్చిన నీరు అందించే వారు. ఈ పరిస్థితికి ముగింపు పలకడానికి అవసరమైన ప్రాంతాల్లో శుద్ధజలం పంపిణీకి ఉపకరణాలను ఏర్పాటు చేసే కార్యాచరణకు సిద్ధమైంది. సాధారణంగా వేసవిలో చిన్నారులు డయేరియా, వైరల్ జ్వరాల బారిన పడే అవకాశం ఉంది. ఈ సమస్యను అరికట్టడానికి ప్రతి కేంద్రంలో శుద్ధజలం అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

తొలి విడతలో 14 ప్రాజెక్టులకు 153 శుద్ధజల యంత్రాలు పంపిణీ చేసింది. గత ప్రభుత్వం జిల్లాలోని కేంద్రాలకు 813 యూనిట్లు సమకూర్చింది. వాటిలో ప్రస్తుతం 273 పని చేస్తుండగా మిగిలినవి మూలకు చేరాయి. నాణ్యత, నిర్వహణ లోపాల కారణంగా వినియోగం పూర్తిస్థాయిలో లేదు. చాలావాటికి మరమ్మతులకు చేయకపోవడంతో




శుభ్రమైన నీరు తాగే వీలు లేకుండా పోయింది.

మొత్తం 16 ప్రాజెక్టుల్లో 2,759 మెయిన్, 599 మినీ కేంద్రాలున్నాయి. వీటిలో ఆరు నెలల నుంచి ఏడాది వయసున్న చిన్నారులు 12,402 మంది, ఏడాది నుంచి మూడేళ్ల లోపు 43,013 మంది, ఆరేళ్ల లోపు 30,624 మంది ఉన్నారు.

**సురక్షిత నీరు అందిస్తాం..**

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుద్ధజలం అందించడానికి ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసింది. ఆర్వో యంత్రాలను సిద్ధం చేయడానికి సంబంధిత సిబ్బంది పని చేస్తున్నారు. గతంలో సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను వెతకాల్సి వచ్చేది. బి.శాంతిశ్రీ, పీడీ, ఐసీడీఎస్, శ్రీకాకుళం

# నీడ లేక.. నీరందక!

కవిటి : మార్చి నెల ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా జిల్లాలో 33 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కనీస వసతులు లేకుండా సాగుతున్నాయి. కూలీలకు క్షేత్రస్థాయిలో అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో మండుటెండలో అవస్థలు పడుతున్నారు. రోజురోజుకు భానుడి సెగ పెరుగుతున్నా పని ప్రాంతాల్లో వేతనదారులకు వసతులు కల్పించడం లేదు. కొందరు నీరసించి అస్వస్థతకు గురవుతున్నా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారు.

జిల్లాలోని 30 మండలాల్లో 3.84 లక్షల క్రియాశీల జాబ్ కార్డులున్నాయి. 6.18 లక్షల మంది వేతనదారులున్నారు. ప్రస్తుతం 1.14 లక్షల మంది పనులకు వస్తున్నారు. వైకాపా ప్రభుత్వం పని ప్రదేశాల్లో వసతులు కల్పించకపోవడంతో కూలీలకు ఇక్కట్లు తప్పలేదు. కేంద్రం ఏటా వేసవిలో వేతనదారులకు నీడ కోసం టెంట్లు, మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆ సౌకర్యాలు కల్పించడం లేదు. కూలీలు తాటి, కొబ్బరి కమ్మలు తెచ్చుకుని సేద తీరుతున్నారు.

**వేసవి భృతి రద్దు**



గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసే వారికి ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం చొప్పున భృతి ఇచ్చేవారు. మజ్జిగ సరఫరా చేసేవారు. తాగునీటికి రూ.5, గునపానికి రూ.10, తట్టకు రూ.13 చెల్లించేవారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సౌకర్యాలను రద్దు చేయడంతో వేతనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం ఒకరోజు గరిష్ఠ వేతనం రూ.300గా ప్రకటించినా రూ.265 దాటడం లేదు.

**మట్టి తవ్వలేకపోతున్నాం..**

మూడు నెలల నుంచి వర్షాలు లేకపోవడంతో మట్టి బాగా గట్టిపడింది. తవ్వడానికి ఇబ్బందులు పడుతున్నాం. కొద్ది సేపు పని చేసినా అలసిపోతున్నాం. తాటి, కొబ్బరి కమ్మలు తెచ్చుకుని సేద తీరుతున్నాం. వేతనం ఆశించిన స్థాయిలో రావడం లేదు. వేసవి భృతి ఇస్తే ప్రోత్సాహకంగా ఉంటుంది. చలపరాయి పొట్టమ్మ, ఉపాధి కూలీ, డొంకూరు, ఇచ్ఛాపురం మండలం

**ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నాం..**

పని ప్రదేశాల్లో పరదాలు కట్టి కూలీలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ప్రస్తుతానికి వేసవి భృతి అందించే అవకాశం లేదు. బి.సుధాకర్, పీడీ, డ్వామా, శ్రీకాకుళం

# 'తల'కెక్కించు కోవాల్సిందే..!




విశాఖపట్నం : వెంకోజీపాలెంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకోజీపాలెం నుంచి ఇసుకతోట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి ఆంజనేయస్వామి ఆలయం ఎదుట మలుపు వద్ద అదుపు తప్పి కింద పడిపోయాడు. శిరస్త్రాణం ధరించకపోవడంతో తలకు గాయమై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు.

రహదారి ప్రమాదాల్లో నిత్యం పలువురు చోదకులు మృత్యువాత పడుతున్నారు. వీరిలో అధికశాతం శిరస్త్రాణం ధరించలేదని పోలీసులు గుర్తించారు. ఈ పరిస్థితి నివారణకు నూతన మోటారు వాహన చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ద్విచక్రవాహనంపై వెళ్లే ఇద్దరూ తప్పని సరిగా శిరస్త్రాణం ధరించాలని కొత్త చట్టం చెబుతోంది. ధరించకుంటే గతంలో రూ.100 జరిమానా విధించేవారు. కొత్త చట్టం ప్రకారం అది రూ.1000కు పెరిగింది. ఇదే కాకుండా మిగిలిన అంశాల్లోనూ భారీగా జరిమానాలు పెంచారు.

**నిబంధనలకు మరింత పదును**

ద్విచక్ర వాహనం కొనుగోలు చేసే సమయంలో యజమాని తప్పనిసరిగా శిరస్త్రాణం కొనుగోలు చేయాలనే నిబంధన ఉంది. అలా అయితేనే వాహనం రిజిస్ట్రేషన్ చేస్తారు. అయితే చోదకులు ఆ శిరస్త్రాణాన్ని ధరించకుండా పక్కన పెడుతున్నారు. రూ.100 జరిమానే కదా అనే నిర్లక్ష్యం చాలా మందిలో కనిపిస్తోంది. భారీ జరిమానాలు విధిస్తామని ట్రాఫిక్ పోలీసులు గత ఏడాది నుంచి విస్తృతంగా ప్రచారం చేయడంతోపాటు కేసులు నమోదు చేయడంతో పరిస్థితిలో కొంత మార్పు కనిపించింది. పూర్తిస్థాయిలో మార్పు తీసుకురావడానికే నూతన మోటారు వాహన చట్టాన్ని అమల్లోకి తెచ్చారు.

**శిరస్సుకు దెబ్బ తగలకుండా నివారణ**

పోలీసు కేసుల నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశంతో చాలా మంది చోదకులు శిరస్త్రాణాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే వాటిల్లో నాణ్యత ఉండడం లేదు. ఫలితంగా ప్రమాదాలు జరిగినప్పుడు అవి తలకు రక్షణ కల్పించలేకపోతున్నాయి. తలకు గాయమైతే మెదడుపై తీవ్ర ప్రభావం పడుతోంది. కొద్దిసేపు స్పృహ కోల్పోవడం, తలనొప్పి, అయోమయం, దృష్టి మందగించడం, చెవిలో హోరున శబ్దం, రుచి తెలియకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గడం, దృష్టి కేంద్రీకరించలేకపోవడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. అందుకే ఐ.ఎస్.ఐ. మార్కు ఉన్న శిరస్త్రాణం కొనుగోలు చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.

# పైనుంచొస్తాయ్.. నక్కినా పని పడతాయ్!



పీఎంపాలెం : చోరీ చేసి చాకచక్యంగా పారిపోతున్నాం... నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం, గంజాయి తాగుతున్నాం... ఇక మమ్మల్ని పోలీసులు గుర్తించలేరని భ్రమ పడే రోజులు పోయాయి. ఏకంగా నింగి నుంచే నిఘా పెడుతున్నారు. ఆకాశంలో డ్రోన్ ఎగురవేసి నిర్దేశించిన ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు 'క్లౌడ్ పెట్రోలింగ్' దిశగా అడుగులు వేస్తున్నారు. కాలానికి తగ్గట్టుగా నేరాల నియంత్రణకు సరికొత్త పద్ధతులు అవలంభిస్తున్నారు.

నిర్మానుష్య ప్రాంతాలే లక్ష్యంగా: నగరంలో విశాల తీర ప్రాంతంలో పచ్చని కొండలు విస్తరించి ఉండడంతో నిర్మానుష్య ప్రదేశాలకూ కొదవ లేదు. దీంతో గంజాయి, మద్యంతాగే వారి కార్యకలాపాలకు అవి నిలయంగా మారుతున్నాయి. ఇటీవల బీచ్‌రోడ్డు, ఐటీహిల్స్, బీఆర్‌టీఎస్ రోడ్లపై బైక్ రేసింగ్‌లు ఎక్కువయ్యాయి. యువత రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వారిని అరికట్టేందుకు పోలీసులు ఎంత నిఘా పెట్టినా పూర్తి స్థాయిలో నియంత్రణ సాధ్యపడటం లేదు. దీంతో 'క్లౌడ్ పెట్రోలింగ్' పేరుతో డ్రోన్ కెమెరాలను రంగంలోకి దింపుతున్నారు.లైవ్‌లో చూస్తూ పోలీసులు అక్కడ పరిస్థితులను అంచనా వేస్తారు.అనుమానం వస్తే వెంటనే సమీప పోలీసు బృందాలను అప్రమత్తం చేస్తున్నారు.

**నార్త్‌జోన్‌లో ప్రయోగాత్మకంగా...:** నగర పోలీసు కమిషనరేట్ పరిధి నార్త్‌జోన్‌లో డ్రోన్ కెమెరాలతో గస్తీ చర్యలకు రెండు రోజుల క్రితం పోలీసులు శ్రీకారం చుట్టారు. పీఎంపాలెం పోలీసుల ఆధ్వర్యంలో రుషికొండ ఐటీసెజ్‌లోని మూడు కొండలు, పరిసర ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేసి చిత్రాలు, వీడియోలు తీశారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకూ ఇవి దోహదపడనున్నాయి.

**డ్రోన్లతో నిశిత గస్తీ..**

బీచ్‌రోడ్డు, ఐటీహిల్స్ ప్రాంతాల్లో సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో డ్రోన్ కెమెరాలతో గస్తీ చర్యలు అమలు చేస్తున్నాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించేందుకు 'క్లౌడ్ పెట్రోలింగ్'కు శ్రీకారం చుట్టాం. అనుమానం వచ్చిన ప్రాంతంలో డ్రోన్లను వినియోగించి నిందితులను పట్టుకుంటాం. బైక్ రేసింగ్‌లు, వేగంతో దూసుకెళ్లే వాహనదారులపై కేసులు నమోదు చేస్తాం. అన్ని ముఖ్యమైన కూడళ్లు, ప్రదేశాల్లో సీసీ కెమెరాలు పెట్టాం.
ఎస్.అప్పలరాజు, ఏసీపీ, నార్త్‌జోన్

# నదీమతల్లికి గర్భశోకం..!



రాజమహేంద్రవరం : గోదావరి నది.. ఉత్తరాంధ్ర ప్రజలకు పరమ పూజ్యం.. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు మాతృ సమానం. అలాంటి ఉత్కృష్టమైన జీవనదీ గర్భంలో అడుగడుగునా అగాధాలు అధ్వానంగా మారాయి. ఇసుక తవ్వకాల మాటున ఇష్టారాజ్యంగా కబళిస్తుండటంతో సమస్య ఏర్పడుతోంది. డ్రెడ్జింగ్ బోట్లతో తవ్వేయడమే ఇందుకు ప్రధాన కారణమైంది. అధికారులు దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నా ఆగని దుస్థితి. రెండు నెలల క్రితం కూడా రోడ్డు కం రైలు వంతెన పిల్లర్ల వద్ద తెల్లవారుజామున డ్రెడ్జింగ్ చేస్తున్న 18 బోట్లను అధికారులు దాడులు సీజ్ చేశారు. ఈ తరహా తవ్వకంతో వంతెన ఉనికికే ప్రమాదమని స్పష్టం చేశారు. అంతకు ముందు కోటిలింగాల రేవు సమీపంలోనూ కలెక్టర్ పరిశీలనలో పట్టుకోవడం విదితమే. ఈ సందర్భంలోనూ నాలుగు బోట్లు సీజ్ చేశారు. గతంలో కాతేరు కేంద్రంగా గామన్ వంతెన వద్ద డ్రెడ్జింగ్ తవ్వకాల వల్ల వంతెన బేరింగ్ వంగి పోయి.. కొన్ని రోజులు ఓవైపు మాత్రమే రాకపోకలకు అనుమతులు ఇచ్చిన పరిస్థితి ఉంది. ఇంత జరుగుతున్నా ఈ విషయంలో శాశ్వత పరిష్కారం కరవవడంతో నది నిండా అగాధాలు, నదిపై బోట్ల మీద ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయి.

**ఇదీ పరిస్థితి** సాధారణంగా కార్మికులు నావలపై గోదావరిలోకి వెళ్లి కేటాయించిన స్థలంలో ఇసుకను సేకరిస్తారు. ఈ విధానం నదీ సమతుల్యతకు ప్రమాదకరం కాదు. కానీ డ్రెడ్జింగ్ విధానంలో యంత్రాల సాయంతో కార్మికుల అవసరం లేకుండా ఒక్కో చోట 40 నుంచి 70 అడుగుల వరకూ తవ్వుతుండటం సమస్యగా మారుతోంది. అవి అగాధాలుగా ఏళ్ల తరబడి ఉండిపోయి.. ఏటా వరదలు వచ్చినా ఇసుకతో పూడని దుస్థితి. ఫలితం.. నదిలో సుడిగుండాలకు అవకాశమేర్పడుతోందన్నది నిపుణుల మాట. ఆ సమయంలో పడవలపై ప్రయాణం చేస్తే ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోంది. తాజాగా జరిగిన ప్రమాదం కూడా రాత్రి పూట పిల్లర్ వద్ద అగాధం తెలియకపోవడంతో బోటు అదుపు తప్పినట్లు స్పష్టమవుతోంది. **వంతెనలకు ప్రమాదం**

గామన్ వంతెన మరమ్మతులకు గురైన సందర్భంలో పరిశీలించిన అధికారులకు అనేక విషయాలు అవగతమయ్యాయి. రోడ్డు కం రైలు వంతెన నాణ్యత విషయంలోనూ రైల్వే అధికారులు నదీగర్భంలో ఇసుక తవ్వకాల వ్యవహారంపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. మొత్తంగా ఇక్కడ నదీ సమతుల్యతపై జలవనరులశాఖ యంత్రాంగం ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇసుక ఎక్కడ తవ్వాలనేది ఇరిగేషన్ అధికారులు నిర్ణయిస్తారు కాబట్టి ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. నిబంధనలు తుంగలో తొక్కి ఇసుక మాఫియా చెలరేగిపోతున్న క్రమంలో పోలీసులు, రెవెన్యూ, మైన్స్ యంత్రాంగం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నదీ తీర ప్రాంతం ధవళేశ్వరం, కోటిలింగాల రేవులు, కాతేరు రేవుల వద్ద ఇష్టానుసారంగా డ్రెడ్జింగ్ జరుగుతున్న క్రమంలో కట్టడికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. సుమారు 2వేల కుటుంబాలు గోదావరి ఇసుక తరలింపుపై ఆధారపడి జీవనం సాగిస్తుండగా.. ఈ డ్రెడ్జింగ్ వల్ల వారి బతుకులు రోడ్డున పడేలా పరిస్థితులు నెలకొంటున్నాయి. పర్యాటక శాఖ పరిధిలో బోట్లు తిరుగుతుండగా, నిబంధనల అమల్లో నిర్లక్ష్యం రాజ్యమేలుతుండటం.. లైఫ్ జాకెట్లు వంటి కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది.

# బడుగులకు అ'ధనం'..!

శ్రీకాకుళం: పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను వైకాపా ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. పెరిగిన ధరలతో చాలా మంది లబ్ధిదారులు ఆర్థిక భారంతో కుదేలయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఆయా నిర్మాణాలపై దృష్టి సారించింది. ప్రణాళిక ప్రకారం దశల వారీగా బడుగుల సొంతింటి కల నిజం చేయాలనే లక్ష్యంతో ఎస్సీ, ఎస్టీ, చేనేత కార్మికులకు అదనంగా నిధులు మంజూరు చేయనుంది.

**50 శాతం మందికి లబ్ధి**

వైకాపా పాలనలో ఇళ్లు మంజూరై వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు అదనపు సొమ్ము ఇవ్వాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీలకు రూ.50 వేలు, చేనేత కార్మికులకు రూ.50 వేలు మంజూరు చేయనుంది. మే నెలాఖరు నాటికి నిర్మాణాలు



పూర్తి చేసేలా లక్ష్యం విధించారు. జిల్లాలో 29,530 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో 50 శాతం గడువులోగా పూర్తి చేసేలా అదనపు సాయం మంజూరుకు సన్నాహాలు చేస్తున్నారు.

వైకాపా పాలనలో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసేవారు. కూటమి ప్రభుత్వం ఎస్టీలకు రూ.3.25 లక్షలు, ఎస్సీలు, చేనేత కార్మికులకు రూ.3 లక్షలు, ఇతరులకు రూ.2.50 లక్షలు అందజేయనుంది.

**నిధులు మంజూరుకు అవకాశం..**

ఇళ్లు నిర్మిస్తున్న ఎస్సీ, ఎస్టీ, చేనేత కార్మికులకు ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. ఆయా వర్గాల లబ్ధిదారులకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపాం. అదనపు సాయం విడుదలైతే మధ్యలో నిలిచిన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. నగేశ్, ప్రాజెక్టు డైరెక్టర్, గృహ నిర్మాణ సంస్థ, శ్రీకాకుళం

# కొలిక్కిరాని నాడు-నేడు

రణస్థలం : రణస్థలం మండలం నారువ ఉన్నత పాఠశాలలో మూడు నుంచి పదో తరగతి వరకు 146 మంది విద్యార్థులున్నారు. ఏడు గదులుండగా ఒకదాంట్లో సిమెంటు నిల్వ చేశారు. మరొకటి సిబ్బందికి కేటాయించారు. మిగిలిన వాటిలో తరగతులు నిర్వహిస్తున్నారు. మూడు గదుల నిర్మాణం స్తంభాల స్థాయిలో నిలిచిపోయింది. ఇనుము, ఇతర సామగ్రి దెబ్బతింటున్నాయి. బోధన పరికరాలు వరండాలో ఉంచి తరగతులు నిర్వహిస్తున్నారు.

పాతర్లపల్లి ఉన్నత పాఠశాలలో 470 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ ఐదు గదుల నిర్మాణం చేపట్టినా అసంపూర్తిగా ఉంది. జేఆర్‌పురం ఉన్నత పాఠశాలలో ఆరు గదుల నిర్మాణం సగంలో వదిలేశారు. ఇక్కడ సుమారు 700 మంది విద్యార్థులు చదువుతున్నారు.

వైకాపా పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆయా బడుల్లో వసతి సమస్య, సౌకర్యాల లేమి నెలకొంది. నిర్మాణ సామగ్రి, బోధనా పరికరాలను వినియోగించక దెబ్బతింటున్నాయి. కొన్నిచోట్ల గుర్తు తెలియని వ్యక్తులు కాజేస్తున్నారు.



ప్రజాధనం పెద్దఎత్తున దుర్వినియోగమవుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో రెండో విడతలో 1,054 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.416.89 కోట్లు మంజూరు చేశారు. భవన నిర్మాణం, ఇతర పనులకు రూ.166.57 కోట్లు ఖర్చు చేశారు. విద్యుద్దీకరణ, తలుపుల ఏర్పాటు, బోధన సామగ్రికి రూ.90.11 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన నిధులు రావాల్సి ఉంది. అన్ని పాఠశాలల్లోనూ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. 38 జూనియర్ కళాశాలలకు రూ.28.45 కోట్లు మంజూరు చేశారు. రూ.14 కోట్లు విడుదల చేశారు. రూ.13.45 కోట్లు ఖర్చు చేశారు.

నిధులు రాగానే పూర్తి చేస్తాం.. నాడు-నేడు రెండో విడతలో మంజూరైన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. నిధులు విడుదల కావాల్సి ఉంది. ప్రభుత్వం అనుమతించగానే ప్రారంభిస్తాం. శశిభూషణరావు, ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా, శ్రీకాకుళం

# నిధులు ఎత్తిపోయాల్సిందే

కర్నూలు : బీడు భూములను సస్యశ్యామలం చేసే ఉద్దేశంతో గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల వద్ద ఎత్తిపోతల పథకాలు ఏర్పాటుచేసింది. వీటిని సమర్థంగా నిర్వహించడంతోపాటు వేలాది ఎకరాలకు సాగు నీరు అందించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేసింది. పథకాల నిర్వహణను గాలికొదిలేయడంతోపాటు విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు. ఫలితంగా ఈ భారమంతా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై పడింది. **హంద్రీనీవా పరిధిలో రూ.2,302 కోట్లు**

హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలోని మల్యాల వద్ద ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్తు బిల్లులు భారీగా పేరుకుపోయాయి. ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు రూ.17 కోట్ల నుంచి రూ.18 కోట్లు ఖర్చవుతుందని ఇంజినీర్లు చెబుతున్నారు. మల్యాల నుంచి ఏడు ఎత్తిపోతల పథకాల (పంపింగ్ స్టేషన్లు) ద్వారా అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు నీటిని తరలిస్తారు. ఏటా 22 నుంచి 25 టీఎంసీల వరకు నీటిని ఎత్తి పోయడం ద్వారా రూ.450 కోట్ల వరకు విద్యుత్తు భారం పడుతుంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.2,902 కోట్ల మేర విద్యుత్తు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందులో ఒకసారి రూ.600 కోట్లు మాత్రమే చెల్లించింది. మిగిలిన రూ.2,302 కోట్ల బిల్లులు పెండింగులో పెట్టింది. ప్రస్తుతం ఆ భారమంతా కూటమి ప్రభుత్వంపై పడింది.

**నిర్వహణ అటకెక్కించి..:** ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి రూ.13 కోట్లు, గురురాఘవేంద్ర.. రూ.129 కోట్లు, సిద్ధాపురం.. రూ.73 కోట్లతోపాటు మిగిలిన 78 ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రూ.79 కోట్ల మేర విద్యుత్తు బకాయిలు ఉన్నాయి. ఇలా హంద్రీనీవా పరిధిలో రూ.2,302 కోట్లు, మిగిలిన ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రూ.294 కోట్లు కలిపి మొత్తం రూ.2,596 కోట్ల విద్యుత్తు బకాయిలు ఉండటం గమనార్హం. : ఉమ్మడి కర్నూలు జిల్లాలో 78 ఎత్తిపోతల పథకాల ద్వారా 56 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉంది. ప్రధానంగా తుంగభద్ర, శ్రీశైలం వెనుక జలాలు, కుందూ నదిపై ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయకట్టుకు నీరందుతోంది.

చురకలు



# 33 అడుగులకు నర్సీపట్నం రోడ్డు

నర్సీపట్నం : నర్సీపట్నం పురపాలికలోని పెదబొడ్డేపల్లి కూడలి నుంచి మాకవరపాలెం మీదుగా తాళ్లపాలెం కూడలి వరకు ప్రస్తుతమున్న 25 అడుగుల రోడ్డును 33 అడుగులకు విస్తరించాలని యోచిస్తున్నారు. శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు రూ. 50 కోట్ల ఖర్చు అంచనాతో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇటీవల కాలంలో ఈ రహదారిలో వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. మాకవరపాలెం మండలం రామన్నపాలెం సమీపం నుంచి తాళ్లపాలెం వరకు పయనీర్ కంపెనీకి నిత్యం 200 నుంచి 300 వరకు లారీలు వచ్చి వెళుతుంటాయి. ఇవి సామర్థ్యానికి మించిన లోడుతో వస్తుంటాయి. అధిక బరువు వల్ల రోడ్డు పాడవుతున్నాయి. ప్రమాదాలు పెరుగుతున్నాయి. కొద్ది వారాల క్రితం మాకవరపాలెం మండలానికి చెందిన పలు గ్రామాల వారు పయనీర్ కంపెనీ నుంచి వచ్చే లారీలను అడ్డుకోవడం తెలిసిందే. రోజుల తరబడి ఆందోళన కొనసాగడంతో అధికారులు వచ్చి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. రోడ్డు విస్తరించాల్సిందేనని ప్రజలంతా డిమాండ్ చేయడంతో ఈ దిశగా దృష్టిసారిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. తక్షణ పరిష్కారంగా రామన్నపాలెం నుంచి తాళ్లపాలెం వరకు రహదారికి ఇరువైపులా ఆర్అండ్బీ స్థలం వరకు రోడ్డు అంచుల వెంబడి తుప్పలు నరికించారు. అడ్డుగా ఉన్న కొన్ని



చెట్లను తొలగించారు. ఇప్పుడు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఈ రోడ్డు అభివృద్ధిని పూర్తిగా వదిలేశారు. పలుచోట్ల గోతులమయమై ప్రమాదాలు జరుగుతుండేవి. కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చాక ఈ రోడ్డులో గోతులు పూడ్చారు. దీంతోపాటు నర్సీపట్నం నియోజకవర్గంలోని మరో రెండు రోడ్లు విస్తరించేందుకు ప్రతిపాదించారు. మాకవరపాలెం మండలం రాచపల్లి నుంచి కోడూరు మీదుగా కోటవురట్ల మండలం కైలాసపట్నం వరకు ప్రస్తుతమున్న 12 అడుగుల రోడ్డును 23 అడుగులకు విస్తరించేందుకు రూ. 21 కోట్లు, మాకవరపాలెం మండలం గిడుతూరు నుంచి కోటవురట్ల వరకు ప్రస్తుతమున్న 12 అడుగుల రోడ్డును 23 అడుగులకు విస్తరించేందుకు రూ.22 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రతిపాదించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే పనులు మొదలవుతాయి.

# అవస్థలు అరి'కడ'తారా?

సోంపేట: ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రధాన వనరు పైడిగాం ప్రాజెక్టు ఆధునికీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయం సూచనల మేరకు జలవనరుల శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో సమస్యలు పరిష్కారమవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆనకట్ట, ప్రధాన కాలువ, ఇతర నిర్మాణాల పరంగా నెలకొన్న ఇబ్బందులతో మహేంద్రతనయ నదికి పెద్దఎత్తున వరద చేరినా పంట పొలాలకు అందడం లేదు. ఈ అంశాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**అన్నదాతల సూచనలు**

నది నుంచి కాలువకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగేలా ప్రధాన కాలువ 2.2 కి.మీ., లేదా 3.2 కి.మీ. వద్ద ఆనకట్ట నిర్మించాలి. ఒడిశా నుంచి నీటి లభ్యత పూర్తిగా తగ్గిపోవడంతో మహేంద్రగిరుల నుంచి వచ్చే వరద నీటిని నిల్వ చేసి కాలువలోకి మళ్లించేందుకు వీలుగా హంసమోర వద్ద మినీ జలాశయం నిర్మిస్తే ప్రయోజనం ఉ



ంటుంది. ప్రధాన కాలువ ఆనకట్ట, స్లూయిజ్లు, ఇతర నిర్మాణాల లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. ప్రాజెక్టు ఆధారిత 69 చెరువులను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటే ఖరీఫ్, రబీలో సాగుకు ఇబ్బంది ఉండదు.

ప్రాజెక్టు స్వరూపం

ఆయకట్టు, ఆధారిత భూమి: 10 వేల ఎకరాలు

ప్రధాన కాలువ పొడవు: 16.5 కి.మీ

పిల్ల కాలువలు 11బీ వాటి విస్తీర్ణం 33 కి.మీ.

నిర్మాణ సమయంలో సాగునీటి లభ్యత: 185 క్యూసెక్కులు

అందుబాటులో ఉన్న జలాలు: 40 క్యూసెక్కులు

అనుమతులు రాగానే పనులు చేపడతాం..

పైడిగాం ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.38 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రధాన కాలువ మిగిలిన భాగాల లైనింగ్, ఆనకట్ట పనులు, ఇతర నిర్మాణాలు చేపడతాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కార్యాచరణ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.జీవీ రమణ, డీఈఈ, జలవనరుల శాఖ

# జీవనాడికి 'జల'సత్వాలు



అనంతపురం : గత ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువకు(టీబీ హెచ్చెల్సీ) శాశ్వత మరమ్మతులు చేసేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. నీటి ప్రవాహం సాఫీగా సాగేలా రూ. 34.95 కోట్లు అంచనాతో 10 పనులు చేపట్టడానికి ఉపక్రమించింది. 2024–25 నీటి సీజన్ మూడు రోజుల కిందటే ముగియడంతో మరమ్మతు పనులు వేగంగా చేపట్టేలా టెండర్లను సైతం ఖరారు చేశారు. ఎంపికైన ఇద్దరు గుత్తేదారులకు పనుల అప్పగింత(వర్క్ ఆర్డర్) ఉత్తర్వులను జిల్లా జలవనరుల శాఖ సీఈ నాగరాజు, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ జారీ చేశారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ, కృషి ఫలితంగా ఈ పనులకు శ్రీకారం చుడుతున్నారు.

**రూ.26.25 కోట్లకు ఒప్పందం**

హెచ్చెల్సీ ప్రధాన కాలువ జిల్లా సరిహద్దు 105 కి.మీ. నుంచి 189 కి.మీ. దాకా కొనసాగుతుంది. మొత్తం 84 కి.మీ. పొడవు ఉంది. ఈ ప్రధాన కాలువ అనేక చోట్లా శిథిలావస్థకు చేరింది. డబుల్, సింగిల్ రోడ్ల వంతెనలు సైతం కుప్పకూలిపోయాయి. 2,600 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్నా.. కాలువ అధ్వానంగా ఉండటంతో 2,000 క్యూసెక్కులకు మించి తీసుకోలేని దుస్థితి. వీటన్నిటిని గ్రహించిన కూటమి ప్రభుత్వం ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్లో నిర్దేశిత నిధులు కేటాయించడం విశేషం. ఐదు డబుల్ లైన్ రోడ్డు వంతెనల నిర్మాణానికి రూ. 8.49 కోట్ల అంచనా పనులను అనంతకు చెందిన వెంకటరమణ నిర్మాణ సంస్థకు రూ. 6.24 కోట్లకు, అవుట్ఫాల్ రెగ్యులేటర్, అండర్టన్నెల్ (యూటీ) పీఏబీఆర్ అవుట్ఫాల్ వంతెన, ఎంపీఆర్ అవుట్ఫాల్ వంతెన, 115–130 కి.మీ. మధ్యన లైనింగ్ పనులు చేసేందుకు రూ. 26.46 కోట్ల అంచనా పనులను బళ్లారికి చెందిన శ్రీనివాస్ నిర్మాణ సంస్థకు రూ. 20.01 కోట్లకు అప్పగించారు. అతి త్వరలో ఈ పనులు ప్రారంభిస్తారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నీటి సీజన్ ముగియడంతో మరమ్మతులకు శ్రీకారం చుడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈదఫా ఆశించిన దాని కంటే ఎక్కువ జలాలు జిల్లాకు చేరడం ప్రస్తావనార్హం. ఈ నీటి సీజన్లో మొత్తం 33.780 టీఎంసీలు టీబీ డ్యాం వద్ద విడుదల చేయగా.. జిల్లా సరిహద్దుకు 29.626 టీఎంసీలు చేరాయి. ఇందులో తాగునీటికి 8.278 టీఎంసీలు, ఆయకట్టుకు 13.791, జలాశయాల్లో నిల్వ 4.214, వృథా రూపంలో 3.342 టీఎంసీల మేర ఖర్చు అయ్యాయి.

**జులై నాటికి పూర్తి చేస్తాం**రాజశేఖర్, ఎస్ఈ, హెచ్చెల్సీ

రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో నిధుల కేటాయింపు, టెండర్ల ఖరారు.. వంటి పనులు వేగంగా పూర్తి అయ్యాయి. వచ్చే జులై నాటికి పది పనులు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ, పరిశీలన కొనసాగిస్తాం. వచ్చే నీటి సీజన్లో 2,500 క్యూసెక్కులకు తక్కువ కాకుండా తీసుకునేలా కాలువను పటిష్ఠం చేస్తాం.

# యువత ఉపాధికి బాసట.. రైతుకు ఊరట



అనంతపురం : వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ల వినియోగం క్రమంగా పెరుగుతోంది. వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటల్లో తెగుళ్లు, చీడపీడల నివారణకు మందుల పిచికారీకి డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో డ్రోన్లతో పలువురు యువకులు స్వయం ఉపాధి పొందుతుండగా.. పంటలకు పురుగు మందుల పిచికారీలో రైతులు ఊరట చెందుతున్నారు. రోజుల తరబడి చేసుకొనే పనులను నిమిషాలు, గంటల వ్యవధిలో పూర్తి చేస్తున్నారు.

**డబ్బు, సమయం ఆదా**

సాధారణంగా రైతులు స్ప్రేయర్తో పురుగు మందు పిచికారీ చేయాలంటే చాలా సమయం పట్టేది. కూలీలు, స్ప్రేయరు అద్దె, పెట్రోలు ఖర్చు కింద వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చేది. కూలీ రూ. 500, టిఫిన్ ఇతరత్రా ఖర్చులకు ఒక్కొక్కరికి రూ. 650 వరకు వ్యయం అయ్యేది. డ్రోన్తో కూలీలు, ఖర్చుల బెడద తప్పింది. మందు పిచికారీకి ఎకరాకు ఐదు నిమిషాలు సరిపోతుంది. ఎకరా విస్తీర్ణంలో వరికి రూ. 350, మిరపకు రూ. 400 లెక్కన అద్దె చెల్లిస్తున్నారు. సమయంతో పాటు సొమ్ము ఆదా చేసుకొంటున్నారు. డ్రోన్తో పిచికారీ చేసే పురుగు మందు పైరు మొదళ్ల వరకు చేరుతుండటంతో తెగుళ్లు, చీడపీడల నియంత్రణ సులభతరమై ఆశాజనక దిగుబడి సాధిస్తున్నారు.

**ఉపాధికి ఊతం :** డ్రోన్, బ్యాటరీ కొనుగోలు, నిర్వహణకు రూ. 10–15 లక్షల వరకు సొమ్ము వ్యయం చేయాల్సి వస్తోంది. ఇది రైతులకు భారం కావడంతో ఆసక్తి గల యువకులు డ్రోన్ అందుకు అవసరమైన బ్యాటరీలు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతున్నారు. ఎక్కువ మంది స్వయం ఉపాధి పొందేలా రాయితీ కింద బ్యాంకు రుణాల ద్వారా డ్రోన్ల సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యువకులు కోరుతున్నారు.

శ్రమ తగ్గింది హేమారెడ్డి, రైతు

ఐదెకరాల్లో వరి పైరుకు డ్రోన్తో మందు పిచికారీ చేశా. అరగంటలో పని పూర్తయ్యింది. సమయంతో పాటు ఖర్చు తగ్గింది. రైతులకు ప్రభుత్వం రాయితీపై డ్రోన్లు అందించాలి.

**ప్రతి నెలా రూ.30 వేల వరకు ఆదాయం**

రూ. 10 లక్షల దాకా వెచ్చించి డ్రోన్, బ్యాటరీలు కొనుగోలు చేశా. మిరప, వరి పంటలకు మందులు పిచికారీ చేస్తూ అద్దె రూపేణా ఆదాయం పొందుతున్నా. ఖర్చులుపోనూ సగటున నెలకు రూ. 30 వేల వరకు సంపాదిస్తున్నా.జగన్నాథ, యర్రగుంట

# ఉచిత వ్యూహం.. అంతా అనూహ్యం!!



విశాఖపట్నం : హైదరాబాద్కు చెందిన ఓ విద్యా సంస్థకు వైకాపా ప్రభుత్వ హయాంలో అగనంపూడిలో 16.17 ఎకరాలు ఉచితంగా కేటాయించింది. విద్యారంగానికి చేయూత ఇచ్చే నిర్ణయమే అయినా...తెర వెనక సాగిన వ్యవహారాలు అనుమానాలు రేపుతున్నాయి. 2023లో భూ కేటాయింపు చేస్తూ రహస్య జీవో విడుదలయింది. ఆ స్థలాన్ని వ్యూహాత్మకంగా కట్టబెట్టడం వెనుక కొందరికి భారీగా లబ్ధి చేకూరిందన్న ఆరోపణలున్నాయి. ఇందులో కీలక నేతలతో పాటు ప్రభుత్వ అధికారుల హస్తం ఉందని సమాచారం. విలువైన ఆ స్థలాన్ని ఉచితంగా అప్పగించడంలో ఓ ఉన్నతాధికారి, మండలాధికారి కీలకంగా వ్యవహరించారనే చర్చ సాగుతోంది. బహిరంగ మార్కెట్లో రూ.వందల కోట్లు విలువ చేసే ఆ భూములను ఎలా కట్టబెట్టారన్న అంశంపై కూటమి ప్రభుత్వం ఆరాతీస్తున్నట్లు సమాచారం.

**నివేదికలు కాదని:** ఎకరా రూ. 1.8 కోట్లకు కేటాయించొచ్చని నాడు కలెక్టరు నుంచి నివేదిక వెళ్లింది. దాన్ని భూపరిపాలనశాఖకు పంపగా రూ. 34 కోట్లు చెల్లించాలని సూచించారు. అయితే జిల్లా ప్రతిపాదనలు, సీసీఎల్ఏ నిర్ణయాలు పక్కన పెట్టేశారు. భూమి ఉచితంగా కేటాయించేలా దస్త్రాలు నడిచాయి. విద్యాహక్కు చట్టం కింద 25 శాతం సీట్లు, స్థానికులకు మరో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తామని పేర్కొనగా...పరిశీలించిన ప్రభుత్వం ఉచితంగా కేటాయిస్తూ జీవో ఇచ్చింది. వాస్తవానికి విద్యాహక్కు చట్టం కింద కొన్ని సీట్లు తప్పక కేటాయించాలి. ఉచిత సీట్ల పేరుతో దస్త్రం నడిపించి తెరవెనుక కొందరు భారీగా లబ్ధి పొందినట్లు సమాచారం.

**వివాదాస్పద భూములైనా:** అగనంపూడిలో ఓ భూస్వామికి చెందిన 30 ఎకరాలు భూ పరిమితి చట్టం ప్రకారం 1975–76లో ప్రభుత్వానికి దక్కాయి. ఈ భూముల్లో కొందరు రైతులకు ప్రభుత్వం డీపట్టాలు ఇచ్చింది. కొంతకాలం తర్వాత లక్ష్యానికి విరుద్ధంగా వినియోగిస్తున్నారని పట్టాలను రద్దు చేశారు. అనంతరం రైతులు కోర్టును ఆశ్రయించగా అవకాశం ఇవ్వాలని చెప్పడంతో మళ్లీ వారికే అప్పగించారు. రైతులు మళ్లీ ఆ భూములను దుర్వినియోగం చేశారు. దీంతో ఆ పట్టాలను ప్రభుత్వం రద్దు చేసింది. 1990లో కొందరు ఈ భూముల్లో పదెకరాలు తమవని పత్రాలు సృష్టించారు. అప్పటి ఆర్డీవో కోర్టులో వాటిని కొట్టేశారు. ఆ తర్వాత హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లినా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు వచ్చాయి. 2023లో ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకుంది. విద్యా సంస్థకు అప్పగించడం గమనార్హం.

# కౌలు రైతులకు తీపి కబురు

కాకినాడ : వ్యవసాయంలో 90 శాతం వాటా కౌలు రైతులదే. అలాంటి కౌలు రైతులకు అటు ప్రభుత్వ పరంగా, ఇటు బ్యాంకుల నుంచి తగిన ప్రోత్సాహం అందడం లేదు. దాంతో పంటల సాగుకు పెట్టుబడులకోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వపరమైన రాయితీలు అందాలంటే సవాలక్ష ఆటంకాలు ఎదురువుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రభుత్వ ప్రకటన కౌలురైతులకు ఊరటనిస్తోంది. ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో సీఎం చంద్రబాబు మే నెలలో రైతులకు 'అన్నదాతా సుఖీభవ' అమలు చేస్తామని ప్రకటించారు. బుధవారం అసెంబ్లీలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కౌలు రైతులకూ 'అన్నదాతా సుఖీభవ' అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఆరుగాలం శ్రమిస్తున్న కౌలు రైతులకు ఏటేటా ఏదో ఒక రూపంలో నష్టాలు తప్పటం లేదు. ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలతో రైతులు పంట నష్టాలు చవిచూస్తున్నారు. కొన్ని సార్లు పండిన పంటకు



గిట్టుబాటు ధర లభించకా ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వ రాయితీలు పొందేందుకు సాగు అర్హత(సీసీఆర్సీ) కార్డులు అవరోధంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వాలు ఇచ్చే పెట్టుబడి రాయితీ, బ్యాంకు రుణాలు, ఇతర పథకాలు పొందేందుకు సీసీఆర్ కార్డులు తప్పనిసరి. ఇవి పొందాలంటే భూయజమాని కౌలు రైతుకు సహకరించాలి. ఇందుకు కావాల్సిన పత్రాలను భూయజమానులు ఇవ్వకపోవటంతో అధిక శాతం కౌలు రైతులు సీసీఆర్ కార్డులు పొందలేకపోతున్నారు. ఫలితంగా ప్రభుత్వ రాయితీలకు, బ్యాంకు రుణాలకు దూరంగా ఉంటున్నారు. పెట్టుబడుల కోసం అధిక వడ్డీలు భరించి ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ తాజా ప్రకటన కౌలు రైతులకు ఊరటనిస్తోంది. సాగు అర్హత(సీసీఆర్) కార్డులతో పనిలేకుండానే 'అన్నదాతా సుఖీభవ' పథకాన్ని అమలు చేస్తామని వ్యవసాయ మంత్రి హామీ ఇచ్చారు. ఈ–పోర్టల్లో నమోదు చేసుకున్నవారికి ఏటా రూ. 20 వేల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేసిన ప్రకటన కౌలురైతుల్లో ధీమా పెంచుతోంది. ఈ పథకం అమలుకు 2025–26 వార్షిక బడ్జెట్లో రూ. 9,400 కోట్లు కేటాయించారు.

# పేదలకు ఉపాధి భద్రత

కాకినాడ : జాతీయ ఉపాధి హామీ పథకం అమల్లో జిల్లా ముందంజలో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024–25 సంవత్సరానికి పెద్దఎత్తున ఉపాధి కల్పించడమే కాకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులకు భారీగా సామగ్రి వ్యయాన్ని కల్పించింది. చెరువుల్లో పూడికతీత, పుంతదారులు, ఫారం పాండ్స్, ఉద్యాన పంటలు వంటి వనరులను అభివృద్ధి చేస్తోంది. జిల్లాలో 20 మండలాల పరిధిలో 2024–25 సంవత్సరానికి 69 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటివరకు 69.62 లక్షల పనిదినాలు కల్పించి రికార్డు సాధించారు. ఈనెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 72 లక్షల పనిదినాలు కల్పించే అవకాశం ఉంది.

**రూ.173.85 కోట్లు వేతనాల చెల్లింపు..**

కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి కూలీల విషయంలో ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంది. పనులు చేసిన వారంలో సొమ్ము జమ చేస్తున్నారు. ఈ ఏడాదిలో గరిష్ఠంగా రోజుకు రూ. 289 చెల్లించగా, సగటున రూ. 251 ఇవ్వగలిగారు. ఇప్పటివరకు 2,30,356 మందికి పని కల్పించడం ద్వారా రూ. 173.85కోట్లు చెల్లించారు. ఇప్పటివరకు కల్పించిన పనిదినాలతో జిల్లాకు రూ. 112కోట్ల మేర మెటీరియల్ కాంపొంనెంట్(సామాగ్రి వ్యయం) సమకూరింది. దీని ద్వారా పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. ఈనెలాఖరుకు మరింత సామగ్రి వ్యయం నిధులు సమకూరే అవకాశం ఉంది. జిల్లాలో లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించగలిగామని, ఈనెలాఖరులోగా మరింత మందికి పని కల్పిస్తామని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి 'న్యూస్టుడే'కు తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యాలు నిర్దేశించి బడ్జెట్ తయారు చేస్తున్నట్లు చెప్పారు.

# అపురూప కట్టడం.. నిర్వహణ కష్టం

పి.గన్నవరం : పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదీ పాయపై ఉన్న డొక్కా సీతమ్మ అక్విడక్టు కం రోడ్డు వంతెనకు ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేయకపోవడంతో ఏళ్లతరబడి నిర్వహణ కరవైంది. దీనిద్వారా రాజోలు దీవిగా వ్యవహరించే పి.గన్నవరం మండలంలోని లంకలగన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, మానేపల్లి గ్రామాలతో పాటు మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లోని సుమారు 50 వేల ఎకరాలకు సాగు, లక్షలాది మందికి తాగునీరు అందించే సమగ్ర రక్షిత పథకాలకు ముడినీరు(రా వాటర్) చేరుతుంది. రోడ్డు రవాణా మార్గంగా ఉపకరిస్తుంది. ఇంతటి ప్రాధాన్యం గలిగిన ఈ అక్విడక్టు నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది.

ప్రధానంగా అక్విడక్టుపై ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు పుష్కర కాలంగా వెలగడం లేదు. రోడ్డు మార్గం దెబ్బతింది. ట్రఫ్ మీదున్న టోపాత్పై పూర్తిస్థాయిలో రెయిలింగ్ ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు దీపాల పునరుద్ధరణ, రోడ్డు మార్గానికి మరమ్మతులు, టోపాత్పై పూర్తిగా రెయిలింగ్ ఏర్పాటు చేసేందుకు గత వైకాపా ప్రభుత్వంలో స్థానిక జలవనరుల శాఖ డీఈఈ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ పనులు చేయాలంటే రూ.కోటి కావాలి. అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఒ.ఎన్.జి.సి. సీఎస్సార్ పనుల కింద నిధులు తీసుకొస్తామని ప్రకటించి ఆరు నెలలు దాటిపోయింది. ఇంతవరకు రాలేదు. ఇప్పటికైనా మంజూరైతే పనులు చేసేందుకు వీలుంటుంది. ముఖ్యమైన కట్టడం దృష్ట్యా ఏటా నిర్వహణ నిధులు కేటాయించేందుకు పాలకులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

**కలెక్టర్కు నివేదించాం**

డొక్కా సీతమ్మ అక్విడక్టు మరమ్మతు పనుల కోసం రూ.కోటి కావాలని స్థానిక సబ్డివిజన్ కార్యాలయం అధికారులు తెలియజేశారు. ఈ నిధులను ఒ.ఎన్.జి.సి. ద్వారా సేకరించేందుకు కలెక్టర్కు పంపాం. తప్పకుండా మంజూరవుతాయి. ఏటా నిర్వహణ నిధులు కేటాయించేలా కృషి చేస్తాను. గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్యే, పి.గన్నవరం

# కేతిక రాంగ్ టైమ్ లో అడుగుపెట్టిందా?


పూరీ జగన్నాథ్ కొడుకు పూరీ ఆకాష్ హీరోగా నటించిన రొమాంటిక్ సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కేతిక శర్మ ఆ సినిమా డిజాస్టర్ గా నిలవడంతో పెద్దగా హైప్ తెచ్చుకోలేకపోయింది. కేతిక ఇండస్ట్రీలోకి వచ్చి ఇప్పటికే నాలుగేళ్లవుతుంది. కానీ ఇప్పటివరకు అమ్మడికి సాలిడ్ హిట్ పడింది లేదు. ఇవన్నీ చూస్తుంటే కేతిక ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన టైమ్ కరెక్ట్ కాదనిపిస్తోంది. నాలుగేళ్లుగా సినిమాలు చేస్తున్నప్పటికీ ఒక్కటి కూడా సక్సెస్ ఇవ్వకపోవడమేంటని అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఆఖరికి కేతిక రీసెంట్ గా రాబిన్‌హుడ్ సినిమాలో చేసిన ఐటెమ్ సాంగ్ కూడా ఆమెకు కోరుకున్న సక్సెస్ ను ఇచ్చి, తన కెరీర్ కు బ్రేక్ ఇవ్వలేకపోయింది. రొమాంటిక్ సినిమా తర్వాత కేతిక, నాగశౌర్యతో కలిసి చేసిన లక్ష్య, వైష్ణవ్ తేజ్ తో కలిసి చేసిన రంగ రంగ వైభవంగా



కూడా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్లుగా నిలిచాయి. దీంతో తన ఆశలన్నీ ఆమె కెరీర్లోనే నటించిన బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ అయిన బ్రో సినిమాపై పెట్టుకుంటే ఆ సినిమా కూడా తన ఆశలపై నీళ్లు చల్లుతూ బాక్సాఫీస్ వద్ద ఫెయిలైంది. బ్రో సినిమా తర్వాత టాలీవుడ్ దర్శకనిర్మాతలు కేతికను పట్టించుకోవడం మానేశారు. హీరోయిన్ గా పాత్రలు తగ్గిపోవడంతో కేతిక రాబిన్‌హుడ్ లో ఐటెమ్ సాంగ్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఆ సాంగ్ చేసింది. ఆ సాంగ్ లోని కేతిక బోల్డ్ మూవ్స్ సోషల్ మీడియాలో కాంట్రవర్సీ అయినప్పటికీ, ఆ సెన్సేషనల్ సాంగ్ కూడా అమ్మడి కెరీర్ కు ఏ మాత్రం ఉపయోగపడలేకపోయింది. ప్రస్తుతం కేతికే చేతిలో ఒకే ఒక్క సినిమా ఉంది. అదే సింగిల్. శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న ఈ సినిమాతో అయినా కేతిక హిట్ అందుకుంటేనే కేతికకు తర్వాత సినిమా అవకాశాలు దక్కుతాయి. అందుకే సింగిల్ పైనే కేతిక తన ఆశలన్నింటినీ పెట్టుకుంది. మరి సింగిల్ సినిమా కేతిక ఆశలను ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి.

# సీత అడల్ట్ సిరీస్‌తో తప్పు చేస్తోందా?

కేవలం నటిగానే కాదు ఎంటర్ ప్రెన్యూర్ గాను ఆలియా భట్ ప్రణాళికలు ఆశ్చర్యపరుస్తున్నాయి. తన సంపాదనను తెలివిగా వ్యాపారంలో పెట్టుబడులు పెడుతూ భారీ లాభాల్ని ఆర్జిస్తోంది. మరోవైపు సినీనిర్మాతగాను ఆలియా విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఇంతకుముందు షారూఖ్ తో కలిసి డార్లింగ్స్ అనే చిత్రాన్ని నిర్మించింది. ఈ సినిమా విజయం సాధించింది. ఇటీవల జిగ్రా అనే చిత్రాన్ని నిర్మించినా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఆలియా ఇకపైనా



సినీనిర్మాణంలో సీరియస్ గా ముందుకు సాగుతోంది. తాజా సమాచారం మేరకు.. అలియా భట్ పూర్తిగా కొత్తవారితో అడల్ట్ వెబ్ సిరీస్‌ను నిర్మించబోతున్నట్లు సమాచారం. దీనికి ఎవరు దర్శకత్వం వహిస్తారు? అనేదానిపై స్పష్టత లేదు. అడల్ట్ సిరీస్ కథ, కాన్సెప్ట్ విన్న తర్వాత ఆలియా నో చెప్పలేకపోయారట. అయితే ఈ సిరీస్ లో బోలి కంటెంట్ ఆశ్చర్యపరుస్తుందని చెబుతున్నారు. ఆర్.ఆర్.ఆర్ లో సీతగా నటించిన ఆలియాకు సౌత్ లో ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. కానీ అందుకు విరుద్ధమైన కంటెంట్ ని ఆలియా ప్రోత్సహించడం ఆశ్చర్యకరమే. డార్లింగ్స్, జిగ్రా తర్వాత ఈ వెబ్ సిరీస్ తో నిర్మాతగా మరో అడుగు ముందుకు వేసేందుకు ప్రయత్నిస్తోంది. కానీ కంటెంట్ పరంగా ఎలాంటి విమర్శల్ని అయినా ఎదుర్కోవాల్సి ఉంటుంది. మరోవైపు ఆలియా నటిగాను తన కెరీర్ పైనా ఫోకస్ చేసింది. తదుపరి శివ్ రావైల్ దర్శకత్వం వహించిన స్పై యాక్షన్ డ్రామా ఆల్ఫాలో నటిస్తోంది. భారతీయ తెరపై లేడీ స్పై విన్యాసాలు వీక్షించేందుకు అభిమానులు ఉత్కంఠగా వేచి చూస్తున్నారు.




# “విశ్వంభర” ఫస్ట్ సింగిల్ అప్డేట్



భోళా శంకర్ డిజాస్టర్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి సినిమాల ఎంపికలో ఎంతో జాగ్రత్త వహించి బాగా టైమ్ తీసుకుని మరీ తర్వాతి సినిమాను బింబిసార ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో చేయడానికి ఒప్పుకున్నాడు. సోషియో ఫాంటసీ డ్రామాగా తెరకెక్కుతున్న విశ్వంభర సినిమాను యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్ తో రూపొందిస్తుంది. చిరూ– వశిష్ట కాంబినేషన్ లో సినిమా అనగానే అందరికీ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. దానికి తగ్గట్టే ఫస్ట్ లుక్ కూడా అందరినీ ఆకట్టుకుంది. కానీ సినిమా నుంచి వచ్చిన టీజర్ ఆడియన్స్ అంచనాలను అందుకోలేకపోయింది. టీజర్ లోని వీఎఫ్ఎక్స్ అసలు బాలేవని సోషల్ మీడియాలో విపరీతంగా కామెంట్స్ వినిపించాయి. ఈ నేపథ్యంలో సినిమా కాస్త లేట్ గా రిలీజైనా పర్లేదనుకుని మేకర్స్ సినిమాను వాయిదా వేసి వీఎఫ్ఎక్స్ వర్క్స్ బాధ్యతల్ని మరో కంపెనీకి అప్పగించి అంతా సరిచేసే ప్రయత్నం చేస్తున్నారు. విశ్వంభరను వాయిదా అయితే వేశారు కానీ మళ్లీ కొత్త రిలీజ్ డేట్ ను మాత్రం అనౌన్స్ చేసింది లేదు. ఇదిలా ఉంటే ఈ సినిమా గురించి ఇప్పుడు ఓ అప్డేట్ నెట్టింట వినిపిస్తోంది. విశ్వంభర ఫస్ట్ లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్ 12న హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వంభర నుంచి సాంగ్ ను విడుదల చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. ఆ సాంగ్ ను కృష్ణా జిల్లా నందిగామలోని పరిటాల ఆంజనేయ స్వామి గుడి వద్ద రిలీజ్ చేయాలని చూస్తున్నారట.

ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం కీరవాణి విశ్వంభరకు సంగీతం అందిస్తున్నారు. విశ్వంభరకు కీరవాణి నెక్ట్స్ లెవెల్ ట్యూన్స్ ను ఇచ్చారని, ఆడియన్స్ కు ఆ సాంగ్స్ కచ్చితంగా నచ్చడంతో ఆ సాంగ్స్ ఆడియన్స్ కు పూనకాలు తెప్పిస్తాయని ఇప్పటికే డైరెక్టర్ వశిష్ట చెప్పి పాటలపై హైప్ పెంచాడు. దీంతో ఈ సాంగ్ ఎలా ఉంటుందో అని వినడానికి మెగా ఫ్యాన్స్ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. విశ్వంభరలో చిరంజీవి సరసన త్రిష హీరోయిన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే.

# అమ్మా నాన్న స్టార్స్ ఐనా ఆమె రూటే సపరేట్



సౌత్‌తో పోల్చితే నార్త్ ఇండియాలో స్టార్ కిడ్స్ హీరోయిన్స్‌గా ఎంట్రీ ఇవ్వడం ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. సౌత్‌లో కేవలం హీరోలుగా మాత్రమే వారసులు నిలదొక్కుకుంటున్నారు. కొందరు స్టార్ కిడ్స్ హీరోయిన్స్‌గా ఎంట్రీ ఇచ్చినప్పటికీ వారు అంతగా రాణించలేక పోతున్నారు. కానీ నార్త్ ఇండియాకు చెందిన స్టార్ కిడ్స్ సౌత్ ఇండియాలో వరుసగా ఆఫర్లు సొంతం చేసుకుంటున్నారు. అందుకే బాలీవుడ్ స్టార్ కిడ్స్‌కి మంచి డిమాండ్ ఉంది. వద్దన్నా ఆఫర్లు ఇచ్చేందుకు ఫిల్మ్ మేకర్స్ రెడీ అంటున్నారు. ఇప్పటికే షారుఖ్ ఖాన్ కూతురు, ఆమీర్ ఖాన్, కూతురు, సైఫ్ అలీ ఖాన్ కూతురు ఇలా ఎంతో మంది స్టార్ కిడ్స్ హీరోయిన్స్‌గా ఎంట్రీ ఇచ్చారు. బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగన్ కూతురు నైషా దేవగన్ హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వబోతుంది అనే వార్తలు వచ్చాయి. నైషా తల్లి కాజోల్ సైతం బాలీవుడ్‌లో హీరోయిన్‌గా స్టార్‌డం దక్కించుకుంది. అమ్మా, నాన్న ఇద్దరూ స్టార్స్ కావడంతో నైషా ఖచ్చితంగా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా నటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంతా భావించారు. ఆమె సోషల్ మీడియా ప్రొఫైల్ చూస్తే నైషా కి నటనపై ఆసక్తి ఉన్నట్లు అనుకుంటారు. కానీ తాజాగా నైషా తల్లి కాజోల్ ఒక మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆ విషయమై క్లారిటీ ఇచ్చింది. నైషా ఎంట్రీ కోసం ఎదురు చూస్తున్న అజయ్ దేవగన్ అభిమానులు నిరుత్సాహపడే విధంగా ప్రకటన చేసింది. నైషాకి హీరోయిన్‌గా నటించాలనే ఆసక్తి లేదని క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం ఆమె చిన్న వయసు అమ్మాయి. ఆ కారణంగా నటనపై ఆసక్తి చూపడం లేదు. ముందు ముందు కూడా ఆమెకు నటనపై ఆసక్తి కలుగుతుంది అనే నమ్మకం లేదు అన్నట్లుగా కాజోల్ చెప్పుకొచ్చింది. నైషా హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తానంటే ఆఫర్లు ఇచ్చేందుకు ఎంతో మంది ఫిల్మ్ మేకర్స్ రెడీగా ఉన్నారు. ముఖ్యంగా స్టార్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ గతంలోనే పలు సార్లు కాజోల్‌ను, అజయ్ దేవగన్‌ను నైషా ఎంట్రీ గురించి అడిగాడని తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో నైషా ఎంట్రీ గురించి మరోసారి వార్తలు వస్తున్న కారణంగా కాజోల్ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. ఇకపై నైషా సినిమా ఎంట్రీ గురించి ఎలాంటి పుకార్లు ఉండకూడదని ఆమె భావిస్తోంది. భవిష్యత్తులో నైషాకి నటించాలనే ఆసక్తి కలిగితే కచ్చితంగా ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులుగా మేము సిద్ధంగా ఉన్నామని కాజోల్ చెప్పుకొచ్చింది. సోషల్ మీడియాలో నైషాకి ఉన్న ఫాలోయింగ్ నేపథ్యంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వాలని చాలా మంది కోరుతున్నారు. అమ్మా నాన్న ఇండస్ట్రీలో స్టార్స్ అయినప్పటికీ నైషా మాత్రం తన రూటే సపరేటు అన్నట్లుగా వ్యవహరిస్తుంది. ముందు ముందు అయిన తన తోటి వారిని ఫాలో అయ్యి హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తుందేమో చూడాలి.

# సితారకు సంయుక్త సెంటిమెంట్ పట్టుకుందా?


టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. అభిరుచి గల నిర్మాతగా మంచి పేరుతెచ్చుకున్న సూర్యదేవర నాగవంశీ విభిన్నమైన కథలతో అటు పెద్ద చిత్రాలు, ఇటు యూత్ మెచ్చే సినిమాలు చేస్తూ నిర్మాతగా ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రస్తుతం యంగ్ హీరోలతో సినిమాలు చేస్తూనే క్రేజీ స్టార్లతో సినిమాలు చేస్తున్నాడు. విజయ్ దేవరకొండతో కింగ్‌డమ్ మూవీని నిర్మిస్తున్న సూర్యదేవర నాగవంశీ త్వరలో మరో భారీ మల్టీలింగ్వల్ మూవీకి శ్రీకారం చుట్టబోతున్నారు. దీనికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహించనున్నారు. ఇదే బ్యానర్‌లో నితిన్‌తో రంగ్ దే, ధనుష్‌తో సార్, దుల్కర్ సల్మాన్‌తో లక్కీ భాస్కర్ వంటి వరుస విజయాల్ని దక్కించుకుని హ్యాట్రిక్ హిట్‌ని సొంతం చేసుకున్నారు.



తాజా ప్రాజెక్ట్ సితారలో వెంకీ అట్లూరికి నాలుగవ సినిమా కాబోతోంది. ఇందులో సూర్య హీరోగా నటించబోతున్నాడు. ఇప్పటికే స్టోరీ విన్న సూర్య ఇందులో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడట. ఇందులో సూర్యకు జోడీగా ఇద్దరు క్రేజీ హీరోయిన్‌లు నటించబోతున్నారు. ఓ హీరోయిన్‌గా మిస్టర్ బచ్చన్ ఫేమ్ భాగ్యశ్రీ బోర్సేని అనుకుంటున్నారట. మరో నాయిక పాత్ర కోసం డ్రాగన్ ఫేమ్ కయదు లోహర్‌ని పరిశీలిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఆ క్యారెక్టర్ కోసం కయదును కాకుండా సంయుక్త మీనన్‌ని తీసుకోవాలని సితార వంశీ భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. సితారలో సంయుక్త ఇప్పటి వరకు రెండు సినిమాల్లో నటించింది. భీమ్లానాయక్‌లో రానాకు జోడీగా కనిపించిన సంయుక్త మీనన్ ఆ తరువాత సార్ మూవీలో ధనుష్‌కు జోడీగా నటించింది. ఇప్పుడు సూర్య ప్రాజెక్ట్‌కు ఫైనల్ అయితే సితార తనకిది హ్యాట్రిక్ ఫిల్మ్ కానుంది. ఒక బ్యానర్‌లో వరుసగా ఒకే హీరోతో సినిమాలు చేసిన వారున్నారు. కానీ ఒకే హీరోయిన్‌తో మూడు సినిమాలు చేసిన సంస్థలు టాలీవుడ్‌లో చాలా అరుదు. ఆ విషయంలో సితార ముందు నిలుస్తోందని, సితారకు సంయుక్త సెంటిమెంట్ పట్టుకుందని టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది

# తిండి లేక సన్నగా అయిపోయిన నటుడు!

సంగీత్ శోభన్ ఇప్పుడు పరిచయం అవసరం లేని పేరు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ విజయాలతో టాలీవుడ్ లో వెల్ నోన్ గా మారిపోయాడు. సోలోగానూ ఇప్పుడు అవకాశాలు అందుకుంటున్నాడు. భవిష్యత్ లో మంచి స్టార్ గా ఎదుగుతాడు? అన్న నమ్మకం వ్యక్తమవుతుంది. అల్లరి నరేష్ ని రీప్లేస్ చేస్తాడు? అన్న అంచనాలున్నాయి. ఇప్పటికే హీరోగా నిహారిక కొణిదెల ఓ చిత్రాన్ని కూడా ప్రారంభించిన సంగతి తెలిసిందే. సంగీత్ శోభన్ అంటే బాల నటుడు అని కొందరికే తెలుసు. గోల్కొండ హైస్కూల్ లో స్కూల్ విద్యార్థి



పాత్రలో నటించాడు. అందులో బొద్దుగా ఉంటాడు. పిట్ట చిన్నదైనా కూత ఘనం అయిన మాదిరి సినిమాలో పాత్ర యాటిట్యూడ్ తో బాగానే కనిపిస్తాడు. అందులో సంగీత్ ని చూసి...ఇప్పుడు సంగీత్ ని చూస్తే అతడు ఇతడేనా? అన్న డౌట్ రావడం సహజం. సహజంగా వయసు పెరిగే కొద్ది మార్పులొస్తాయి. కానీ సంగీత్ లో మార్పులు మాత్రం ఏమాత్రం నమ్మశక్యంగా రాలేదు. చిన్నప్పటి పోలిక ఒక్కటి కూడా ఇప్పుడు ఎక్కడా కనిపించడదు. మరి ఇంత సన్నగా సంగీత్ ఎలా మారాడు? సినిమాల కోసం మారాడా? అంటే అంత సీన్ లేదంటున్నాడు సంగీత్. తాను చిన్నప్పటి నుంచి ఇంటర్మీడియట్ వరకూ కూడా అదే లావుతో ఉండే వాడినన్నాడు. ఇంటర్మీడియట్ తర్వాత కర్ణాటక మణిపాల్ యూనివర్శిటీలో చదువు కోసం వెళ్లడంతో రూపం మారిపోయిందంటున్నాడు. కర్ణాటకలో సరైన ఫుడ్ ఫుడ్ దొరకకపోవడం.. ట్రావెలింగ్ సదుపాయం లేకపోవడంతో ఎక్కడికైనా నడిచే వెళ్లడం వంటివి చేయడంతో సహజంగానే ఉన్న బరువంతా కోల్పోయినట్లు తెలిపాడు. అంతకు మించి బరువు తగ్గడం కోసం తాను ప్రత్యేకంగా ఎలాంటి డైట్లు పాటించలేదన్నాడు.

నటుడు అవుదాం అనుకున్న సమయంలో? చిన్నపాటి మార్పులు మాత్రమే చేసానంటున్నాడు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536